


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఇంటిపనివారలకు సమగ్ర చట్టం – సుప్రీం ఆదేశం

అటవీ శాఖలో ఆదాయం రెట్టింపు

భారతీయులకు సంకెళ్లు వేయడం అమానుషం

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 74 | మంగళవారం | 11-02-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

- ఆ దేశ అధ్యక్షుడు మాక్రాన్‌తో భేటీ
- ఎఐ సభకు సహ అధ్యక్షత
- మోదీ ఫ్రాన్స్ పర్యటన ఇది ఆరోసారి

5



## కుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపది

- త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం
- కట్టుదిట్టమైన భద్రత
- ప్రయాగ్‌రాజ్‌లో వందల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

## రెండెకరాల్లోపు రైతు భరోసా

3

- 13.23 లక్షల మంది రైతులు, 18.19 లక్షల ఎకరాలకు రూ.1091.95 కోట్లు జమ

### దోషులుగా తేలిన సభ్యులు...

# చట్టసభకు ఎలా వెళ్తారు?

వారు చట్టాలను సవరించుకునే అవకాశం ఉంది

జీవితకాల నిషేధంపై కేంద్రం, ఎన్నికల సంఘం వైఖరేంటో మూడు వారాల్లో చెప్పాలని కోరిన సుప్రీంకోర్టు

నేరపూరిత రాజకీయాలు దేశంలో అతిప్రధాన సమస్య అని ఆందోళన

''రాజకీయాలను నేరపూరితం చేయడం అత్యంత తీవ్రమైన, ప్రధానమైన సమస్య అని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8, 9 చెల్లుబాటుకు ఎదురైన ఈ సవాలుపై ప్రతిస్పందించాలని కోరింది. నేరాలు చేసినట్లు రుజువైన ఎంపీలు, ఎంఎల్‌ఎలు జైలుశిక్షలు అనుభవించిన తర్వాత కేవలం ఆరేళ్ళు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా ఉండాలని ప్రజాప్రాతినిధ్యచట్టంలో పేర్కొన్న నిబంధనలను కూడా అశ్వనీకుమార్ ఉపాధ్యాయ తన వ్యాజ్యంలో సవాలు చేశారు.




**న్యూఢిల్లీ :** న్యాయస్థానంలో దోషిగా తేలిన ఒక సభ్యుడు మళ్ళీ పార్లమెంటు లేదా అసెంబ్లీ వంటి చట్టసభలలోకి ఎలా ప్రవేశిస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ''ఒకసారి న్యాయస్థానం దోషిగా గుర్తిస్తే దోషిగా తేలినట్టే, మళ్ళీ వాళ్ళు పార్లమెంటుకు, శాసనసభకు ఎలా వెళతారు? దీనికి వారు సమాధానం చెప్పాలి. ఇందులో ఆసక్తికరమైన వైరుధ్యం కూడా ఉంది, ఏమిటంటే వారు చట్టాలను తమకు అనుకూలంగా సరిచేసుకునే అవకాశం ఉంది'' అని ధర్మాసనం పేర్కొంది. న్యాయస్థానాలు దోషులుగా గుర్తించిన పార్లమెంటు సభ్యులు, రాష్ట్రాలలో శాసనసభ్యులు, ఇతర చట్టసభల సభ్యులపట్ల కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం ఎలాంటి వైఖరి అనుసరిస్తాయో మూడు వారాలలో సమాధానం చెప్పాలని కోరింది. దేశంలో రాజకీయాలను నేరపూరితం చేయ డం అతి ప్రధానమైన సమస్యగా ఉందని స్పష్టం చేసింది. అందువల్ల ఈ కేసులో భారత అటార్నీ జనరల్ కూడా పరిష్కారాల సూచనకు తగిన సహాయ సహకారాలు అందించాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం కోరింది. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులపై ఉన్న నేరాల కేసుల విచారణ ఆగిపోవడానికి కారణం ఏమిటి? లోపం ఎక్కడ జరుగుతోంది? అని ఈ కేసులో సుప్రీంకోర్టు మధ్యవర్తిగా నియమించిన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియాను ధర్మాసనం ప్రశ్నించి వివరాలు తెలుసుకుంది. పదే పదే కేసులు వాయిదా వేస్తున్నారని, నిర్ణీతమైన తేదీల ప్రకారం సాక్ష్యులు కోర్టుముందు సాక్ష్యం చెప్పడానికి రావడంలేదని, యంత్రాంగం సమర్థవంతంగా వ్యవహరించడంలేదనీ హన్సారియా బదులిచ్చారు. చట్టసభ సభ్యులకోసం నియమించిన ప్రత్యేక కోర్టులు ఈ కేసుల విచారణ చేయకుండా ఇతర కేసులు కూడా చేపట్టి బిజీగా ఉంటున్నాయని అన్నారు. దీనికి న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ అభ్యంతరం చెప్పారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులో కేసులు కొన్నే ఉన్నాయని, దీనిని సాధారణీకరణచేసి మాట్లాడుతున్నారన్నారు. దీంతో హన్సారియా వివరణ ఇస్తూ, ఢిల్లీ ఒక్కటే తగిన ఉదాహరణ కాదనీ, ఇతర రాష్ట్రాలలో తరువాయి 2లో

## మణిపూర్ హింసలో బీరెన్‌సింగ్ జోక్యంపై

# ఉన్నతస్థాయి విచారణ

- బిజెపి ప్రభుత్వం విఫలమైందని మోదీ ఒప్పుకోవాలి : సిపిఐ డిమాండ్
- అసెంబ్లీలో అవిశ్వాసం తప్పించుకోవడానికే రాజీనామా : ప్రతిపక్షాలు విమర్శ



**న్యూఢిల్లీ :** మణిపూర్ ముఖ్యమంత్రి పదవికి ఎన్.బీరెన్ సింగ్ చాలా ఆలస్యంగా రాజీనామా చేశారని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) విమర్శించింది. అంతకుమించినవిధంగా మణిపూర్‌లో జరిగిన హింసలో బీరెన్ సింగ్ జోక్యం ఉందని వచ్చిన ఆరోపణలపై ఉన్నతస్థాయిలో నిష్పాక్షిక విచారణ జరపాలని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ సోమవారం ఒక ప్రకటన చేస్తూ, అటు భారతీయ జనతాపార్టీ, ఇటు బీరెన్ సింగ్ ఇద్దరూ మణిపూర్ ప్రజల విశ్వాసం కోల్పోయారని విమర్శించింది. 'దాదాపు రెండు సంవత్సరాలపాటు తీవ్ర హింస, అల్లర్లు జరిగిన తర్వాత మణిపూర్ ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేశారు. 'డబుల్ ఇంజన్ ప్రభుత్వం'గా ప్రచారం చేసుకుంటున్న బిజెపి పూర్తిగా విఫలమైందని అంగీకరిస్తూ ఎన్.బైరెన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేయాలని సిపిఐ వంటి అనేక ప్రతిపక్షాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు అసంఖ్యాకంగా ప్రజలు ప్రాణాలు మూల్యంగా చెల్లించిన తర్వాత, వేలాది మంది ప్రజలు భయంతో ఇళ్ళు తరువాయి 2లో

# ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

- ఇసుక రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలి
- ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించం : సహకరించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరిక
- ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచన



ప్రజాపక్షం / హైదరాబాద్

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ''ఇసుక రీచ్‌ల వద్ద వెంటనే అధికారులు తనిఖీలు చేపట్టాలి. అవసరమైతే తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తాను. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదు.'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుకను అందించేందుకు, సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తరువాయి 2లో

# త్వరగా జనాభా గణన

రాజ్యసభలో సోనియాగాంధీ డిమాండ్

ఉచిత, సబ్సిడీ అహార పదార్థాలు పొందకుండా 14కోట్ల మంది నష్టపోతున్నారని ఆవేదన

యుపిఎ ప్రభుత్వ హయాంలోనే ఆహార భద్రత చట్టం తీసుకొచ్చామని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** దేశంలో సాధ్యమైనంత తొందరగా జనాభా గణన పూర్తి చేయాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ డిమాండ్ చేశారు. దాదాపు 14 కోట్ల మంది జనాభా ఉచిత, సబ్సిడీ ఆహార పదార్థాలకు ఆహార భద్రతా చట్టం కింద లభించే ప్రయోజనాలను కోల్పోతున్నారని చెప్పారు. సోమవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో సోనియా గాంధీ మాట్లాడుతూ ప్రస్తుతం జనాభా ఆధారంగా కాకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) కింద లబ్ధిదారులను గుర్తించారని, అందువల్ల అనేక మంది తమకు అందే ప్రయోజనాలను తరువాయి 2లో



# ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసే కుట్ర

- విద్య కాషాయీకరణలో భాగమే యుజిసి ముసాయిదా
- విసి, ప్రొఫెసర్ల నియామకంపై ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి
- ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలలో ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్




ప్రజాపక్షం / హైదరాబాద్

దేశంలో ఉన్నత విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసే కుట్ర జరుగుతున్నదని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం జాతీయ నూతన విద్యా విధానం 2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకుంటూ విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తుందని, అందులో భాగంగానే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) 2025 జారీ తరువాయి 2లో



# పరీక్షలే జీవితం కాదు

- జ్ఞానం కూడా ముఖ్యమే
- విజ్ఞానం, పరీక్షలు రెండు భిన్నమైన అంశాలు
- ఇతరులకు ఆదర్శంగా చూపేందుకు పిల్లలపై తల్లిదండ్రులు వత్తిడి తేవొద్దు
- 'పరీక్షా పే చర్చ'లో ప్రధాని

**న్యూఢిల్లీ :** పరీక్షలే జీవితం కాదని, దానితోనే జీవితం సాగుతుందనుకోవడం పొరపాటని ప్రధాని మోదీ విద్యార్థులకు ఉద్బోధించారు. ఎనిమిదో వార్షిక 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా మోదీ విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలే జీవిత పరమార్థం కాదన్నారు. పరీక్షలతోపాటు జ్ఞానం కూడా ముఖ్యమని, ధ్యానం ద్వారా నాయకత్వ లక్షణాలను పెంచుకోవచ్చని సంబంధిత అంశాలపై విద్యార్థులతో చర్చించారు. సాంప్రదాయ టౌన్ హాల్ తరహాలో కాకుండా ఈసారి సుందర్ నర్సరీలో 35మంది విద్యార్థులతో మోడి ఆహ్లాదకర వాతావరణంలో ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రసారమైన కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములయ్యారు. విజ్ఞానం, పరీక్షలు రెండు భిన్నమైన అంశాలని, ఎవరూ పరీక్షలే పరమావధి అన్న భావనలో విద్యార్జన చేయరాదన్నారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా తమ అభిరుచులను తీర్చుకునేందుకు కృషి చేయాలన్నారు. తమ సమయాన్ని అర్థవంతంగా తరువాయి 12లో

# బిజెపితో కెసిఆర్ లోపాయికారి ఒప్పందం

కేంద్రం నుంచి బండి సంజయ్ నయాపైసా తేలే : పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

## అట్టహాసంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్ నుంచి తెలంగాణ చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ దాఖలు చేశారు. మహిళల కోలాటాలు, డప్పు చప్పుళ్లు, ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల నడుమ ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తరువాయి 12లో

### 'స్థానికం'లో బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి

# డెడికేటెడ్ కమిషన్ నివేదిక

సిఎస్ శాంతి కుమారికి అందజేసిన కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర రావు

బిసిల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై పలు సిఫారసులు చేసినట్లు సమాచారం




ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ''డెడికేటెడ్ కమిషన్'' తన పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర రావు హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికమారికి సోమవారం 'డెడికేటెడ్' నివేదికను సమర్పించారు. ఈ నివేదికలో బిసిల రిజర్వేషన్ల సంఖ్యను పెంచాలని సిఫారసు చేస్తూనే, ఇప్పటి వరకు చట్టసభలలో అడుగుపెట్టని కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా కమిషన్ సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో బిసిల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై కూడా పలు సిఫారసులు చేసినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో తరువాయి 2లో

# మిర్చి రైతు కంట నీరు

- ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన ఎర్ర బంగారం
- లక్ష బస్తాలు రావడంతో ధర పతనం
- పెట్టుబడి కూడా రాదన్న వేదనలో సాగుదారులు

ప్రజాపక్షం/ఖమ్మం

మిర్చి రైతు కంట కన్నీరు ఒలుకుతుంది. మిర్చి ఘాటుకు ఎర్రబడాల్సిన రైతు ముఖం ధర పతనంతో నల్లబారి ఏమి చేయాలో పాలుపోని స్థితికి చేరుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరల నియంత్రణపై పాలకులు పట్టు కోల్పోవడంతో రైతులు దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. సోమవారం ఖమ్మం మార్కెట్‌కు లక్ష బస్తాల మిర్చి వచ్చింది. అంతే మిర్చి అధికంగా రావడం గమనించిన వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారు. జెండాపాట రూ.14వేలు పలకగా రూ. 10వేల నుంచి రూ.11వేలకు మాత్రమే మిర్చిని కొనుగోలు చేశారని అతికొద్ది మంది రైతులకు సంబంధించి రూ.13వేల వరకు కొనుగోలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో ధరను నియంత్రించి రైతులకు నష్టం కలిగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష తర్వాత కూడా వ్యాపార వర్గాల్లో మార్పు రాకపోవడం గమనార్హం. ఇటీవల రైతు సంఘాల ఆందోళన సందర్భంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తరువాయి 12లో



# మద్దతు ధరల్లో ఇబ్బందులు రానివ్వొద్దు

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం




ప్రజాపక్షం/హైదరాబాద్

కందులు, మిర్చి తదితర అన్ని రకాల పంటలకు రైతులు మద్దతు ధర పొందేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కందులు ఒక్కటే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరకాలంలో రైతులు పండించే ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఏడాది కాలంలో రూ.412.62 కోట్లు వెచ్చించి రైతుల వద్ద నుంచి వివిధ పంటలను సేకరించామని మంత్రి స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు తరువాయి 2లో

# గాజాను కొంటాం,సొంతం చేసుకుంటాం

### ఈ రియల్ ఎస్టేట్ ప్లాన్ పెద్ద అవినీతి : షుల్జ్

### ఎవ్వరికీ అధికారంలేదుః ఎర్డొగాన్


**బెర్లిన్ :** గాజా ప్రాంతాన్ని కొనుగోలు చేస్తాం, తమ సొంతం చేసుకుంటాం అని అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ సోమవారంనాడు మరోసారి స్పష్టం చేశారు. దీంతో అమెరికా ఆలోచనలను ప్రపంచదేశాలు సీరియస్‌గా పరిగణిస్తున్నాయి. సూపర్‌బౌల్ పోటీలకు వెళుతూ సైనిక విమానంలో పాత్రికేయులతో ట్రంప్ ఈ తాజా ప్రకటన చేశారు. ప్రస్తుతం శిథిలంగా మారిన గాజా స్ట్రిప్ ఒక పెద్ద రియల్ ఎస్టేట్ ప్రాంతమని, పొరుగుదేశాలు కూడా దీని అభివృద్ధిలో పాలుపంచుకోవచ్చుననీ అన్నారు. అందుకు తాము అనుమతిస్తామన్నారు. జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ దీనిపై స్పందిస్తూ, డోనాల్డ్ ట్రంప్ తలపెట్టిన గాజా రియల్ ఎస్టేట్ ప్లాన్ అతిపెద్ద అవినీతి చర్య అని విమర్శించారు. గాజా నుండి పాలస్తీనియన్లను ఖాళీ చేయిస్తామనీ, పశ్చిమ ఆసియాలో అత్యంత సుందరమైన కోస్తాతీర ప్రాంతంగా గాజా స్ట్రిప్‌ను తీర్చి దిద్దుతామని ట్రంప్ అన్నారు. జర్మనీలో ఈనెల 23వ తేదీన సార్వత్రిక ఎన్నిల సందర్భంగా సోమవారం జరిగిన టివీ ప్రచార డిబేట్‌లో షుల్జ్ మాట్లాడుతూ, ట్రంప్ తలపెట్టిన "గాజా రియల్ ఎస్టేట్‌ప్లాన్"ను ఒక స్కాండల్‌గా అభివర్ణించారు. ఇది మానవ నైతిక విలువలకు, అంతర్జాతీయ న్యాయానికి విరుద్ధమైన చర్యలని అన్నారు. పాలస్తినా ప్రజలను శరణార్థులుగా మార్చి ఇతర దేశాలలో అనాథలుగా బ్రతికే ఏర్పాట్లు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన చర్యలన్నారు. షుల్జ్‌కు వ్యతిరేకంగా పోటీ చేస్తున్న జర్మనీ కన్జర్వేటివ్ అభ్యర్థి ఫ్రెడరిక్ మెర్జ్ కూడా ఓలాఫ్ షుల్జ్ వాదనను సమర్థించారు. ఈ విషయంలో ఆయనతో ఏకీభవించారు. ఐతే గాజాలో ప్రణాళికను అమలు చేసేవిషయంలో చాలాకాలం ఎదురుచూడాల్సి ఉందని, ఇది ఎంతవరకూ అమలు జరుగుతుందో వేచిచూడాలని, పరిస్థితులు గమనించి ఆ తర్వాతే పూర్తి నిర్ణయం తీసుకోవాలన్నారు. ట్రంప్ మాటల్లో వాచాలత్వం ఎక్కువ ఉందని, భేషజపు ప్రకటనలు ఎక్కువచేస్తున్నారన్నారు. ఈజిప్టు అధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డొగాన్ స్పందిస్తూ గాజా నుండి పాలస్తీనియన్లను దూరం చేసేఅధికారం, దాన్ని సొంతం చేసుకునే అధికారం ఎవ్వరికీ లేదని అన్నారు. ట్రంప్ రోజు రోజుకూ సహనం కోల్పోతున్నారనీ, గాజాలో హమాస్ ఉనికిని సహించలేకపోతున్నారనీ విమర్శించారు.మరో ప్రత్యామ్నాయం లేకపోవడంవల్లనే 20 లక్షలమంది పాలస్తీనియన్లు గాజాకు తిరిగి వచ్చారని ట్రంప్ అన్నారు. ఆయన ప్రకటనలు అరబ్ ప్రపంచంలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. చమురు సమృద్ధంగా గల దేశం సౌదీ అరేబియా రాజ్యపాలకుడు కూడా ట్రంప్‌పై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. సౌదీతో తిరిగి అమెరికా సాధారణ పరిస్థితులను పునరుద్ధరించుకోవడం చాలా కష్టం అవుతుందనీ సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయంలో పశ్చిమ ఆసియా అధ్యయనాల పరిశోధకుడు జేమ్స్ డోర్సే అన్నారు. పశ్చిమ ఆసియాలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉన్న సౌదీ అరేబియాకు పొరుగున ఉన్న జోర్డాన్,ఈజిప్టు దేశాలు శరణార్థులకు తావిస్తే సౌదీఅరేబియా అస్థిరతకు గురవుతుంది. ఇదే జరిగితే ఇజ్రాయెల్‌ను గుర్తించేవిషయంలో సౌదీ పాలకులు నిర్మొహమాటంగా తలుపులు మూసేస్తారని ఆయన అంచనా వేస్తున్నారు.

# అమెరికాపై అమలులోకి వచ్చిన చైనా టారిఫ్‌లు



**బీజింగ్ :** అమెరికా దిగుమతులపై చైనా ఈనెల నాలుగో తేదీన ప్రకటించిన టారిఫ్‌లు సోమవారం (10వ తేదీ) నుండీ అమలులోకి వచ్చాయి. 25 అరుదైన లోహాల దిగుమతులపై చైనా టారిఫ్‌లు విధించింది. మొత్తం 14 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులపై చైనా 'దెబ్బకు దెబ్బ' అనే రీతిలో అమెరికాపై పెంచిన టారిఫ్‌లను అమలులోకి తెచ్చింది. అమెరికా నుండి దిగుమతయ్యే బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ ఉత్పత్తులపై 15 శాతం సరిహద్దు పన్నులతోపాటు అమెరికా ముడి చమురు, వ్యవసాయ యంత్రాలు, భారీ వాహనాల ఇంజన్లపై 10 శాతం అదనపు టారిఫ్‌లను అమలులోకి తెచ్చింది. ఈ టారిఫ్‌లు ఫిబ్రవరిఇ 10వ తేదీ నుండి అమలులోకి వస్తాయని చైనా ప్రభుత్వం వారం రోజులు ముందుగానే ప్రకటించింది. అదేవిధంగా చైనా నుండి దిగుమతయ్యే అల్యూమినియం, ఉక్కు దిగుమతులపై 25 శాతం టారిఫ్‌ల పెంపును సోమవారంనాడే ప్రకటిస్తామని సూపర్ బౌల్ పోటీలు చేసేందుకు వెళుతున్న సందర్భంగా విమానంలో పాత్రికేయులకు అమెరికా అధ్యక్షుడు టంప్ చెప్పారు. 2024లో చైనా నేరుగా అమెరికాకు 8.90 లక్షల టన్నుల అల్యూమినియంను ఎగుమతి చేసింది. 2018లో కూడా ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు ఇదేవిధంగా టారిఫ్‌లు పెంచారు. అందుకు బదులుగా ప్రతీకార టారిఫ్‌లు కూడా అమెరికాపై అమలయ్యాయి. భారత్ సహా అన్ని దేశాలపైన టారిఫ్‌ల మోత మోగుతుందని ట్రంప్ తాజాగా చెప్పారు. ట్రంప్ ప్రకటనవల్ల అమెరికాలో చమురు, అల్యూమినియం ధరలు భారీగా పెరిగిపోతాయి. ఇప్పటికే ఆ ధోరణి ట్రంప్ వాణిజ్య విధాన ప్రకటన ప్రభావం కనిపిస్తున్నది. అదేవిధంగా వైట్‌హౌస్‌లో పునర్నిర్మాణ కార్యక్రమాలు కూడా చేపడతామని ట్రంప్ పాత్రికేయులతో అన్నారు. దీంతో 70 సంవత్సరాల తర్వాత మొదటిసారి వైట్‌హౌస్‌లో పునర్నిర్మాణ కార్యక్రమాలు జరగనున్నాయి. 10 మిలియన్ డాలర్ల సొంత ఖర్చుతో బాల్‌రూమ్స్ నిర్మిస్తానని సూపర్‌బౌల్ కార్యక్రమంలో ఆయన హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. క్రైస్తవ మత వ్యతిరేకతను నియంత్రించేందుకు క్రైస్తవమతంపై వివక్షను అడ్డుకునేందుకు స్కూళ్ళలో, బహిరంగ ప్రదేశాల్లో ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తానని కూడా ఆయన చెప్పారు.

## ప్రపంచం

# ఈక్వెడార్ అధ్యక్ష పదవికి సోషలిస్టులే ప్రధానపోటీ

### ఏప్రిల్‌లో తుది విడత ఎన్నికలు




**క్వీటో :** దక్షిణఅమెరికా వాయువ్యప్రాంతదేశం రిపబ్లిక్ ఆఫ్ ఈక్వెడార్‌లో అధ్యక్షపదవికి మొదటి విడత జరిగిన ఎన్నికల ఫలితాలు ఎటూ తేలలేదు. సోషలిస్టుల తరపున పోటీ చేసిన లూసియా గొంజాలెజ్ దేశాధ్యక్షుడు నోబొయాకు గట్టి సవాలు విసరడంతో మొదటి విడత ఎన్నికల్లో ఇద్దరికీ సమానంగా ఓట్లు లభించాయి. దీంతో పోలింగ్ టై–అప్ ఐనట్లు ప్రకటించారు. వీరిద్దరిమధ్య రాబోయే ఏప్రిల్ నెలలో రెండో విడత ఎన్నికలు జరుగుతాయి. డెమొక్రటిక్ సోషలిస్ట్‌లకు చెందిన రాజకీయపార్టీ "సిటిజన్స్ రివల్యూషన్ మూమెంట్" (సిఆర్‌ఎం)కు చెందిన నాయకురాలు లూసియా మగ్దలెనా గొంజాలెజ్ అల్సివార్ (48) ప్రస్తుత దేశాధ్యక్షుడు డేనియల్ రాయ్ గిల్‌క్రిస్ట్ నోబొయా అజిన్ (38)కు గట్టి పోటీ ఇవ్వడంతో ఇద్దరికీ చెరిసమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో సందిగ్ధం ఏర్పడింది. రెండోవిడత రనాఫ్ ఎన్నికలు రెండు నెలల తర్వాత జరుగుతాయి. మధ్యస్థ మితవాద "క్రియేటింగ్ ఆపర్చునిటీస్" పార్టీనాయకుడు, వ్యాపారవేత్త, బ్యాంకర్ గుల్లెర్మో లాస్సో (70) 2021లో అధ్యక్ష పదవికి గెలిచారు. తర్వాత ఆయన పదవి నుండి వైదొలగిన తర్వాత 2023లో జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో గొంజాలెజ్‌పై నేషనల్ డెమొక్రటిక్‌పార్టీ తరపున పోటీచేసి గెలిచిన నోబొయా 35 ఏళ్ళ అతి చిన్న వయసులో దేశాధ్యక్ష పదవి చేపట్టారు.ఈ తాజా ఎన్నికల్లో గొంజాలెజ్ ఆయనపై మరోసారి పోటీ చేశారు. ఈసారి ప్రజల్లోకి చొచ్చుకుపోయి నువ్వా?నేనా? అనే రీతిలో సమాన ఓట్లు సంపాదించడంతో విజేతను ప్రకటించలేకపోయారు. 2023 అక్టోబరులో జరిగిన రనాఫ్ ఎన్నికల్లో కూడా గొంజాలెజ్‌కు దాదాపు 52 శాతం ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఈక్వెడార్ అధ్యక్షుడు నోబొయా ప్రపంచంలో అత్యంత యుక్త వయసులో అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న దేశాధిపతుల్లో మూడవ వారు. బుర్కినాఫాసో, ఐస్‌లాండ్ తర్వాత ఈక్వెడార్‌లో అతిచిన్న వయసులో దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాయకుడు నోబొయా. దేశంలో క్రిమినల్ గ్యాంగులను అణచివేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కాగా గొంజాలెజ్ స్పెయిన్ మాడ్రిడ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ప్రస్తుతం జాతీయ అసెంబ్లీ సభ్యురాలు.

**మూడేళ్ళ తర్వాత లెబనాన్‌లో పూర్తి ప్రభుత్వం**



మూడేళ్ళ తర్వాత లెబనాన్‌లో పూర్తిస్థాయి ప్రభుత్వం ఏర్పడింది. లెబనాన్ కొత్త ప్రధానమంత్రిగా నవాఫ్ సలామ్ బాధ్యతలు చేపట్టారు. దేశాధ్యక్షుడు జోసెఫ్ ఔన్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. సలామ్ మంత్రివర్గంలో 24 మంది క్యాబినెట్ మంత్రులు ఉన్నారు. వీరిలో సగంమంది క్రైస్తవులు, సగంమంది ముస్లింలు ఉన్నారు. ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య దక్షిణ లెబనాన్‌లో భీకరపోరాటం తర్వాత ఆ ప్రాంతాన్ని చక్కదిద్దే బాధ్యత కొత్త ప్రధానమంత్రిపై పడింది. ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌ను పూర్తిగా వదిలివెళ్ళిపోవాలని కొత్త ప్రధానమంత్రి సలామ్ అన్నారు. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసిజె) మాజీ అధ్యక్షుడైన సలామ్ లెబనాన్‌లో ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తాననీ, న్యాయవ్యవస్థను సంస్కరిస్తారని ప్రకటించారు.

# అమెరికా,ఇజ్రాయెల్‌లకు మరణశిక్ష

### ఇరాన్ విప్లవ వార్షికోత్సవంలో ప్రజల నినాదం

**టెహ్రాన్ :** ఇరాన్‌లో రాచరిక ప్రభుత్వం కుప్పకూలి ఆయొతుల్లా ఖొమైనీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 46 సంవత్సరాలైన సందర్భంగా ఇరాన్‌లో వార్షికోత్సవాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా రాజధాన టెహ్రాన్‌లో సోమవారంనాడు వేలాదిమంది గుమిగూడారు. వారిని ఉద్దేశించి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ప్రసంగించారు. ఇరాన్‌తో సంప్రదింపులు చేసేందుకు ఇరాన్ నిజంగా చిత్తశుద్ధితో సిద్ధంగా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. దీంతో అక్కడ గుమిగూడిన వేలాదిమంది ప్రజలు "డెత్ అమెరికా...డెత్ ఇజ్రాయెల్...." అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అమెరికా అంతం కావాలని నినాదాలు చేశారు. పహ్లవీ రాజవంశం (1925–1979)ను కూలదోసి ఇస్లామిక్ మతరాజ్యాన్ని ఆయొతుల్లా ఖొమైనీ నాయకత్వంలో షియా పాలక రాజ్యం 1979 ఫిబ్రవరి 11న ఆవిర్భవించింది. ట్రంప్ ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున ఇరాన్‌కు బెదిరింపులు ఎదురవుతున్న తరుణంలో పెజెష్కియన్ పైవిధంగా ట్రంప్‌ను ప్రశ్నించారు. పవిత్ర శుక్రవారంనాడు ఇరాన్ సర్వాధినేత ఖొమైనీ మాట్లాడుతూ, ట్రంప్ చర్చల ప్రతిపాదనను నమ్మలేమని, ఏ మాత్రం తెలివైనవారైనాగానీ అమెరికాను విశ్వసించబోరన్నారు. ఆ విధమైన ప్రభుత్వంతో ఎవ్వరూ సంప్రదింపులు చేయబోరని అన్నారు. టెహ్రాన్‌లో భయంకరమైన చలి వాతావరణం ఉన్నప్పటికీ వేలాదిమంది ప్రజలు జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆజాదీ స్క్వేర్ వరకూ ప్రదర్శన జరిపారు.

# ఎ ఐ సదస్సు ప్రమోషన్‌కు మేక్రాన్ డీప్‌ఫేక్ వీడియోల ప్రదర్శన

**పారిస్ :** పారిస్‌లో రెండురోజుల కృత్రిమ మేధ సదస్సులో ఫ్రాన్స్ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఎ ఐ ప్రాముఖ్యతను, ప్రమాదాన్ని తెలియజేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ డీప్ ఫేక్ వీడియోలను ప్రదర్శించారు. మేక్రాన్ స్టార్‌గా నటించిన పలు వేషాల్లో, పలు భంగిమలలో ఉన్న డీప్‌ఫేక్ వీడియోలను మేక్రాన్ ప్రదర్శించారు. ఈ వీడియోలన్నీ అందరి దృష్టినీ ఎంతో బాగా ఆకర్షించాయి. ఈ వీడియోలలో మేక్రాన్ ఒక దేశాధ్యక్షుడి గెటప్‌లో కాకుండా ఒక ర్యాపర్‌గా, వెస్టర్న్ యూత్‌గా, మహిళగా అనేక భంగిమలలో పొడుగాటి జుత్తుతో కనిపించారు. కాగా సోమ, మంగళవారాలలో రెండు రోజులపాటు పారిస్‌లో జరిగే ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు ద్వారా రాబోయే కాలానికిగాను ఫ్రెంచ్ దేశానికి మొదటి రోజు 109 మిలియన్ యూరోలు పెట్టుబడుల వాగ్దానాలు లభించాయి. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల నుండి ప్రముఖులు, కృత్రిమ మేధ నిపుణులు, దేశాధినేతలు తరలివచ్చారు. ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీల సి ఇ ఓలు పాల్గొన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా ఉపాధ్యక్షుడు ఝూంగ్ గుయోక్విన్ తదితర ప్రముఖులు ఈ సదస్సుకు వచ్చారు. "మనం సాంకేతిక యుగంలో బతుకుతున్నాం,ఒక శాస్త్రీయ సాంకేతిక విప్లవాన్ని మనం చాలా అరుదుగా చూస్తాం" అని మేక్రాన్ ఈ సదస్సులో అన్నారు. కృత్రిమ మేధలో మునిగితేలుతున్నాం, నిత్యజీవితంలో దీని ప్రాధాన్యత, ప్రమాదం బాగా పెరుగుతుంది" అని నాయకులు, సిఇఓలు అభిప్రాయపడ్డారు. దీని వినియోగానికి సంబంధించిన నైతిక అంశాలపై కూడా ఈ సదస్సు చర్చించింది. అనేకమంది యూరప్ నాయకులు జె.డి.వాన్స్‌ను కలుసుకోవడానికి ఈ సదస్సు ఒక మంచి అవకాశాన్ని ఇచ్చింది. అనేకమంది నాయకులతో జె.డి.వాన్స్ వర్కింగ్ లంచ్‌లో పాల్గొన్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఎఐ తదితర సంస్థలు పాల్గొంటున్నాయి.

## నిర్లక్ష్యం చేసే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

చేసిన ముసాయిదా మార్గదర్శకాలని ఆయన విమర్శించారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) జాతీయ సమితి సమావేశం సమాఖ్య జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ అధ్యక్షతన సోమవారం హైదారాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణరెడ్డి భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా దినేష్ సిరంగరాజ్ మాట్లాడుతూ తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని, యూజిసి 2025 ముసాయిదా మార్గదర్శకాలను ఉపసహరించుకోవాలని లేనట్లయితే విద్యార్థుల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే ప్రయత్నం ప్రధాని మోదీ ప్రభుత్వం చేస్తున్నదన్నారు. విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి విశ్వవిద్యాలయాలలో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని అన్నారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడం కోసమే యూజిసి 2025 సవరించిన నియమాలు వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ.స్టాలిన్, సంఘమిత్ర జెనా, సహాయ కార్యదర్శులు కె.శివారెడ్డి, కబీర్, హమిమ్ హంజా, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామక్రిష్ణ, జాతీయ సమితి సభ్యులు గ్యార నరేష్, బానోత్ రాఘురాం, గ్యార క్రాంతి, నాగజ్యోతి, నాసర్‌జీ, వలరాజు, సాయి కుమార్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా జనాభా గణన

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా జనాభా లెక్కల నవీకరణ చేసే అవకాశం లేనట్లుగా బడ్జెట్ కేటాయింపులను బట్టి తెలుస్తోందన్నారు. దీని వల్ల ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కింద దాదాపు 14 కోట్ల అర్హులైన భారతీయులు తమ సముచితమైన ప్రయోజాలను కోల్పోతున్నారన్నారు. 2013లో యుపిఎ ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎను తీసుకువచ్చిందని, దేశంలోని 140 కోట్ల జనాభాకు ఆహార, పోషకాహార భద్రతను కల్పించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని అని తెలిపారు. చట్టం గురించి సోనియా మాట్లాడుతూ ఆకలి చావుల నుంచి ప్రత్యేకించి కొవిడ్ సంక్షోభం సమయంలో మిలియన్ల దుర్బలమైన కుటుంబాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇప్పటికీ లబ్ధిదారుల కోటా 2011 జనభా లెక్కల ఆధారంగానే కేటాయిస్తున్నారన్నారు. దశాబ్దకాలంగా అనేకమంది లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎన్‌డిఎ పాలనలో దేశంలో జనాభా గణన నాలుగేళ్లకు పైగా ఆలస్యమయ్యిందని సోనియా విమర్శించారు. వాస్తవానికి 2021లోనే జనగణన నిర్వహించాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం దానిని విస్మరించిందని అన్నారు. తిరిగి ఎప్పుడు చేపడతారనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదని అసహనం వ్యక్తంచేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ద్వారా 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 81.35 కోట్ల మందికి లక్ష్యప్రజాపంపిణీ వ్యవస్థ (టిపిడిఎస్) ద్వారా అధిక సబ్సిడీలతో కూడిన ఆహారాపదార్థాలను అందిస్తున్నారు. అందులో గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతంమందికి, పట్టణ ప్రాంతాల్లో 50 శాతం మందికి లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక వ్యక్తికి 5 కిలోల ఆహార పదార్థాలను అందిస్తోంది. అయితే సాధ్యమైనంత తొందరగా దేశంలో జనాభా గణన చేయాలని, అర్హులైన వారందరికీ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ ద్వారా ప్రయోజనాలు కల్పించాలని సోనియాగాంధీ రాజ్యసభలో డిమాండ్ చేశారు. ఆహార భద్రత ప్రత్యేక హక్కు కాదని, అది ప్రాథమిక హక్కు అని అన్నారు. కాగా, ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) కింద ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ గడువును జనవరి 1, 2024 నుండి ఐదు సంవత్సరాలు పొడిగించారు.

# రామ రాజ్యం పేరుతో రావణ రాజ్యం చేస్తామంటే తీవ్ర చర్యలు

### రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** తెలంగాణలో రామ రాజ్యం పేరుతో రావణ రాజ్యం చేస్తామంటే తీవ్ర చర్యలు తప్పవని,హిందూధర్మం ఎన్నో నదులను తనలో కలుపుకునే మహాసముద్రం వంటిదని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.రామరాజ్యం పేరుతో తెలంగాణ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ రావణ రాజ్యం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని మంత్రి స్పష్టం చేశారు.కొందరు దుండగుల దాడిలో గాయపడి తీవ్ర విచారంలో వున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ తో పాటు అతని తండ్రి సౌందర రాజన్ ను మంత్రి సురేఖ వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. సిఎస్ రంగరాజన్ పై జరిగిన దాడిని మంత్రి సురేఖ తీవ్రంగా ఖండించారు. సంఘవ్యతిరేక శక్తులు తమ స్వప్రయోజనాల కోసం రాముని పేరుతో రాజకీయాలు చేస్తూ, ప్రశాంతంగా సాగుతున్న తెలంగాణ సమాజాన్ని అశాంతికి గురిచేసే చర్యలను ఉక్కుపాదంతో అణచివేస్తామని తేల్చి చెప్పారు. ఈ దాడికి కారకులైన వారిని చట్టబద్ధంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు.భవిష్యత్ లో ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలుంటాయని మంత్రి సురేఖ హెచ్చరించారు.

## ఎలా వెళ్తారు? (మొదటి పేజీ తరువాయి)

ఈ కేసుల విచారణకు తగినన్ని కోర్టులు లేవని చెప్పారు. దేశంలోని చట్టసభల సభ్యులు, మాజీ సభ్యులకు ఏవైనా కేసుల్లో శిక్షలు పడితే అలాంటి వారిని జీవితకాలంపాటు రాజకీయాల్లోకి రాకుండా నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్వనీకుమార్ ఉపాధ్యాయ 2016లో దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం ఈ వివరణ కోరింది. "రాజకీయాలను నేరపూరితం చేయడం అత్యంత తీవ్రమైన, ప్రధానమైన సమస్య అని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8, 9 చెల్లుబాటుకు ఎదురైన ఈ సవాలుపై ప్రతిస్పందించాలని కోరింది. నేరాలు చేసినట్లు రుజువైన ఎంపీలు, ఎంఎల్‌ఎలు జైలుశిక్షలు అనుభవించిన తర్వాత కేవలం ఆరేళ్ళు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా ఉండాలని ప్రజాప్రాతినిధ్యచట్టంలో పేర్కొన్న నిబంధనలను కూడా అశ్వనీకుమార్ ఉపాధ్యాయ తన వ్యాజ్యంలో సవాలు చేశారు.ఈ కేసు విచారణకు ముందురోజున సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు హన్సారియాను కోర్టు తరపున మధ్యవర్తిగా నియమించింది. ఈ కేసు పూర్వపరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరింది. దీనికి సంబంధించి ఆయన దాఖలు చేసిన పరిశీలనా అఫిడవిట్ ప్రకారం, దేశంలో 5,000 కేసుల్లో నిందితులుగా ఉన్న చట్టసభ సభ్యులు, మాజీ సభ్యులు వీటి దర్యాప్తు, కేసుల విచారణ ముందుకు కదలకుండా అడ్డుకుంటున్నారు. ఈ కేసులు ఒక్క అడుగు కూడా ముందుకు పడకుండా తీవ్ర ప్రభావం చూపిస్తున్నారు, వారు తమ అధికారం ఉపయోగించి విచారణ పూర్తి కాకుండా అడ్డం పడుతున్నారు. 42 శాతం మంది లోక్‌సభ సభ్యులపై ఉన్న క్రిమినల్ కేసులు గడచిన 30 సంవత్సరాలుగా న్యాయస్థానాలలో మూలపడి ఉండటం, విచారణ నిమిత్తం న్యాయమూర్తి ఎదుటకు రాకపోవడంపట్ల హన్సారియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కేసులు సత్వరం విచారణ జరిగేలా న్యాయస్థానాలకు తగిన ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేయాలని ఆయన సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్యచట్టంలో 8,9 అధికరణల చెల్లుబాటును, దోషిగా తేలి శిక్ష అనుభవించిన ప్రజాప్రతినిధికి కేవలం ఆరేళ్ళుమాత్రమే రాజకీయాలకు దూరంగా ఉండాలన్న పరిమితితోపాటు దశాబ్దాలుగా కేసులు పెండింగ్‌లో ఉండటాన్ని ప్రజాప్రయోజన వ్యాజ్యం సవాలు చేసిందని హన్సారియా ప్రముఖంగా కోర్టు దృష్టికి తెచ్చారు.2017లో 12 ప్రత్యేక కోర్టులను, మరో పది కోర్టులను వివిధ రాష్ట్రాలలో 2023 వరకూ ఏర్పాటు చేస్తూకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## విచారణ (మొదటి పేజీ తరువాయి)

వదలి పారిపోయిన తర్వాత వారిని పణంగా పెట్టాక ఎట్టకేలకు ఆయన రాజీనామా చేశారు. ఐతే ఇక ఈ రాజీనామా దిద్దుబాటు చర్యల దిశకు దారితీయాలి. అన్ని రాజకీయపార్టీలు, మణిపూర్‌లో శాంతిసాధనకోసం దీర్ఘకాలంగా కృషిచేస్తూ వచ్చిన సంబంధిత అనేకమంది వ్యక్తులు, సంస్థల భాగస్వామ్యంతో ఈ దిద్దుబాటు చర్యలు జరగాలి. ఇప్పటికైనా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరితాపం చెంది మణిపూర్ ప్రజలు పడుతున్న బాధలు, కష్టాలపట్ల అనివార్యంగా జాలి,దయ,కరుణ ప్రదర్శించాలి. మణిపూర్‌లో పరిస్థితిని అదుపు చేయడంలో తమ ప్రభుత్వం విఫలమైందని అంగీకరించాలి. మణిపూర్ రాష్ట్రంలో శాంతిసాధన మార్గాన్వేషణకు వీలుగా ఆ రాష్ట్రంలో పర్యటించకుండా మొహం చాటేసిన సిగ్గుమాలినతనాన్ని, మోదీ అంగీకరించాలి. ఇంకా ఎన్.బైరెన్‌సింగ్ ప్రభుత్వం మణిపూర్‌లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసింది. అసంఖ్యాంగా జర్నలిస్టులతోపాటు సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా, జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి నిషా సిధు, న్యాయవాది దీక్షా ద్వివేదీ, ఇతర సిపిఐ నాయకులు, కార్యకర్తలు సహా అనేకమందిని వాస్తవాలను కాలరాయడంకోసం వేధింపులకు గురిచేస్తోంది. దీనికి అదనంగా మణిపూర్‌లో జరిగిన హింసలో ఎన్.బైరెన్‌సింగ్ బాగా లోతుగా జోక్యం చేసుకున్నారన్న ప్రశ్నలు రేకెత్తేవిధంగా వచ్చిన ఆరోపణలు ఒక ఆడియో ద్వారా బయటకు పొక్కాయి. ఈ ఆరోపణలపై ఉన్నతస్థాయిలో నిష్పాక్షిక విచారణ జరపాలి" అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం కోరింది.

**అసెంబ్లీలో అవిశ్వాసం తప్పించుకోడానికేః ప్రతిపక్షాలు**

మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బైరెన్‌సింగ్ రాజీనామా చేయడంలో చాలా జాప్యం జరిగిందని పలు ప్రతిపక్షాలు విమర్శించాయి. "టూ లేట్...టూ లిటిల్..." అని పెదవి విరిచాయి. ఇప్పుడిది చాలా చిన్నవిషయంగా మారిపోయిందని ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. మణిపూర్ శాసనసభలో బైరెన్ సింగ్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్‌పార్టీ ప్రయత్నం చేస్తున్న తరుణంలో దానిని తప్పించుకోవడంకోసమే బైరెన్‌సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఇకనైనా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మణిపూర్ రాష్ట్రంలో త్వరలో పర్యటన చేస్తారని ఏడు పార్టీలకు చెందిన ప్రతిపక్ష నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది, ఇది చిన్నవిషయంగా మారిపోయింది, మణిపూర్ ప్రజలు, బైరెన్‌సింగ్ సొంతపార్టీలోని నాయకులు, ప్రతిపక్షాలు కూడా ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని రెండు సంవత్సరాలుగా కోరుతున్నాయి.

**గంగాస్నానం చేశాక కళ్ళు తెరచుకున్నాయా?**

రాష్ట్రంలో ఇంకా హింసాకాండ కొనసాగుతూనే ఉంది" అని రాజ్యసభలో శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంకా చతుర్వేది విమర్శించారు. బహుశా గంగాస్నానం చేశాక ఎన్.బైరెన్‌సింగ్‌కు కళ్ళు తెరచుకుని ఉండవచ్చునని విమర్శించారు. "ఇక్కడ విషయం గంగాస్నానం గురించి కాదు, వారికి తెలుసు, మణిపూర్ శాసనసభలో అవిశ్వాస తీర్మానం పెడుతున్నారు, దానిని రాబోయే రోజుల్లో తప్పించుకోవడంకోసమే రాజీనామా చేశారు, తమ సొంతపార్టీ ఎంఎల్‌ఎలే తనకు వ్యతిరేకంగా, అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తారని ఆయన భయపడుతున్నారు, అందుకే ఆయనను రాజీనామా చేయమని అడినట్టున్నారు, ఈ మాత్రం రాజీనామాకు ఆయనకు చాలాకాలం పట్టింది" అని ప్రియాంకా చతుర్వేది విమర్శించారు. మణిపూర్ రాష్ట్ర చరిత్రలో ఒక సిగ్గుమాలిన అధ్యాయానికి ఇదే చివరి ఘట్టమని తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ ఎంపి మహువా మొయిత్రా విమర్శించారు. "సిగ్గుమాలిన రక్తదాహమే ఆయనను పదవిలో కొనసాగేట్టు చేసింది, 648 రోజులక్రితం మణిపూర్‌లో హింస ప్రారంభమైంది, ఐనాగానీ ఆయన రాజీనామా చేయలేదు ఎందుకంటే అలా రాజీనామా చేయడానికి నైతికత ఉండాలి, అవిశ్వాస తీర్మానం గెలిస్తే అవమానం తట్టుకోలేక ఆయన రాజీనామా చేశారు" అని ఆమె విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ కూడా దాదాపు ఇలాంటి విమర్శలే చేశారు. ఆయన్ను ప్యాక్ చేసి పంపేయమని రెండేళ్ళక్రితమే మేం అడిగామన్నారు. రాజ్యసభలో సిపిఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిట్టస్ కూడా బైరెన్‌సింగ్ రాజీనామా జాప్యం దురదృష్టకరమని అన్నారు. మణిపూర్‌లో మనుషులను నరికి చంపారు, స్త్రీలను వివస్త్రలను చేసి అవమానించారు, యావత్ దేశం ఈ దారుణాలను చూసింది, మొద్దుబారిన ప్రభుత్వం నిర్దయగా ప్రవర్తించింది అని విమర్శించారు. ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంప ఫౌజియా ఖాన్, రిపబ్లికన్‌పార్టీ (అథవాల్) నాయకుడు, కేంద్రమంత్రి రామ్‌దాస్ మాత్రం, మణిపూర్‌లో పరిస్థితులకు బాధ్యత వహించి బైరెన్‌సింగ్ రాజీనామా చేశారని సమర్థించారు.

## నివేదిక (మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ల నిర్ధారణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్ లో మాజీ ఐఎఎస్ భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో 'డెడికేషన్ కమిషన్' ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ 'డెడికేటెడ్' కమిషన్' రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి, జిల్లా కేంద్రాలలో పలు బిసి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నుంచి వినతులను స్వీకరించింది. హైదరాబాద్‌లో బహిరంగ విచారణ కూడా చేపట్టింది. ఇటీవల ప్రణాళిక విభాగం సమర్పించిన సమగ్ర కులగణన నివేదికను కూడా డేడికేటెడ్ కమిషన్ పరిగణలోకి తీసుకున్నది. విచారణలో వెల్లడైన అంశాలు, కులగణన నివేదికలోని లెక్కులు,బిసి కులాల ఆర్థిక,సామాజిక పరిస్థితులు తదితర అంశాలను డేడికేటెడ్ కమిషన్ క్రోడీకరించి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో మరో నాలుగైదు రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు అంశం ఒక కొలిక్కి రానుంది.

## రానివ్వొద్దు (మొదటి పేజీ తరువాయి)

ఆరోపించినట్లు కందుల కోసం తెరిచింది 4 సెంటర్లు కాదని, 41 సెంటర్లు ఇప్పటికే ప్రారంభించామని, రూ. 7.21 కోట్లతో 954.95 మెట్రిక్ టన్నుల కందులను మద్దతు ధరకు కొనుగోలు చేశామని మంత్రి వెల్లడించారు. ఇప్పటికైనా బిఆర్‌ఎస్ నాయకులు అవాస్తవాలు మాట్లాడటం మానకపోతే, తెలంగాణ సమాజం మరొకసారి కర్రుకాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రైతుల సంక్షేమం కోసం రూ.55,256 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఇప్పటివరకు ప్రత్యక్షంగా రైతులకు నేరుగా ఖాతాలలో జమ చేసింది రూ.40,000 కోట్లు అని తెలిపారు.

## ఉక్కుపాదం (మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అధికారులను సిఎం ఆదేశించారు. బ్లాక్ మార్కెట్ ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనిఇసుక సరఫరా పారదర్శకంగా జరిగేందుకు అక్రమాలకు తావులేకుండా పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని సిఎం సూచించారు. గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. సిఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద వెంటనే అధికారులు తనిఖీలు చేపట్టాలని, ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, జిల్లాల వారీగా కలెక్టర్లు, ఎస్‌పిలకు బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యత హైడ్రాకు అప్పగిస్తున్నట్లు సిఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతీ ఇసుక రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని, ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. రవాణాకు సంబంధించి రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, ఏరియాల వారీగా సమీప ఇసుక రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేందుకు ఒక విధానం ఉండాలని, వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని, సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం జరిగేలా చూడాలని సిఎం అధికారులకు సూచించారు. నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్ ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలన్నారు. ఆన్ లైన్ బుకింగ్ విధానంలో మార్పులు తీసుకురావాలని, అందులో భాగంగా ఆఫీస్ టైమింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు చేయాలని పలు మార్పులను సిఎం సూచించారు.

# అటవీ శాఖలో ఆదాయం రెట్టింపు

## రంగరాజన్‌ను ఫోన్‌లో పరామర్శించిన సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను సోమవారం రాత్రి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు. రంగరాజన్‌పై కొందరు దుండగులు దాడికి పాల్పడిన ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడారు. ఇలాంటి దాడులను సహించేది లేదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

## అర్చకుడు రంగరాజన్ పై .. దాడి కేసులో ఆరుగురు అరెస్టు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జిల్లాలోని మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు (పూజారి) రంగరాజన్ పై దాడి ఘటనపై రాజేంద్రనగర్ డిసిపి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ( సౌందర రాజన్) నివాసానికి రామరాజ్య సైన్యంలో "చేరాలని, అదేవిధంగా తమకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేస్తూ తనపై దాడి చేసినట్లు పూజారి రంగరాజన్ మొయినాబాద్ పోలీసులకు 8వ తేదీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసుకున్న పోలీసులు రామరాజ్యం సంస్థ వ్యవస్థాపకుడు తూర్పుగోదావరి జిల్లా అన్నపర్తి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన కె.వీర్ రాఘవరెడ్డి ప్రస్తుతం నివాసం ఉంటున్న మణికొండలో అరెస్టు చేసి అదే రోజు రిమాండ్ చేసినట్టు రాజేంద్రనగర్ డిసిపి తెలిపారు. అదేవిధంగా అందులో పాల్గొన్న మరో ఐదుగురిని,అందులో ఖమ్మం, నిజాంబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు మహిళలని సోమవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి కోర్టులో ఆధారపరిచినట్లు డిసిపి పేర్కొన్నారు.

## రామరాజ్యం పేరుతో దాడులు చేస్తే ఉపేక్షించం : మంత్రి శ్రీధర్‌బాబు

రంగరాజన్ దాడిలో ఒకరి అరెస్టు, మిగతా నిందితుల కోసం గాలింపు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రామరాజ్యం పేరుతో ఎవరైనా దాడులకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు హెచ్చరించారు. మొయినాబాద్‌లోని చిల్కూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ కేసులో ఇప్పటికే దాడికి పాల్పడిన ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో రౌడీయిజం చేస్తూ అరాచకాలకు, దాడులకు పాల్పడే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. రాముడి పేరును అప్రతిష్టపాలు చేస్తూ అరాచక, అనాగరిక కార్యక్రమాలకు పాల్పడటం దుర్మార్గమని, ఇది క్షమించరాని నేరమని, రాముడి భక్తుల మనోభావాలను దెబ్బ తీసే చర్య అని మంత్రి పేర్కొన్నారు. కొందరు ప్రజలలో ఉన్న హిందుత్వ భావాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇలాంటి వారి పట్ల పోలీసులు, ప్రజలు, రాజకీయ పార్టీలు అందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఇదిలా ఉండగా రంగరాజన్‌పై మొత్తం 20 మంది దాడి చేసినట్లు ఆరోపణలు ఉండగా, ఒకరిని అరెస్టు చేశామని, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని మొయినాబాద్ పోలీసులు తెలిపారు.



## దాడి అత్యంత దుర్మార్గమైన చర్య

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/గండిపేట :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరులో రెండు రోజుల క్రితం కొందరు సిఎస్ రంగరాజన్‌పై దాడి చేయడాన్ని అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. సోమవారం చిలుకూరులోని ఆయన నివాసానికి వెళ్లిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, బాల్క సుమన్, బిఆర్ఎస్ నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలతో కలిసి పరామర్శించారు.

(బిరుదరాజు వాసుదేవరాజు)

### 17,643.30 ఎకరాల కబ్జా భూమి స్వాధీనం
### ప్రభుత్వ ఆమోదానికి సిద్ధంగా 'ఎకో-టూరిజం పాలసీ'

''కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (టిజిఎఫ్‌డిసి) ఆదాయం రెట్టింపు అయింది. 2022–23లో రూ.153 కోట్ల ఆదాయవం వస్తే.. 2023–24లో రూ.267.55 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది దాదాపు రూ.300 కోట్లు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎకోటూరిజం నుంచి గతంలో రూ.226.90లక్షల ఆదాయం ఉండగా.. ఈసారి రూ.344.18లక్షల ఆదాయం పెరిగింది. రాష్ట్రంలో పచ్చదనాన్ని 33 శాతానికి పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టింది. ఆక్రమణకు గురైన 17,643.30 ఎకరాల భూమిని అటవీశాఖ స్వాధీనం చేసుకుంది. ముచ్చర్లలో 15000 ఎకరాల్లో ఎకోటూరిజం, ఎకోవిలేజ్ అభివృద్ధి చేస్తాం.. ముచ్చర్లలో 'జూ ప్రాజెక్ట్'ను ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉంది. ఎకోటూరిజం పాలసీ ప్రభుత్వ ఆమోదం కోసం సిద్ధంగా ఉంది'' అని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ 'ప్రజాపక్షం' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. తునికి ఆకు సేకరణదారులకు 2016 నుంచి రూ.211 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రజాప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత రూ.155 కోట్ల నిధులను విడుదల చేశామని ఆమె వివరించారు. 2023 నుంచి ఈ నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే బదిలీ చేస్తున్నామని కొండా సురేఖ తెలిపారు.

**ప్రశ్న : 'ఎకో–టూరిజం' అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ..?**

**కొండా సురేఖ :** తెలంగాణ రాష్ట్రంలో ఎకోటూరిజం కార్యకలాపాలను పెంచేందుకు, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఎకోటూరిజం కోసం ఈ సంస్థ కొత్త పాలసీని సిద్ధం చేసింది. ''డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్'' అనే కొత్త బ్రాండ్, లోగోతో ముందుకొచ్చింది. పర్యావరణ ఆర్కిటెక్ట్‌లు నందిపేట్, కనగిరి కొండలు, అనంతగిరి కొండల్లో కొత్త ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఇప్పటికే సమీపంలోని జాతీయ ఉద్యానవనాలు, వన్యప్రాణుల ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) విధానంతో మూడు ఎకోటూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేశాం. శామీర్‌పేట్ ఎకోటూరిజం ప్రాజెక్ట్ (అరణ్య రిసార్ట్స్), చిల్కూర్‌లోని మృగవాణి నేషనల్ పార్క్ (మృగవాణి రిసార్ట్స్), వనస్థలిపురంలో మహావీర్ నిశ్చల్వన్ ఎకో టూరిజం సెంటర్ (అనన్య రిసార్ట్స్)లు పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.



అలాగే అర్బన్ ఫారెస్ట్ పార్కులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈ క్రమంలోనే తూంకుంటలో వెదురు వనం, లాల్‌గడి మలక్‌పేట్‌లో వన దృశ్యం, గౌడెల్లిలో చందన వనం, చిల్కూరులో ఫారెస్ట్రిక్ పార్క్, కొత్తగూడలో బొటానికల్ గార్డెన్ ఉద్యానవనాలు అభివృద్ధి చేశాం.

**ప్రశ్న: 'బొటానికల్ గార్డెన్ సుందరీకరణ'కు తీసుకుంటున్న చర్యలు..?**

**కొండా సురేఖ :** 274 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్తగూడ రిజర్వ్ ఫారెస్ట్‌ను అభివృద్ధి చేశాం. ఇది హైదరాబాద్ ప్రజలకు అత్యంత సౌకర్యదాయకమైన ప్రకృతి ఉద్యానవనంగా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా ఉదయం నడక, వ్యాయామదారులకు, వృద్ధులకు, వాహ్యాళికి వచ్చే సందర్శకులకు ఇది చాలా ఇష్టమైన ప్రదేశం. పెద్ద సంఖ్యలో సందర్శకులు బోటానికల్ గార్డెన్‌కు వచ్చి ప్రకృతిని ఆస్వాదించి, మానసిక ఉల్లాసం, ఉత్సాహం, ప్రశాంతత పొందుతున్నారు. సందర్శకుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కులో అవసరమైన సౌకర్యాలు, కార్యకలాపాలను చేపడుతున్నాం. జీవవైవిధ్యం పెంపుదలకు, వృక్షజాతులపై విద్యార్థులకు అవగాహన నిమిత్తం 'వృక్ష పరిచయం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

**ప్రశ్న: వర్చువల్ సఫారీ ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది...?**

**కొండా సురేఖ :** కొత్తగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లోని 106 ఎకరాలలో వర్చువల్ సఫారి, వర్చువల్ ఎకోథీమ్, ఎఆర్‌విఆర్ సాంకేతికతతో అభివృద్ధి చేస్తున్నాం. వినోద పరిశ్రమలో ఎఆర్‌విఆర్ సాంకేతికత అత్యంత ప్రజాదరణ పొందింది. ఈ సాంకేతికతను సంస్థ ఉపయోగించుకుని, ఆదిమ జాతుల జీవనశైలి, సంస్కృతి, పర్యావరణం తదితర వాటిని సందర్శకులకు వివరిస్తారు. భవన నిర్మాణ పనులు, ప్రవేశ తోరణం, 360 డిగ్రీల షూట్, తెలంగాణ జలపాతాలు, గిరిజన సంస్కృతి లాంటి మోజారిటీ పనులు పూర్తయ్యాయి. ఈ సౌకర్యాన్ని అతి త్వరలో ప్రజలకు అందుబాటులో వస్తుంది.

**ప్రశ్న: మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారా..?**

**కొండా సురేఖ :** కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి, కాగజ్‌నగర్‌లో రూ.12 కోట్లతో 17 కొత్త భవనాలు నిర్మించాం. కొత్తగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో గ్రీన్ బిల్డింగ్ నిర్మాణం ఈ ఏడాది జూలైలో పూర్తి చేస్తాం. బొటానికల్ గార్డెన్‌కు శాశ్వత నీటి సరఫరా కోసం 5 ఎంఎల్‌డి ఎస్‌టిపిని ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ప్లాంటేషన్ నిర్వహణ కోసం 8 వాహనాలను కొనుగోలు చేశాం. ప్రభుత్వ అనుమతి మేరకు 53 మంది కొత్త సిబ్బందిని (జూనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్, అసిస్టెంట్ ప్లాంటేషన్ మేనేజర్) నియమించేందుకు ఆదేశాలు జారీ చేశాం.

**ప్రశ్న: తెలంగాణ హరిత నిధులను ఏఏ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు..?**

**కొండా సురేఖ :** 'తెలంగాణ హరితనిధి' కింద 2024–25 సంవత్సరానికి గాను మొత్తం రూ.41.30కోట్లు సమకూరాయి. నర్సరీల పెంపకం, అవెన్యూ ప్లాంటేషన్స్, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి, ఎకోటూరిజం, వనదర్శిని (విద్య, అవగాహన కార్యకలాపాలు), అగ్నిప్రమాదాల నుండి అడవుల సంరక్షణ, నియంత్రణ, నిర్వహణకు సంబంధించిన మొత్తం 12 ప్రాజెక్టుల నిర్వహణకు రూ.40.68 కోట్లు మంజూరయ్యాయి.

**ప్రశ్న: టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ల నుండి గ్రామాల తరలింపునకు తీసుకుంటున్న చర్యలు..?**

**కొండా సురేఖ :** అటవీశాఖ కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్ నుండి మొట్టమొదటిసారిగా రెండు గ్రామాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా విజయవంతంగా తరలించాం. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మైసంపేట్, రాంపూర్‌గూడెంలను తొలి విడతగా ఖాళీ చేశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నుండి నాలుగు గ్రామాల తరలింపు పనులు సాగుతున్నాయి. అలాగే వన్యప్రాణుల దాడులతో ఎవరైనా మరణిస్తే, వారి కుటుంబసభ్యులకు అందించే నష్టపరిహారాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు ప్రభుత్వం పెంచింది.

**ప్రశ్న: టైగర్ కారిడార్‌ను కన్జర్వేషన్ రిజర్వ్‌గా గుర్తించేందుకు ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా..?**

**కొండాసురేఖ :** కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్‌తో కలిపే 1442.26 చదరపు కి.మీల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు అటవీశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

**ప్రశ్న: జంతువుల అక్రమ వ్యాపార నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**కొండా సురేఖ :** వన్యప్రాణుల వేట, జంతువుల అక్రమ వ్యాపారాన్ని నివారించేందుకు 'క్యాచ్ ది ట్రాప్' పేరుతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. అడవి జంతువులను వేటాడేందుకు 1061.50 కిలోల బరువు ఉన్న 1469 విద్యుత్ తీగలతో ఏర్పాటు చేసిన వలలు, ఉచ్చులను అటవీ శాఖ గుర్తించింది. అక్రమవేట బారినుంచి పెద్ద సంఖ్యలో వన్య ప్రాణులను అటవీశాఖ కాపాడింది.

## మావోయిస్టులను అంతం చేయటం అమిత్ షా వల్ల కాదు

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను లేకుండా అంతం చేస్తామని పదే పదే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం కార్పొరేట్ దోపిడీ శక్తుల మెప్పు కోసమేనని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.బోస్ విమర్శించారు. దేశానికి మరొక దేశంతో యుద్ధం జరిగితే పాల్గొనాల్సిన సైనికులు దేశంలో ప్రజలపై యుద్ధం ప్రకటించడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఎన్‌కౌంటర్ల పేరుతో దండకారణ్య ప్రాంతాల్లో జరుగుతున్న మారణహోమాన్ని నిలిపివేసి సైనిక బలగాలను అక్కడి నుంచి ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంలో పీడిత ప్రజలపై కొనసాగుతున్న అణిచివేత, పీడన, వివక్ష, దోపిడీ ఉన్నంతకాలం ఉద్యమాలు, పోరాటాలు కొనసాగుతాయని ఆయన ప్రకటలో స్పష్టం చేశారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మార్పు రాకుండా నక్సలైట్ భావజాలాన్ని లేకుండా చేయడం అసాధ్యం అని ఆయన అన్నారు. గతంలో పాలకులు ఇదేవిధంగా కమ్యూనిస్టు పార్టీలను, నక్సలైట్ పార్టీలను లేకుండా చేస్తామని ప్రగాల్భాలు పలికి చివరికి వారు అధికారం కోల్పోయారని అన్నారు. కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం ప్రకృతి సంపద ఉన్న మధ్య భారతం అడవిలో నుంచి ప్రజలను అక్కడి నుంచి బయటికి వెళ్లగొట్టి సంపదను దోచుకోవాలనేది అమిత్‌షా ఆలోచన అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆదివాసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, వారికి విద్య, వైద్యం గురించి పాలకులు పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. వడ్డీ వ్యాపారస్తులు, అటవీ అధికారుల దుర్మార్గాలు, అటవీ సేకరణ ఉత్పత్తులకు సరైన ధర ఇవ్వకుండా తీవ్రంగా ఆదివాసులను మోసానికి గురిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై అటవీ అధికారులు, పోలీస్ శాఖ దాడులు చేసేవారని, వాళ్లపై కేసు నమోదు చేసి జైళ్ళను నింపిందని, ఇలాంటి పరిస్థితులు ఈ ఆకలి అణచివేతల నుంచే పోరాటాలు ప్రారంభమయ్యాయన్నారు. అడవులలో ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు మద్దతుగా ఉన్న మావోయిస్టు పార్టీని తుదముట్టించడానికి అనేక కుట్రలు పన్నుతూ ప్రతి రోజు బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రజలను, ఉద్యమకారులను చంపేసి మానవ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రశాంతంగా ఉన్న పచ్చని అటవీ ప్రాంతాన్ని రక్తపుటేరులతో ముంచుతున్నారన్నారు.

## అమెరికా 104 మంది భారత పౌరులకు.. సంకెళ్లు వేయడం అమానుషం




ఎఐవైఎఫ్ నిరసన ర్యాలీలో వక్తలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమెరికా నుండి 104 మంది భారత పౌరులను బహిష్కరించిన అమానవీయ, ఆమోదయోగ్యం కాని విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అమెరికా సైనిక విమానంలో సంకెళ్లు వేసి సుదీర్ఘ ప్రయాణం చేయించడం ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించడమేనని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు వినూత్న పద్ధతిలో చేతులకు సంకెళ్లు వేసుకుని హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుండి వై జంక్షన్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫ్లెక్సీని దగ్ధం చేశారు. కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనిల్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మధు, నాయకులు సంజయ్ కుమార్, సుమన్, చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భారత పౌరుల పట్ల ఈ అవమానకరమైన ప్రవర్తనను వ్యతిరేకించడంలో, భారతదేశం అటువంటి అవమానాన్ని సహించదనే బలమైన సందేశాన్ని పంపడంలో అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడంపై అభ్యంతరం చెప్పడంలో మోదీ ప్రభుత్వం మౌనం వహిస్తూ విఫలమవడం సిగ్గుచేటన్నారు. కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర సంయుక్తంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## ఆర్ఎంపి, పిఎంపి సమస్యలపై అసెంబ్లీ.. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా



హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్ఎంపి, పిఎంపిలకు సంబంధించిన సమస్యలను వచ్చే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాడులు లేవని, కేసులు నమోదు చేయలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ రాత్రి ఎవరొస్తారో, ఎవరిని అరెస్ట్ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. హైదరాబాద్, ఇందిరాపార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌లో సోమవారం జరిగిన ఆర్‌ఎంపి, పిఎంపిల ధర్నాలో హరీశ్ రావు, బిఆర్ఎస్ ఎంఎల్ఎ ముఠాగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి, వైద్యారోగ్య మంత్రి తక్షణమే స్పందించి ఆర్‌ఎంపిలపైన కేసులు నమోదు చేయకుండా చూడాలని, ఎన్నికల హామీ మేరకు వారికి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు జారీ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే, కొందరు స్టేలు తీసుకొచ్చారని, అయినప్పటికీ ఎవరిపైనా కేసులు నమోదు చేయలేదని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు కోరారు.

## ఎసిబికి చిక్కిన పంచాయతీరాజ్ ఎఇ

హనుమకొండలో ఎసిబి దాడులు




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎసిబి అధికారులకు సంగెం మండల పంచాయతీరాజ్ ఎఇ రమేష్ చిక్కారు. వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లిలో ఇంటి నిర్మాణ అనుమతి కోసం 80వేల డబ్బులు ఎఇ రమేష్ డిమాండ్ చేశారు. సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఎఇ రమేష్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండలోని ఎఇ ప్రయివేట్ ఆఫీస్‌లో 10వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కారు. జిల్లా ఎసిబి డిఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఎఇ రమేష్‌తో పాటు అతనికి సహకరించిన అసిస్టెంట్ సారయ్యను అరెస్టు చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్పీ పసునూరి సాంబయ్య మాట్లాడుతూ సంగెం మండల పంచాయతీరాజ్ ఎఇ రమేష్ బాధితుని నుండి 80 వేల రూపాయలు డిమాండ్ చేశారని, తమకు అందిన పక్కా సమాచారంతో పట్టుకోవడం జరిగిందని చెప్పారు. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ అధికారి లంచం అడిగితే తమకు తెలియజేయాలని, 1064 ద్వారా తమకు సమాచారం అందించాలని సూచించారు.

## రెండెకరాల్లోపు రైతు భరోసా జమ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ పథకాన్ని గత నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గత 27వ తేదీన 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రూ.569కోట్లు జమ చేశారు. దీనికి కొనసాగింపుగా ఈనెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఎకరం వరకు సాగులో ఉన్న భూములకు సంబంధించి 17.03 లక్షల రైతుల ఖాతాల్లో నిధులను జమ చేశారు. తాజాగా సోమవారం రెండు ఎకరాల వరకు ఉన్న 8,65,999 మంది లబ్ధిదారులకు చెందిన 11,79,247.17 ఎకరాలకుగాను రూ.7,07, 54,84,664 కోట్లను రైతుల ఖాతాలలో జమ చేశారు. దీంతో ఈ మూడు దఫాలు కలుపుకుని 30,11,329 మంది రైతుల ఖాతాల్లో రూ. 1834.09 కోట్ల నిధులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు.

**జిల్లాల వారిగా ఒక ఎకరం లోపు రైతుల ఖాతాలో జమైన నిధుల వివరాలు**

| జిల్లా | రైతులు | నిధులు రూ. |
|---|---|---|
| అదిలాబాద్ | 34,401 | 37,18,21,050 |
| కుమురం భీమ్ అసిఫాబాద్ | 32,364 | 27,29,52,522 |
| మంచిర్యాల | 69,961 | 43,16,53,467 |
| నిర్మల్ | 75,263 | 51,17,32,029 |
| నిజామాబాద్ | 1,42,873 | 87,77,52,581 |
| కామారెడ్డి | 1,73,580 | 90,83,42,036 |
| కరీంనగర్ | 1,12,689 | 66,35,04,499 |
| పెద్దపల్లి | 86,918 | 50,51,21,067 |
| జగిత్యాల | 1,29,326 | 70,78,93,705 |
| రాజన్న సిరిసిల్ల | 69,012 | 44,46,82,700 |
| మెదక్ | 1,72,349 | 84,40,52,317 |
| సంగారెడ్డి | 1,82,453 | 1,06,77,15,270 |
| సిద్దిపేట్ | 1,86,241 | 1,16,26,25,246 |
| వరంగల్ | 92,024 | 56,23,30,600 |
| హనుమకొండ | 85,903 | 53,44,42,258 |
| మహబూబాబాద్ | 1,03,662 | 69,93,24,812 |
| ములుగు | 32,754 | 23,25,09,947 |
| జయశంకర్ భూపాలపల్లి | 50,763 | 31,40,23,153 |
| జనగామ | 67,434 | 40,05,78,753 |
| ఖమ్మం | 1,21,612 | 71,36,45,222 |
| భద్రాది కొత్తగూడెం | 49,947 | 55,23,55,703 |
| రంగారెడ్డి | 1,04,938 | 54,99,01,926 |
| వికారాబాద్ | 88.340 | 48,32,42,518 |
| మేడ్చల్ మల్కాజ్‌గిరి | 4,931 | 3,82,20,945 |
| మహబూబ్‌నగర్ | 91,248 | 48,32,76,181 |
| నారాయణపేట్ | 54,153 | 34,34,73,497 |
| నాగర్ కర్నూల్ | 98,409 | 61,79,10,579 |
| వనపర్తి | 68,587 | 34,40,23,950 |
| జోగులాంబ గద్వాల్ | 43,681 | 29,27,42,293 |
| నల్లగొండ | 1,85,545 | 1,13,33,74,857 |
| సూర్యాపేట | 1,11,752 | 73,93,34,053 |
| యాదాద్రి భువనగిరి | 87,946 | 53,63,29,212 |
| **మొత్తం** | **30,11,329** | **18,34,08,88,948** |



## భారీగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ వినియోగ డిమాండ్ దాదాపు 16000 మెగావాట్లకు చేరుకుంది. వేసవి, యాసంగి పంటల ప్రభావంతో రాష్ట్రంలో భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నది. రానున్న రోజుల్లో మరింతగా విద్యుత్ డిమాండ్ పెరుగనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై మంగళవారం విద్యుత్ సంస్థల అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్షించనున్నారు.

గతేడాది మార్చిలో వచ్చిన అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలోనే తెలంగాణ విద్యుత్ సంస్థలు ఎదుర్కొంటున్నాయని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. గత ఏడాది మార్చిలో ఏర్పడిన రికార్డు స్థాయి అత్యధిక విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్లు కాగా ఈనెల 7వ తేదీనే 15,920 మెగావాట్లుగా అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైంది. అయినప్పటికీ ఎలాంటి సమస్య లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరాను విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు తెలిపారు.

విద్యుత్ డిమాండ్ ఎంతగా పెరిగినా దానికి తగినట్లుగా సరఫరా అందిస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

ప్రజాపక్షం
మంగళవారం, ఫిబ్రవరి 11

# మణిపూర్ ముఖ్యమంత్రి ఔట్

జాతుల కలహాలతో రెండు సంవత్సరాలుగా రగులుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ బిజెపి ముఖ్యమంత్రి నంగ్థోంబం బీరేన్ సింగ్ విధిలేని పరిస్థితుల్లో ఎట్టకేలకు ఆదివారం తమ రాజీనామా పత్రాన్ని ఇంఫాల్‌లో గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాకు అందజేశారు. అయితే అది ఇష్టపూర్వకంగా సమర్పించిన రాజీనామా కాదు. బిజెపి కేంద్ర నాయకత్వం ఆదేశించిన మీదట తప్పలేదు. శనివారం ఢిల్లీ బయలుదేరేముందు ఆఖరుసారి శాసనసభా పార్టీలో బలం పరీక్షించుకున్నారు. ఆయన పిలిచిన సమావేశానికి 46మంది ఎమ్మెల్యేల్లో 20మంది మాత్రమే హాజరైనారు. 60మంది (ప్రస్తుత నికర సంఖ్య 59)సభ్యులుగల అసెంబ్లీలో బిజెపి సభ్యులు 41, జెడి(యు) ఫిరాయింపుదారులు ఐదుగురు ఉన్నారు. వారిలో అత్యధికులు బీరెన్‌సింగ్ రాజీనామా కోరుతున్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బీరెన్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మాన ప్రతిపాదన, మరోవైపు 'లీకు అయిన ఆడియో టేపుల'పై దర్యాప్తుకు సుప్రీం కోర్టు ఆదేశం ముఖ్యమంత్రి రాజీనామాకు హోంమంత్రి అమిత్ షా ఆదేశించక తప్పని పరిస్థితి కల్పించాయి. కాంగ్రెస్‌కు అసెంబ్లీలో ఐదుగురు సభ్యులే ఉన్నా, అవిశ్వాసం తీర్మానం ప్రతిపాదిస్తే బిజెపి నుంచి మరో ఐదుగురు బలపరిచే అవకాశం దృష్ట్యా, పార్టీలో అట్టి చీలికను నివారించేందుకూనూ ముఖ్యమంత్రి చేత రాజీనామా చేయించారు. రాష్ట్రంలో జాతుల మధ్య హింసను తానే ప్రోత్సహించినట్లు ఆడియో వినిపించిన ఒక వ్యక్తి స్వరం ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ది లాగే ఉంది. అది రుజువైతే రాష్ట్రంలో ఇప్పటికే దిగజారిన బిజెపి పరువు గంగలో కలుస్తుంది. మణిపూర్‌లో మైదాన ప్రాంతంలోని మెయితీలు, పర్వత ప్రాంతాల్లోని కుకీ గిరిజన తెగల మధ్య హింసలో 250 మంది చనిపోయారు, 60వేలమంది నిరాశ్రయులైనారు. ఎన్నో మానభంగం, దౌర్జన్యాలు, గృహదహన ఘటనలు. ఒక జాతి మరో జాతి నమ్మనంతగా వైరం, అపనమ్మికలు పెరిగాయి. గుట్టకొకరు, పుట్టకొకరు చెల్లాచెదరైన కుకీలు తాము మెయితీలతో కలిసి బతకలేమని, తమ ప్రాంతాలకు ప్రత్యేక పాలన – అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయవలసిందిగా కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

> బీరెన్‌సింగ్ చేత ఇంత ఆలస్యంగా రాజీనామా చేయించినా అది సానుకూల ప్రభావం చూపుతుందని భావించలేము. అందువల్ల కొంతకాలంపాటు పరిపాలనను కేంద్రప్రభుత్వం తన చేతిలోకి తీసుకోవటమే ఉత్తమమార్గం.

దాదాపు రెండు సంవత్సరాలుగా అంతఃకలహాలతో మణిపూర్‌లో మంటలు రగులుతున్నా ఆ కల్లోల ప్రాంతాన్ని సందర్శించి నాలుగు ఓదార్పు మాటలతో సాంత్వన చేకూర్చి, బాధితులకు భరోసా ఇవ్వటానికి మన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి తీరిక దొరకలేదు. దీనిపై ప్రతిపక్షాలు ఎన్నిమార్లు విన్నవించినా, విమర్శలు చేసినా ఆయనలో చలనం కలగలేదు. అందుకు కారణమేమిటో ఆయనకే తెలియాలి. అక్కడ పార్టీగా బిజెపి, దాని ప్రభుత్వం మెయితీలకు కొమ్ముకాయటం ద్వారా కుకీలు ఆరోపిస్తున్నారు, వారిని శాంతపరిచేందుకు హోంమంత్రి అమిత్ షా కూడా శ్రద్ధ చూపలేదు. రాష్ట్రం అట్టుడుకుతున్న పరిస్థితుల్లో భద్రతా దళాలను దించి హింసను అదుపు చేయటం పైనే దృష్టిపెట్టారు గాని, జాతుల మధ్య వివాదానికి మూలమైన సమస్యను చేపట్టలేదు – అన్ని వర్గాలతో చర్చించి సామరస్య పరిష్కార సాధనకు ప్రయత్నమే లేదు.

రాష్ట్ర ప్రభుత్వంపై పక్షపాత ఆరోపణలు, శాంతి–భద్రతల నిర్వహణ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందటం కళ్లెదుట కనిపిస్తున్నా బిజెపి తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవటానికే ప్రాధాన్యత ఇచ్చిందిగాని, ముఖ్యమంత్రి చేత రాజీనామా చేయించలేదు. దాంతో ఒక విభాగం ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయింది. అందువల్ల బీరెన్‌సింగ్ చేత ఇంత ఆలస్యంగా రాజీనామా చేయించినా అది సానుకూల ప్రభావం చూపుతుందని భావించలేము. అందువల్ల కొంతకాలంపాటు పరిపాలనను కేంద్రప్రభుత్వం తన చేతిలోకి తీసుకోవటమే ఉత్తమమార్గం.

# ఇంటిపనివారలకు సమగ్ర చట్టం – సుప్రీం కోర్టు ఆదేశం



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా ఇంటి పనివారలు ఏలాంటి చట్టాలు అమలుకు నోచుకోలేదు. కనీస వేతనాల చట్టం, పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్టం, సమాన పనికి సమాన వేతనం చట్టాలు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలలో భాగంగా దేశంలోని కోట్లాది మంది ఇంటిపనివారల కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. కోట్లాది మంది ఇంటిపనివారలు ఏలాంటి స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, హక్కులు లేకుండా పనిచేస్తున్నారు. కార్మికులలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర బలహీన వర్గాలకు సంబంధించిన మహిళా కార్మికులతో పాటు బాలిక, బాల కార్మికులు కూడా లెక్కకు మించిన గంటలు పనిచేస్తూ వివక్షతకు, దౌర్జన్యాలకు, అత్యాచారాలకు గురవు తూ సభ్యసమాజంలో వివక్షకు గురికావటం జరుగుతుంది. ఈ విషయంలో జనవరి 29, 2025న 6 నెలలలోపు ఇంటిపనివారాలకు సమగ్ర సంక్షేమ చట్టం రూపొందించి నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అణగారిన, అభాగ్యులైన మహిళా ఇంటిపనివారలకు చట్టాలు తెచ్చి అమలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించటం గొప్ప పరిణామం.

సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యాకాంత్ మరియు జస్జిస్ ఉజల్ భూయాన్ కేంద్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ లేబర్ ఎంప్లాయ్‌మెంట్ మరియు అనుబంధంగా ఉన్న అధికారులతో ఎక్స్‌పర్ట్ కమిటీ వెంటనే వేసి, 6 వారాలలోపు ఇంటి పనివారాల పనికి రక్షణ, చట్టాల అమలు కోసం కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించటం, నిత్యం దోపిడికి గురయ్యే ఇంటిపనివారాలకు సుప్రీం కోర్టు అండగా ఉండటం ఇంటిపనివారల కార్మికుల కుటుంబాలలో ఆశలు రేకెత్తించాయి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కేంద్ర ప్రభుత్వం చట్టాలను చేస్తే వారి కుటుంబాలలో పనికి రక్షణ, పని భద్రత, కనీస వేతనాలు, గౌరవంతో పనిచేసే పరిస్థితులు సిద్ధించే అవకాశం ఉంది.

సుప్రీం కోర్టు బెంచ్ అభిప్రాయం ప్రకారం ఇంటి పనివారలు ఈ దేశంలో ఒక బలమైన అధిక సంఖ్యలో గల కార్మికులుగా ఉన్నారని, వారంతా ఉన్నత కుటుంబాల ఇండ్లల్లో పనిచేస్తూ ఇంటియజమానుల ఇంటి నిర్వాహణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. వారంతా ఇంటి యజమానులతో అనేక వివక్షతలకు, దాడులకు, దౌర్జన్యాలకు గురవుతూ యజమానులు చెల్లించే తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అదే విధంగా ఇంటిపనివారలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని మహిళా ఇంటిపనివారలకు రక్షణ కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఇచ్చిన ఈ తీర్పు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కల్గించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటి పనివారల కోసం వారు పనిచేస్తున్న చోటుకు దగ్గరలో ఇంటి సౌకర్యం కల్పించాలి. వారు వంటచేయటం, శుభ్రం చేయటం, చిన్న పిల్లల్ని పరిరక్షించటం ఇతర అనేక అత్యవసర సర్వీసులలో పని చేస్తూ తమ కుటుంబాలను, తమ కుటుంబంలోని పిల్లల్ని నిర్లక్ష్యం చేయటం జరుగుతుంది. అంతేకాకుండా ఇంటి పనివారలను ఘోరంగా హింసించటం, బండబూతులు తిట్టడం, కొట్టడం వంటి చర్యలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా ఇంటిపనివారల్లో అణగారిని అట్టడుగు వర్గ కులాల వారు ఆర్థికంగా వెనకబడి ఇంటిపనివారల సైన్యంలో చేరి తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకునే ప్రయత్నం చేస్తూ ఎంతో కష్టనష్టాలకు గురవుతున్నారు.

గౌరవ సుప్రీం కోర్టు ఇంటిపనివారలు ఏలాంటి రక్షణలేకుండా, చట్టాలు అమలు కాకుండా తక్కువ వేతనాలకు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకున్నా ఎక్కువ పనిగంటలు పని చేస్తూ దోపిడికి గురవుతున్నారని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇప్పటికే దేశంలో అనేక కార్మిక చట్టాలు ఉన్నా అవి ఇంటి పనివారలకు ఏ విధంగా ఉపయోగపడకపోవటం ఆ కార్మికులలో మరింత అభద్రతా భావాన్ని కల్గిస్తుంది.



> ప్రపంచ కార్మిక సంస్థ సూచనలు మరియు అనేక మహాసభలలో తీసుకున్న తీర్మానాల ప్రకారం ఇంటి పనివారలకు రక్షణ కల్పించాలని తీర్మానాలు చేసినా అవేవి ఇంటిపని వారలకు ఏ విధంగా ఉపయోగపడలేదని సుప్రీం కోర్టు విచారం వ్యక్తం చేసింది. వీరి కోసం పటిష్టమైన న్యాయ రక్షణ కల్గిన చట్టాలు లేవు, ఉన్న చట్టాలు ఏవీ వారికి అమలు కాకపోవటం, రక్షణగా నిలబడకపోవటం వారిని మరింత నిరాశ, నిస్పృహలకు గురిచేసింది.

ప్రపంచ కార్మిక సంస్థ సూచనలు మరియు అనేక మహాసభలలో తీసుకున్న తీర్మానాల ప్రకారం ఇంటి పనివారలకు రక్షణ కల్పించాలని తీర్మానాలు చేసినా అవేవి ఇంటిపనివారలకు ఏ విధంగా ఉపయోగపడలేదని సుప్రీం కోర్టు విచారం వ్యక్తం చేసింది. వీరి కోసం పటిష్టమైన న్యాయ రక్షణ కల్గిన చట్టాలు లేవు, కోట్లాది మంది ఇంటి పనివారలు దేశంలో పనిచేస్తు ఉన్న చట్టాలు ఏవీ వారికి అమలు కాకపోవటం, రక్షణగా నిలబడకపోవటం వారిని మరింత నిరాశ, నిస్పృహలకు గురిచేసింది.

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ 1936, సమాన పనికి సమాన వేతనం చట్టం 1976, పని ప్రదేశంలో లైంగిక దాడులు నిషేధించే చట్టం 2013, బాలల యొక్క రక్షణ మరియు జాగ్రత్తల చట్టం 2015 ఇవన్నీ పేరుకు మాత్రమే ఉన్నా వంట కార్మికులకు ఏ విధంగా ఉపయోగం లేదు.

భారతదేశానికి స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం అనంతరం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 2019లో వేతనాల కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020 తెచ్చినా అవి ఇంటిపనివారల రక్షణకు ఉపయోగపడని కోడ్‌లు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు మేలు కలిగేలా ఉన్న ఆ కోడ్‌లు ఇంటి పనివారల కార్మికులకు ఏ రక్షణ కల్పించబడలేదు.

తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఇంటిపనివారల కోసం చట్టాన్ని తీసుకొచ్చి వారి సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయటం గొప్ప విషయంగా తెలియజేస్తూనే, కేరళ గవర్నమెంట్ తెచ్చిన చట్టం కేరళ డొమిస్టిక్ వర్కర్స్ రెగ్యులేషన్ వెల్‌ఫేర్ బిల్లు 2021 తీసుకొచ్చి అమలు చేస్తుండటం ఎంతో కొంత ఆయా రాష్ట్రాలలో ఇంటిపనివారలకు ఉపయోగపడిందని చెప్పక తప్పదు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ప్రధానమైన ఈ విషయాన్ని లేవనెత్తుతూ ఇంటిపనివారలకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖను ఆదేశిస్తూ ఇంటిపనివారల రంగంలో పని చేస్తున్న కార్మికులకు సాంఘీక సమానత్వం, వారి యొక్క వేతనాలు పెంచే విధంగా ఉండాలని, అదే విధంగా మహిళా మంత్రిత్వ శాఖ, బాలల యొక్క అభివృద్ధిని కాంక్షించేందు కోసం న్యాయ శాఖ సంయుక్తంగా వెంటనే నిపుణుల కమిటీ వేసి ఇంటిపనివారల సమస్యల పరిష్కారానికి తగిన మార్గాన్ని సరళతరం చేయాలని, అదే విధంగా ఇంటిపనివారల చట్టాన్ని తెచ్చి వారి యొక్క లాభం, రక్షణ, క్రమబద్ధీకరణ కల్పించాలని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు సూచించింది. నిపుణుల కమిటీ వెంటనే తగిన విధంగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంతో సంబంధిత మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకొని 6 నెలల లోపు కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంటూ సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా తీసుకొచ్చి పెట్టుబడిదారి, కార్పొరేట్, బడా వ్యాపారస్తులకు మేలు చేసేందుకు తెచ్చిన కోడ్‌లను 2019 నుండి నేటి వరకు అమలు చేయరాదని దేశంలోని 10 కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఇప్పటికే 27 సార్లు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలు చేయటంతో కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లను అమలు చేయటం లేదు. అంతేకాక గతంలో ఉన్న చట్టాలను యధావిధిగా అమలు చేయటం ద్వారా అసంఘటితరంగంలోని యావత్ కార్మిక వర్గం కృషి చేయాలి. కావున సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలకు చెంపపెట్టులాంటిది.


# సైన్స్-టెక్నాలజీ రంగంలో బాలికలు, మహిళలు రాణించలేరా?

నేటి అత్యాధునిక డిజిటల్ ఎఐ యుగం లో యువత అవకాశాలకు హద్దులు లేకుం డా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్తపుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చివేశాయి. నేటి విద్యావంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నోక్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలోచనలతో సరి కొత్త ప్రపంచా న్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్‌టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకు లు మాత్రమే అధికంగా ఉండడం, మహిళలు/బాలికల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగ వలసిన ప్రగతి నమోదు కావడం లేదు. ప్రకృతి లో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్‌టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ఈ మధ్యకాలంలో సైన్స్ చదివే బాలికలు, యువతుల సంఖ్య కొంత వరకు పెరిగినా సాధించాల్సింది చాలా ఉందని గమనిస్తూ వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించడం అవసరం అని తెలుసుకోవాలి.

**33–35 శాతం మాత్రమే మహిళలు:**

ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేడమ్ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురా లు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపం చ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడాని కి, నేటి బాలికలు/యువతులను సైన్స్ వైపు ఆకర్షించడానికి ఐరాస యూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవాన్ని పాటించ డం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యా లు, తల్లిదండ్రులు, పౌర సమాజం, శాస్త్ర సాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు/యువతుల దృష్టిని స్టెమ్ ఎస్టిఈఎం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమేటిక్స్ రంగాలవైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుం దని ప్రచారం చేయడం జరగాలి. నేడు 33 శాతం మహిళా శాస్త్రజ్ఞులు, 35 శాతం బాలికలు/యువతులు స్టెమ్ రంగంలో కొనసాగుతున్నారని, దీనిని 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని పురుషాధిక్య సమాజం బేషరతుగా ఒప్పుకోవాలి.

సైన్స్‌టెక్నాలజీ(స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11ఫిబ్రవరిన సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం నిర్వహిస్తున్నారు. 2025 నిర్వహిస్తున్న 'సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తం గా సైన్స్‌టెక్నాలజీ రంగ తలుపులు తెరిచి 'ఆమె' గళం విందాం అనే అంశాన్ని తీసుకొని పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. 1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటివరకు సైన్స్ రంగంలో 976 (28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం. మెడిసిన్‌రంగ నోబెల్ బహుమతుల్లో 5.6శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8శాతం మహిళలు మాత్ర మే ఉండడం శోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి.



నేటి పౌర సమాజం, ముఖ్యంగా పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్‌కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్ టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరిపేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగ డం చూద్దాం. సైన్స్‌టెక్నాలజీ రంగాలకు బాలికలు, యువతులను ఆకర్షిస్తూ, తగు స్కాలర్ షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్త ల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం. సైన్స్‌టెక్నాలజీ రంగాల్లో 'ఆమె' మేధో సంపత్తిని పెట్టుబడిగా పెడదాం.

**(11 ఫిబ్రవరి సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం సందర్భంగా)**

**డా బిఎం రెడ్డి,** 9949700037

# 'ఇంటర్నెట్' కత్తికి రెండు వైపులా పదును!

ఆధునిక మానవుడు అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువ త, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూ డా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలా న్ని వినియోగిస్తున్న నెటిజెన్లు పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగా లు, అసభ్యకర అవమానకర మాటలను వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది.




**సురక్షితంగా అంతర్జాలాన్ని వాడుకుందాం:**

అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దానిపట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 11 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు సురక్షిత అంతర్జాల దినం లేదా సేఫర్ ఇంటర్నెట్ డేపాటించడం ఆనవాయితీ గా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గా లు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్లైన్లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరం గా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి. సురక్షిత అంతర్జాల దినం 2025 ఇతివృత్తం గా అందరు కలిసి సురక్షిత అంతర్జాలాన్ని నిర్మించుకుందాం అనబడే అంశాన్ని తీసుకున్నారు.

**ప్రధాన ఆన్లైన్ మోసాలు:** అంతర్జాల ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచించింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్వేర్, ఆన్లైన్ గ్రూమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్లైన్ ప్రిడేటర్స్, సెక్సిటింగ్, రాన్సమ్వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్లైన్ అప్పు ల వేధింపులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యిం ది. వీటి పట్ల అవగాహనలేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవా లి.

అంతర్జాల కత్తికి రెండు వైపుల పదను ఉంటుంది. ఇంటర్నెట్ ఓ అద్భుత వరమే కాదు, అజాగ్రత్తగా ఉంటే అదో శాపంగా కూడా మారుతుందని తెలుసు కోవాలి.

చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం ఉండదు. మోసపోయిన తర్వా త దుఃఖించి ప్రయోజనం లేదని, ముందు జాగ్రత్తలు తీసుకుం టూ ఇంటర్నెట్ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, మోసాలు చేయజూస్తున్న ఆన్లైన్ మోసగాండ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం.

**(11 ఫిబ్రవరి సురక్షిత అంతర్జాల దినం సందర్భంగా)**

# గన్నులే కాదు.. పెన్నులూ ప్రమాదమే!

అర్బన్ నక్సల్స్ పేరుతో మరింత నిర్బంధం పెరిగే అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్యం గురించో, హక్కుల గురించో, రాజ్యాంగం గురించో, సమానత్వం గురించో మాట్లాడినా, రాసినా, ప్రశ్నించినా 'అర్బన్ నక్సల్స్' పేరుతో అణిచివేత తప్పదనే హెచ్చరికలు చాలా స్పష్టంగా జారీ అవుతున్నాయి. 'గన్నులే కాదు పెన్నులు' కూడా ప్రమాదంగానే భావించే పరిస్థితి ఏర్పడింది. అందుకే పెన్నులు పట్టుకున్న వారిని, రాజ్యాంగ హక్కుల గురించి మాట్లాడే వారిని, ప్రజాస్వామిక వాదులను, రచయితలను, జర్నలిస్టులను, ప్రజాసంఘాల అభ్యుదయవాదులను భయంవైపు నెట్టేస్తున్నారు. 'అభ్యుదయ ఆలోచనలు చేశారో అర్బన్ నక్సల్స్ అయిపోతారు. 'ఉపా' లాంటి కేసులు, జైళ్లు తప్పదు 'అంటూ భావాలను సైతం హత్యచేసే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా దేశరాజధాని ఢిల్లీలో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే గతంకంటే దూకుడుగా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత పెరిగిన విషయం కాదనలేం. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల కోసం తీసుకువస్తున్న అన్ని నిర్బంధ చట్టాలను 'అర్బన్ నక్సల్స్' ముద్రతో ప్రజాస్వామిక వాదులను కట్టడిచేసేందుకు ప్రయోగిస్తున్నారు. 'అర్బన్ నక్సల్స్' అని ముద్ర వేయడం వలన ప్రజలు, ఈ దేశం ఎదుర్కొంటున్న కీలకమైన సమస్యలపై చర్చ లేకుండా నివారించడానికి అనుకూలమైన మార్గంగా రాజ్యం ఎంచుకుంటుంది. అందుకే ముందే చెప్పినట్టుగా ప్రజాస్వామ్యం గురించో, రాజ్యాంగ హక్కుల గురించో సత్యం గురించో ఏమాత్రం ఆలోచించకుండా ఈ అర్బన్ నక్సల్స్ పేరుతో కట్టడి చేస్తున్నారు. దీనిలో భాగంగా సమాజంలో ఏ ప్రజాస్వామిక గొంతు కూడా వినకూడదని పకడ్బందీగా అమలవుతున్న నిర్బంధంలో భాగమే కొనసాగుతున్న ఈ 'అర్బన్ నక్సల్' ప్రక్రియ. ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి భిన్నాభిప్రాయాలు చాలా అవసరం. కానీ అలాంటి భిన్నాభిప్రాయాలు లేని రాజ్యం కావాలని కోరుకునే వారికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, హక్కులు అంటే ఎలా రుచిస్తుంది? ఏం తినాలో, ఏ గుడ్డలు వేసుకోవాలో, ఏ సాహిత్యం చదవాలో, ఏం ఆలోచించాలో కూడా రిమోట్ చేయబడుతున్నప్పుడు ఇక సత్యం వైపు నిలబడే వారికి మరింత క్లిష్టమైన పరిస్థితులు తప్పవు. అందుకే సత్యాన్ని అన్వేషించే భావాలు 'అర్బన్ నక్సల్స్' ముద్ర వేయబడుతున్నాయి. ఇది చిన్న విషయం కాదు. ఇది రాజ్యానికి, వ్యక్తికి, రాజ్యానికి భావజాలానికి మధ్య జరిగే ఒక యుద్ధం. ఇది చాలా పెద్ద యుద్ధం. పెద్ద సమస్య కూడా. ఒక రకంగా నా దృష్టిలో ఇప్పుడు పోలీసు బలగాలకు, మావోయిస్టులకు జరుగుతున్న యుద్ధం ఒకరకమైన యుద్ధం అయితే. దానికి భిన్నమైన దానికంటే కంటే పెద్ద సమస్య. పెద్ద యుద్ధం. అర్బన్ నక్సల్స్ ముద్ర పేరుతో ఈ సమాజంలో ఒంటరి చేసినప్పుడు దానిని ఎదుర్కోవడం ఒక యుద్ధమే. అది తుపాకులతో చేసే యుద్ధంకంటే కొంచెం భిన్నంగానే ఉంటుందనేది నా అభిప్రాయం.

అయితే ఇక్కడే మేధావులకు గుర్తింపు పొందిన వ్యక్తులకు కూడా ప్రశ్న ఏర్పడుతుంది. అవసరం అనుకున్నప్పుడు ఎంతటి వారపైనైనా అర్బన్ నక్సల్స్ ముద్ర వేయడానికి పాలకులు వెనుకాడటం లేదు. ఈ పరిస్థితుల్లో మేధావుల స్పందనలో సహజంగానే తేడాలుంటున్నాయి. గుర్తింపు పొందిన వ్యక్తి, మేధావిగా పేరున్న వ్యక్తి, సామాజికంగా రాజకీయంగా పరపతి కలిగిన వ్యక్తి అయితే ఒకరకంగా, అలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేని వ్యక్తి అయితే సమాజం స్పందన ఒకరకంగా ఉంటుందనే కామెంట్స్ ఉన్నాయి. ఎందుకంటే సహజంగానే ఒక ఆదివాసిపైనా, లేదా ఒక దళిత, గిరిజనులపైనా, నాలాంటి ఒక సాధారణ జర్నలిస్టు పైనా ( నేను 'ఉపా' బాధితున్ని) UAPA (ఉపా) ప్రయోగించబడితే సమాజం స్పందనలో చాలా తేడాలుంటాయి. మాబోటివాళ్లకు ఏమో..మావోయిస్టులతో సంబంధాలు ఉండొచ్చునేమో అనే అనుమానాలతో వ్యవహరిస్తుంటారు. (బహిరంగంగా వ్యక్తపరుచకపోయినా వారి వ్యవహార శైలిలో సహజంగానే బయటపడుతుంటుంది) నిత్యం అభ్యుదయం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, హక్కుల గురించి మాట్లాడే వారు సైతం 'ఉపా' బాధితులను చూసే దృష్టికోణం మారుతుంటుంది. ఇలాంటి 'ఉపా' బాధితుల గురించి మేధావులు నోరువిప్పకుంటే ఇంకెవరు మాట్లాడుతారు?. అసలు 'ఉపా' కేసులు అంటేనే తెలియని అమాయకులపై కూడా (ఆదివాసీలు) మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే పేరుతో ఖైదీ చేస్తున్నారు. నేను ఇదే 'ఉపా' కేసులో 96 రోజులు ఖమ్మం జైల్లో ఉన్నాను. అక్కడ అసలు ములాఖాత్ కూడా ఎలా పెట్టాలో తెలియని ఆదివాసీలపై ఉపా కేసులు పెట్టి జైల్లో పెట్టారు. అప్పటికే వారు సుమారు 18నెలలుగా ఆ జైల్లో ఉంటున్నారు. ఒక్కొక్కరిమీద పదుల సంఖ్యలో కేసులున్నాయని తెలిసింది. ఇది 2021 సంగతి. ఇలాంటి వారి గురించి మాట్లాడే శాతం తగ్గింది. ఈ స్థితి మారాల్సిన అవసరం ఉంది. అయితే ఇక్కడ మేధావి వర్గం అసలే స్పందించడం లేదనేది నా ఉద్దేశ్యం కాదు. ఆ స్పందన విస్తృతం కావాల్సిన అవసరం ఎంతో ఉంది. అక్కడ ఇంకో సమస్య కూడా ముందుకు వస్తుంది. 'ఉపా'లాంటి నిర్బంధ చట్టాలు కలిగించే భయం. భయం అనేది మనిషి స్పందనను కూడా కట్టడి చేస్తుంటుంది. ఆ మేరకు పౌర సమాజ స్పందన కూడా గిరిగీసుకుంటుంది. ఇది మేధావుల్లోనూ ఆయా భయం కట్టిపడేస్తుందనడంలో సందేహం లేదు అనుకోకతప్పదు. ఎర్రజెండా పార్టీల్లోనూ ఈ ఆనవాళ్లకు కొదువుండదు. ప్రజాస్వామిక వాదులు, ఎర్రజెండా పార్టీలు, దళిత, గిరిజన, ఆదివాసీ సంఘాలు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు అక్రమ కుట్ర కేసులైన 'ఉపా'కేసులను రద్దు చేయడమే కాదు 'ఉ' శాశ్వతరద్దు కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం గతంకంటే ఇప్పుడు ఎంతో ఉంది. అది రేపు ఎవరినైనా తాకొచ్చు....

రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్ వరంగల్

# మణిపూర్ బిజెపి రహస్య సమావేశాలు

### శాసనసభ్యులతో పార్టీ ఇన్‌చార్జి మంతనాలు




**ఇంఫాల్ :** మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా నేపథ్యంలో రాష్ట్ర బిజెపి ఇన్‌చార్జి సంబిత్ పాత్ర పార్టీ ఎమ్మెల్యేలు, ప్రముఖులతో స్థానిక హోటల్‌లో విడివిడిగా సోమవారం రహస్య సమావేశాలు నిర్వహించారు. స్పీకర్ థోక్‌చోమ్ సత్యబ్రత, మునిసిపల్ పరిపాలన గృహ అభివృద్ధి శాఖ మంత్రి వై.ఖేమ్‌చంద్, విద్యా శాఖ మంత్రి థైనోజమ్ బసంత్‌కుమార్ సింగ్, ఎమ్మెల్యే టి.హెచ్.రాధేశ్యామ్‌లతో పాత్ర సమావేశమైనట్లు బిజెపి వర్గాల సమాచారం. వీరిలో ముగ్గురికి పాత్రతో సన్నిహిత సంబంధాలున్నాయని భోగట్టా. భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్దేశించేందుకు పాత్ర ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. రానున్న 48 గంటలలో మరిన్ని సమావేశాలు జరుగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజధానిలో భద్రతను పెంచారు. కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మేఘచంద్ర మాట్లాడుతూ బీరేన్ సింగ్ రాజీనామాను స్వాగతిస్తున్నామని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు ఎటువంటి ప్రయత్నం చేసినా దానిని తాము వ్యతిరేకిస్తామన్నారు. కాంగ్రెస్ కొత్త ప్రభుత్వాన్ని, కొత్త నాయకత్వాన్ని కోరుకుంటోందని, రాష్ట్ర ప్రజల మనోభావాల్ని కేంద్రం గౌరవించాలని అన్నారు. అవిశ్వాస తీర్మానంలో ఓడిపోతానన్న భయంతోనే బీరెన్ రాజీనామా చేశారని, ఇది ఎప్పుడో చేయాల్సిందన్నారు. సోమవారం జరిగే బడ్జెట్ సమావేశాల్లో అవిశ్వాసం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలు భావించాయి. కానీ ఈలోగా బీరెన్ రాజీనామా చేయడంతో రాష్ట్రంలో అనిశ్చితి నెలకొన్నది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేవరకు కొనసాగాలని గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా బీరెన్ సింగ్‌ను కోరారు. 2023 మేలో మణిపూర్‌లో అల్లర్లు చెలరేగడంతో శాంతి భద్రతలను కాపాడడంలో బీరెన్ సింగ్ ప్రభుత్వం విఫలమైంది. అప్పటినుంచి ప్రతిపక్షాలు బీరెన్ పదవి నుంచి తప్పుకోవాలని పట్టు బడుతున్నాయి. అవిశ్వాస పరీక్షలో నెగ్గలేనన్న పరిస్థితిలో బీరెన్‌కు రాజీనామా తప్ప గత్యంతరం లేకపోయింది.

## చెత్తకుప్పలో భారీగా ఆయుధాలు

### ఏడు రాకెట్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

**చండీగఢ్ :** పంజాబ్‌లో భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో ఏడు రాకెట్లు కూడా ఉండటంతో స్థానికులతోపాటు అధికారులు కూడా ఉలిక్కి పడ్డారు. స్థానికంగా రాజ్‌పురా రోడ్‌లోని ఓ పాఠశాల సమీపంలోని చెత్తకుప్పలో ఉన్న సంచిలో ఏవో అనుమానాస్పద వస్తువులు ఉండటంతో పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకొని తనిఖీలు చేయగా ఆయుధ డంపు బయటపడింది. ఈ ఘటనపై ఎస్‌ఎస్‌పి నానక్ సింగ్ మాట్లాడుతూ ప్రాథమికంగా దర్యాప్తు ప్రకారం ఓ చెత్త వ్యాపారి వాటిని తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉండొచ్చు అని వెల్లడించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం సైన్యానికి కూడా సమాచారం అందించినట్లు వెల్లడించారు. అసలు ఈ రాకెట్ లాంచర్లు అక్కడకు ఎలా చేరాయి, ఎవరు తీసుకొచ్చారు అనేది దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనుక ఉగ్ర కోణాన్ని మాత్రం వారు కొట్టిపారేయలేదు. 2022లో తరన్ తరన్ జిల్లాలోని సర్హలీ పోలీస్ స్టేషన్‌పై రాకెట్ లాంచర్‌తో దాడి చేశారు. అక్కడికి సమీపంలోని జాతీయ రహదారి మీదుగా రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్‌ను వాడినట్లు గుర్తించారు. నాడు ఈ దాడికి ఓ ఖలిస్థానీ ముఠా కారణమని తేలింది. కానీ, 2023లో ఈ దాడికి సంబంధించి గురుపిందర్ అలియాస్ పిండూను అరెస్టు చేశారు. ఇతడు కెనడాకు చెందిన ఉగ్రవాది లక్బీర్ సింగ్‌కు సన్నిహితుడిగా గుర్తించారు.

# కుంభమేళాలో రాష్ట్రపతి



త్రివేణి సంగమం వద్ద ద్రౌపదీ ముర్ము పుణ్యస్నానం



**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం పాల్గొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద ఆమె పుణ్యస్నానం ఆచరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాష్ట్రపతికి ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తర్వాత వారితో కలిసి ద్రౌపదీ ముర్ము బోటులో పర్యటించారు. మార్గమధ్యంలో వలస పక్షులకు ఆమె ఆహారం అందించారు. అనంతరం త్రివేణి సంగమం వద్దకు చేరుకొని పుణ్యస్నానమాచరించి, పూజలు చేశారు.

**ప్రయాగ్‌రాజ్‌లో వందల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్..**

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా గతనెల జనవరి 13న ఆరంభమైంది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే కుంభమేళా కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. యుపి ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం ఇప్పటివరకూ దాదాపు 44 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26న ముగియనున్న మహా కుంభమేళాకు జన ప్రవాహం పెరుగుతుందే కానీ తగ్గటం లేదు. రద్దీ ఉన్నప్పటికీ తెల్లవారుజామున 3 గంటల నుంచే వేలాది మంది భక్తులు పవిత్ర స్నానమాచరించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. సోమవారం కూడా ప్రయాగ్‌రాజ్ చుట్టు పట్ల వందల కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ జామ్ నిలిచిపోయింది. కుంభమేళా ప్రాంగణంలో రద్దీ కారణంగా నిమిషాల్లో వెళ్లగలిగే ప్రాంతాలకు కూడా గంటల సమయం పడుతోంది.

**ట్రాఫిక్ రద్దీపై అఖిలేష్ విమర్శలు**

అధిక రద్దీ కారణంగా ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వే స్టేషన్‌ను శుక్రవారం వరకు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈవిషయంపై ఇప్పటికే ప్రతిపక్షాలు అధికార ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయి. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సిఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ యోగి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభమేళా నిర్వహణలో యోగి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ప్రయాగ్‌రాజ్ ప్రజలు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ప్రతిచోట వాహనాల రద్దీ నెలకొనడంతో భక్తులకు ఆహార ధాన్యాలు, కూరగాయలు, ఔషధాలు, పెట్రోల్, డీజిల్ వంటివి అందటం లేదన్నారు. దీంతో కోట్లాది మంది ప్రజలకు ఆకలిదప్పులు తప్పట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గంట గంటకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండడంతో భక్తులు ఆహారం, విశ్రాంతి లేక నీరసించిపోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో వందల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయిన దృశ్యాలను అఖిలేశ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# ఫ్రాన్స్‌లో ప్రధాని మోదీ




### ఎఐ సభకు సహ అధ్యక్షత

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటనకు ఫ్రాన్స్ బయలుదేరి వెళ్లారు. అక్కడ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి కృత్రిమ మేధ సదస్సుకు సహ అధ్యక్షత వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ పర్యటనలో మోదీ మాక్రాన్‌తో కలిసి మార్సెల్లిలోని యుద్ధ వీరుల స్మారక చిహ్నాన్ని సందర్శించి అమర వీరులకు నివాళులు అర్పించనున్నారు. అనంతరం మోడి విదేశీ పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లనున్నారు. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి ఇరు దేశాల సంబంధాలపై ఒక వీడియోతో కూడిన సందేశాన్ని పోస్ట్ చేశారు. మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లడం ఇది ఆరోసారి. ఈనెల 7న విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి మోదీ ఫ్రాన్స్ పర్యటన వివరాలను వెల్లడించారు. మోడి సోమవారం పారిస్ చేరుకున్న తరువాత స్థానిక ఎలిసీ ప్యాలెస్‌లో దేశాధ్యక్షుడు మాక్రాన్ ఆతిథ్యమిచ్చే విందులో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి పలు టెక్నాలజీ సంస్థల సిఈఓలు, ఆహ్వానితులు హాజరు కానున్నారు. మంగళవారం ఎఐ సదస్సులో మాక్రాన్‌తో కలిసి అధ్యక్షత వహించి ఇండియా–ఫ్రాన్స్ సిఈఓల సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తారని మిశ్రి తెలిపారు. మార్సెల్లిలో నిర్మించిన భారత దౌత్య కార్యాలయాన్ని మాక్రాన్‌తో కలిసి ప్రారంభిస్తారు. అనంతరం ఇరు దేశాల నేతలు అంతర్జాతీయ థెర్మో న్యూక్లియర్ ఎక్స్పరిమెంటల్ రియాక్టర్(ఐటిఇఆర్)ను సందర్శిస్తారు. గత యేడాది ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాన్ని నిర్వహించుకున్నాయి. రక్షణ, భద్రత, పౌర అణు అంశాలు, అంతరిక్షం, వ్యాపారం, వాణిజ్యం, ఆర్థిక అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపాయి. ఈసారి సాంకేతికత, సముద్రయాన భద్రత సహకారం, ఉగ్రవాదాన్ని అరికట్టడం, వైద్య సహకారం, పునరుత్పాదక శక్తి వంటి నూతన అంశాలపై సంప్రదింపులు జరుపనున్నట్టు మిశ్రి తెలియజేశారు.

**స్నేహ సంబంధాల పటిష్ఠత :మాక్రాన్**

ద్వైపాక్షిక స్నేహ సంబంధాలను పటిష్టం చేసుకునేందుకు మోడితో భేటి సహకరిస్తుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ పేర్కొన్నారు. ఇరు దేశాల నేతలు భేటి కానున్న నేపథ్యంలో మాక్రాన్ ఇండియాస్ ఫస్ట్ పోస్ట్, ఫ్రాన్స్ 24 వార్తా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇతర దేశాల సంబంధాలు, కృత్రిమ మేధ, ప్రపంచంపై దాని ప్రభావం గురించి తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మాక్రాన్ భారతదేశ సాంకేతిక సామర్థ్యాన్ని, విద్యా విధానాన్ని ప్రశంసించారు. ప్రతి యేటా అమెరికా, ఫ్రాన్స్‌లను మించి మిలియన్ మంది ఇంజనీర్లకు శిక్షణ అందిస్తోందన్నారు. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలు కొనసాగించే దిశగా చర్చలు జరుపుతామన్నారు.

**భారత్–యుఎస్ సహకారం పెంపు :మోడి**

ఫ్రాన్స్ పర్యటన అనంతరం అమెరికా పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య సహకారం పెంపొందించేలా చర్చలు జరుపనున్నట్టు మోడి వెల్లడించారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత మోదీ అమెరికా సందర్శించనుండడం ఇదే మొదటిసారి. సోమవారం ఫ్రాన్స్ పర్యటనకు బయలుదేరే ముందు మోదీ ఒక సందేశాన్ని విడుదల చేస్తూ అమెరికాతో సంబంధాలు మరింత మెరుగయ్యేలా తన పర్యటన ఉంటుందన్నారు. సాంకేతికత, వాణిజ్యం, రక్షణ, శక్తి, తదితర అంశాలపై చర్చలు జరుపనున్నట్టు తెలిపారు. ట్రంప్‌ను కలవడం ఇదే మొదటిసారి కాదని, ఇరుదేశాల ప్రజల ప్రయోజనాలు మెరుగయ్యేలా, ప్రపంచానికి మెరుగైన భవిష్యత్ అందించేలా తమ భేటీ ఉంటుందన్నారు.

### తప్పుదోవ పట్టించే ఔషధాల 'యాడ్స్'పై..

# సిఎస్‌లకు 'సుప్రీం' చురకలు

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇవ్వాలంటూ ధర్మాసనం ఆదేశం

### అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ఆయుర్వేదిక్, సిద్ధ, యునానీ ఔషధాల చట్టవిరుద్ధమైన ప్రకటనల (తప్పుదారి పట్టించే)కు వ్యతిరేకంగా చట్టం చేయడంలో వైఫల్యం చెందడంపై సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ఆంధ్రప్రదేశ్, జమ్మూకశ్మీర్ సహా పలు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిని పిలిపించి చురకలంటించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయడంలేదని మండిపడింది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరై ఎందుకు ఈ రాష్ట్రాలు ఆదేశాలను అమలు చేయాలేకపోయాయన్న కారణాలపై వివరణ ఇవ్వాలని ద్విసభ్యధర్మాసనం వారిని ఆదేశించింది. సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్ అమికస్ క్యూరీగా హాజరయ్యారు. చాలా రాష్ట్రాలు క్షమాపణలను అంగీకరించి, ఉల్లంఘించిన వారిని నిర్దోషులుగా ప్రకటించే బాధ్యతలను స్వీకరించారు. ఆయుర్వేదిక్, సిద్ధ, యునానీ ఔషధాల జారీ ప్రకటనలను అన్ని రాష్ట్రాలు దాని నిజమైన లేఖ, స్ఫూర్తితో 1945లోని ఔషధాలు, కాస్మోటిక్ రూల్స్ 170ను అన్ని రాష్ట్రాలు అమలు చేయడం ప్రారంభించి గణనీయమైన జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ అనేక రాష్ట్రాలు ఈ కోర్టు జారీచేసిన ఆదేశాలపై నిలబడటం లేదు. ఆదేశాలను ఏమాత్రం పాటించడం లేదు' అని ధర్మాసనం చెప్పింది. 170వ నిబంధన అమలుకు సంబంధించి ప్రతిస్పందనలతో సహా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, జమ్ముకశ్మీర్‌లను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ రాష్ట్రాలు వాటి ప్రతిస్పందనలను తెలియజేసేందుకు మేం ఈ నెల చివరి వరకు గడువు ఇస్తున్నామని, ఈ విషయంపై విచారణను మార్చి 7వరకు వాయిదా వేస్తున్నాం అని ధర్మాసనం తెలిపింది. ఆయుర్వేద, సిద్ధ, యునానీ ఔషధాలను తప్పుదారి ప్రకటించే ప్రకటనలను నిషేధించే డ్రగ్స్, కాస్మోటిక్ రూల్స్, 1945 లోని 170వ రూల్‌ను విస్మరించిన ఆయుష్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌పై గత ఏడాది ఆగస్టు 27న సుప్రీం కోర్టు స్టే విధించింది. 2024 మే 7న జారీ చేసిన సుప్రీంకోర్టు ఆదేశాలను మంత్రిత్వ శాఖ నొక్కిపెట్టి నోటిఫికేషన్ జారీ చేసిందని ధర్మాసనం తెలియజేసింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు 2024 మే 7న జారీ చేయడానికి ముందు కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నియామకాలు 1994 ప్రకటనదారు నుండి స్వీయ డిక్లరేషన్ పొందాలని ఆదేశించింది. కోవిడ్ వ్యాక్సినేషన్ డ్రైవ్, ఔషధాల ఆధునిక పద్ధతులకు వ్యతిరేకంగా యోగాగురు రాందేవ్ పతంజలి ప్రచారం బురదజల్లేలా ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) 2022లో దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది.

## తాగేందుకు శుద్ధ జలాల్లేవ్...

### అలాంటిది ప్రత్యేక సైకిల్ ట్రాక్‌లు కావాలా?

### పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ :** సైకిళ్ల కోసం దేశంలో ప్రత్యేకంగా ట్రాక్‌లు ఏర్పాటు చేయాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈ అభ్యర్థనపై మండిపడింది. మురికివాడలోని ప్రజలకు తాగేందుకు శుద్ధ జలాలు లేవని.. అలాంటిది సైకిళ్ల కోసం ప్రత్యేక ట్రాక్‌లు కావాలని కోరుకుంటున్నారా అంటూ వ్యాఖ్యానించింది. అనేక రాష్ట్రాల్లో రోడ్లపై సైకిళ్ల కోసం ప్రత్యేక ట్రాక్‌లు ఉన్నాయని.. దేశవ్యాప్తంగా ఈ సౌకర్యాన్ని కల్పించాలంటూ ఒక వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం.. ఒకసారి మురికివాడకు వెళ్లి చూడండి. వారి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోండి. కనీస సౌకర్యాలు ఉన్నాయో లేవో చూడండి. ప్రజలకు ఇళ్లు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద డబ్బు లేదు. తాగేందుకు శుద్ధ జలాలు లేవు. అలాంటిది సైకిల్ ట్రాక్‌ల గురించి పగటి కలలు గంటున్నారు అని జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. మనం ఎలాంటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వాటిపై ఒకసారి పరిశీలన చేసుకోవాల్సి అవసరం ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఉద్దేశాన్ని గుర్తు చేసుకోండి. తాగేందుకు సరైన నీటి సౌకర్యం లేదు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. కానీ, మీకు మాత్రం సైకిల్ ట్రాక్‌లు కావాలా..? అంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

## బంగ్లాదేశ్-భారత సరిహద్దుల్లో నెలకొన్న సాధారణస్థితి

### బిఎస్‌ఎఫ్ డైరక్టర్ జనరల్ దల్జీత్‌సింగ్ చౌదరి వెల్లడి

**ఇండోర్ :** బంగ్లాదేశ్‌తో ఉన్నటువంటి భారతదేశ సరిహద్దుల్లో సాధారణస్థితి నెలకొని, బాగానే ఉన్నదని సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) డైరక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి తెలిపారు. అక్రమచొరబాట్లను, స్మగ్లింగ్‌ను నియంత్రించేందుకు సరిహద్దు భద్రతా దళం పూర్తిగా సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. పాకిస్తాన్ మాదకద్రవ్యాలను, ఆయుధాలను ప్రత్యేకించి భారత సరిహద్దు వెంబడి ఉన్న పంజాబ్‌లోకి పంపడానికి డ్రోన్ల వినియోగం గురించి అడిగిన ప్రశ్నకు బిఎస్‌ఎఫ్ డైరక్టర్ జనరల్ స్పందిస్తూ 'తీవ్రంగా తగ్గింది' అని వెల్లడించారు. ఇండోర్‌లో బిఎస్‌ఎఫ్ 52వ ఇంటర్‌ఫ్రాంటియర్ ప్లాటూన్ వెపన్స్ షూటింగ్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దల్జీత్‌సింగ్‌చౌదరి 'పిటిఐ'తో మాట్లాడుతూ అక్రమచొరబాట్లు, స్మగ్లింగ్ తరహా కార్యకలాపాలను నియంత్రించేందుకు గట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని, వాటి ప్రభావం దేశ భద్రతపై పడకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం అని బిఎస్‌ఎఫ్ డిజి వివరించారు. అంతర్జాతీయ సరిహద్దులో డ్రోన్ టెక్నాలజీ బెదిరింపులను పరిష్కరించడానికి బిఎస్‌ఎఫ్ అత్యాధునిక పరికరాలతో సాయుధమైందని చౌదరి చెప్పారు. భారత సరిహద్దు గుండా పాకిస్తాన్ మాదకద్రవ్యాలను, ఆయుధాలను పంపించడానికి డ్రోన్‌లను ఉపయోగించడంపై ప్రశ్నించగా సరిహద్దు భద్రతాదళం వినియోగిస్తున్న యాంటీడ్రోన్ టెక్నాలజీ మూలంగా అడ్డుకట్ట వేయగలిగామని, ఫలితంగా అటువంటి సంఘటనలు చాలావరకు తగ్గిపోయాయని వివరించారు. మేం మా బలమైన రక్షణ సాంకేతికతను ఉపయోగించి సరిహద్దులోనే అనేక డ్రోన్లను అడ్డగించి వాటిని కూల్చివేశామని దల్జీత్‌సింగ్ చౌదరి తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి నాటికల్లా నక్సలిజాన్ని అంతమొందిస్తామని చెప్పడం సాధ్యమేనా అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ సరిహద్దు భద్ర తా దళం ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని వేర్వేరు ప్రాంతాలలో మోహరించి నక్సల్ ముప్పు సమస్యను పరిష్కరిస్తున్నదని తెలియజేశారు. ఈ దేశాన్ని సురక్షితంగా ఉంచడంలో బిఎస్‌ఎఫ్ సిబ్బంది బాధ్యతే కీలకమన్నారు.

# బలమైన ప్రపంచాన్ని సృష్టిద్దాం

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్




**బెంగళూరు :** బలహీనమైన దేశంలో శాంతికి మనుగడ లేదని, బలీయమైన ప్రపంచాన్ని సృష్టించాలంటే ఇండియా బలమైన దేశంగా రూపొందాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రపంచంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను ప్రస్తావిస్తూ వాటి నివారణకు విశాల భారతదేశం శాంతి, సుస్థిరతల ఆవశ్యకతను సూచిస్తోందన్నారు. సోమవారం 15వ ఏరో ఇండియా షోను ప్రారంభిస్తూ రక్షణ రంగంలో ప్రైవేటు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని రాజ్‌నాథ్ అన్నారు. రక్షణ, శాంతి స్థాపనలో మనం ఏకాకి కాదని, విదేశీ మిత్రులు కూడా ఒక ప్రపంచం, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్ అనే అంశాలలో భాగస్వాములని ఎయిర్ షోను ఉద్దేశించి అన్నారు. అనిశ్చిత పరిస్థితులు, సవాళ్లను ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. శాంతి అనే వృక్షం బలీయమైన వేళ్లపైనే నిలబడగలదని, మనమందరం కలిసికట్టుగా ఉన్నపుడే శాంతి స్థాపన సాధ్యమని, మనం బలంగా ఉన్నపుడే మెరుగైన ప్రపంచాన్ని సృష్టించగలమన్నారు. భారత దేశ చరిత్రను పరిశీలిస్తే మనం ఏ దేశంపై అనవసరంగా దాడి చేయలేదని, ఎవరితోనూ శతృత్వం లేదన్నారు. విశాల భారత దేశం ఎపుడూ శాంతినే కోరుకుందని, ఇది కేవలం మాటలకే పరిమితం కాదని, ఇది మన ప్రాథమిక భావజాలం అన్నారు. మన దేశ సాంకేతిక అభివృద్ధి, పారిశ్రామిక బలాన్ని ప్రపంచానికి తెలియజేయాలన్నదే ఎయిర్ షో ఉద్దేశమన్నారు. కలిసికట్టుగా పనిచేస్తే ఫలితాలను ఉమ్మడిగా అనుభవించవచ్చన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశం స్థితి నుంచి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ రూపుదిద్దుకుంటోందన్నారు. అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించామన్నారు. రక్షణ రంగంలోనూ పలు కీలక ఆవిష్కరణలు సాధించామన్నారు. గత పదేళ్లలో రక్షణ రంగాన్ని ప్రభుత్వం కీలక రంగంగా గుర్తించిందని, బడ్జెట్‌లో రక్షణ రంగానికి 6.81 లక్షల కోట్ల నిధులను కేటాయించడం ఇందుకు నిదర్శనమని, గతంలో కంటే ఇది 9.53 శాతం ఎక్కువన్నారు.

# లోక్‌సభ ఎన్నికల కోసమే 'ఇండియా'

### కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాకూర్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్–కాంగ్రెస్ కలహాల వల్లే బిజెపికి ప్రయోజనం చేకూరిందన్న విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాకూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇండియా' కూటమి లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పడిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో నిర్దిష్టమైన పొత్తులే కొనసాగుతాయన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆప్‌ను దిగజార్చే ఆటలాడిందని విమర్శలు వస్తున్నాయన్న ప్రశ్నకు ఠాకూర్ స్పందిస్తూ కూటమిని విచ్ఛిన్న చేసిన వ్యక్తినే ఆ ప్రశ్నలు అడగాలని పరోక్షంగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయితే ఒకటి మాత్రం స్పష్టమని 2024 లోక్‌సభ ఎన్నికల కోసం మాత్రమే 'ఇండియా' కూటమి ఏర్పడిందన్నారు. పలు రాష్ట్రాల్లో వేర్వేరు వ్యూహాలున్నాయన్నారు. ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్ కూటమిగా ఉన్నాయని, అయితే పంజాబ్‌లో లేవని గుర్తు చేశారు. అదే విధంగా గుజరాత్‌లో భాగస్వామ్యపక్షంగా ఉన్నాయని, ఇతర ప్రాంతాల్లో లేవన్నారు. గోవాలో తమకు మద్దతు తెలిపారన్నారు. ఢిల్లీ విషయానికొస్తే, అరవింద్ కేజ్రీవాల్ డిసెంబరు 1వ తేదీనే తాము ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారన్నారు. మోదీ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని, అయితే అది జరిగిందన్నారు. ఆ తరువాత పార్లమెంట్‌లో ఫ్లోర్ స్థాయిలో పరస్పరం సహకరించుకుంటున్నాయని ఠాకూర్ చెప్పారు. ఇండియా కూటమి విజన్ ఓ ప్రత్యామ్నాయ విజన్‌ను అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తన ప్రసంగంలో పేర్కొన్నారన్నారు. కేవలం అది కాంగ్రెస్ విజన్ కాదన్నారు. అందుకు తాము సానుకూలదృక్పథంతో ఉన్నామన్నారు. కానీ దానిని ఒక భాగస్వామి విచ్ఛిన్నం చేశారని మనకు తెలుసునన్నారు. 'రాష్ట్ర ఎన్నికలు భిన్నంగా ఉంటాయి. రాష్ట్ర ఎన్నికలు రాష్ట్ర స్థాయి పొత్తులపై జరుగుతాయి. పార్లమెంటులో, మేము సమన్వయం చేసుకుంటున్నాము. ప్రతిపక్షనేత దీనిని ఇండియా కూటమి విజన్ అని పేర్కొన్నారు' అని అన్నారు. పార్లమెంటులో, ఎస్‌పి, టిఎంసి, ఆప్, అందరూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా పోరాటంలో కలిసి ఉన్నారన్నారు.

**ఇండియా కూటమి కలిసికట్టుగా ఉండాలి: చతుర్వేది**

బిజెపికి సవాళ్లు విసిరేందుకు అందరం కలిసికట్టుగా ఉండాల్సిన అవసరం ఉందని శివసేన (యుబిటి) నేత ప్రియాంక చతుర్వేది అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆమె స్పందించారు. ఒకరితో ఒకరు పోట్లాడుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని సూచించారు. ఇండియా కూటమి కలిసికట్టుగా తన చర్యలను సిద్ధం చేసుకోవాల్సిన ఉందన్నారు. మన వ్యక్తిగత రాజకీయ ఆశయాలు భారతదేశ ప్రయోజనాలను అధిగమిస్తున్నాయని గ్రహించాలని భావిస్తున్నారు. సోమవారం ఆమె పార్లమెంట్ కాంప్లెక్స్‌లో పిటిఐతో మాట్లాడారు. మనకు రక్షణగా ఉండే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అవసరమని, అందువల్లే ఇండియా కూటమి కలిసికట్టుగా ఉండన్నారు. మన ఆ భావనకు వ్యతిరేకంగా వెళుతున్నట్లయితే, అందరూ ఓడిపోతామని, ఒకరినొకరు ఓడించుకోవడంలో బిజీగా ఉంటే, అది మనం కలిసి వచ్చిన ఉద్దేశ్యానికి ఉపయోగపడదని చతుర్వేది అన్నారు.

### బీజాపూర్ ఎన్‌కౌంటర్ మృతుల్లో

# 11 మంది మహిళా మావోయిస్టులు

### 31 మందిలో ఐదుగురిని గుర్తించిన పోలీసులు

### వారిపై రూ.25 లక్షల రివార్డ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టుల నడుమ ఆదివారం చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో 11 మంది మహిళా మావోయిస్టులతో సహా 31 మంది మావోయిస్టులు మృతి చెందగా వారిలో ఐదుగురి మృతదేహాలను సోమవారం ఆ రాష్ట్ర పోలీసులు గుర్తించారు. గుర్తించిన వారిలో మావోయిస్టు పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడు హంగా కర్మ (రూ.8 లక్షల రివార్డు), ప్లాంటూన్ నెంబర్ మంగూ హేమ్లా (రూ.5 లక్షల రివార్డు) నేషన్ పార్ట్ ఏరియా కమిటి సభ్యుడు సుభాష్ ఓయం (రూ.5లక్షలు), గంగులూరి ఏరియా కమిటీ సభ్యుడు సన్ను(రూ.5 లక్షలు), మరొకరు నేషల్ పార్క్ కమిటీ ఏరియా సభ్యులు రమేష్ (రూ.2లక్షల రివార్డు) ఉన్నారు. గుర్తించి వారిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఇంకా 26 మందిని గుర్తించాల్సి ఉండగా వారి మృతదేహాలను గుర్తించాల్సి ఉండటంతో వాటిని ప్రత్యేక షెడ్‌టెంట్‌లో భద్రపరిచారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది మొదలు ఇప్పటివరకు 81 మంది మావోయిస్టులను బలగాలు మట్టుపెట్టాయి. బీజాపూర్ జిల్లాలోని మద్దెడ్, ఫర్సెగట్ పోలీస్ స్టేషన్ సరిహద్దుల్లోని అటవీ కొండలు, ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో తెలంగాణ మావోయిస్టు ప్రత్యేక జోనల్ రాష్ట్ర కార్యదర్శి బండి ప్రకాష్ అలియాస్ భాస్కర్, నేషనల్ పార్క్ కమిటీ ఏరియా సభ్యులు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు జరిగిన కూంబింగ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మావోయిస్టులతో పాటు ఇద్దరు జవాన్లు సైతం మృత్యువాత పడ్డారు. ఘటనా స్థలంలో 24 తుపాకులు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో తరలించిన విషయం విధితమే. ఇప్పటికైనా మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలని ఐజి సుందర్ రాజన్ తెలిపారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

వరంగల్ జిల్లా, వరంగల్ మండలములోని కరీమాబాద్‌కు చెందిన **ఆమంచి రమ్యశ్రీ తండ్రి సదానందం** గారికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ఒరిజినల్ డాక్యుమెంట్లు జనవరి నెలలో కరీమాబాద్ నుండి వరంగల్ బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ పోయినవి.**డాక్యుమెంట్ నంబర్: 504/2014** గల డాక్యుమెంట్లు దొరికినవారు ఈక్రింది అడ్రస్‌లో ఇవ్వగలరని మనవి.

ఇట్లు

**ఆమంచి రమ్యశ్రీ, తండ్రి: సదానందం**

ఇంటి నెంబర్ : 17-2-477,

వీధి: భీరన్నకుంట, కాలనీ: కరీమాబాద్,

మండలం: వరంగల్, జిల్లా: వరంగల్,

పిన్ నంబర్ - 506002,

**ఫోన్ నంబర్: 8919902687**

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ ఆగు **కాలే శివలీల, భర్త: నారిమళ్ళ యాదగిరి,** వయస్సు:23 సంవత్సరాలు, నివాసం: 2-84, రహమంతపూర్ గ్రామము, గుండ్లపల్లి (డిండి) మండలం, నల్లగొండ జిల్లా గారికి కీర్తిశేషులు కాలే లక్ష్మమ్మ భర్త కీర్తిశేషులు కాలే సోమయ్య, గారి స్థిరాస్తి నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలము, నిజాం నగర్ గ్రామ వాస్తవ్యులు ఇదే గ్రామ శివారులోని గల సర్వే నెం:448 లో విస్తీర్ణం: 1 ఎకరం పొలం ఉన్నది. కావున నా క్లయింట్ తల్లిదండ్రులు ఇద్దరు చనిపోవడంతో వారి తల్లి గారి మరణ తేదీ: 22/04/2004, తండ్రి మరణ తేదీ: 25/09/2021 తేదీలలో మరణిచడం జరిగింది. **తల్లి కీర్తిశేషులు కాలే లక్ష్మమ్మ పేరు మీద ఉన్న సదరు భూమిని నా క్లయింట్ కాలే శివలీల పేరు మీద భూమి పట్టా చేసుకోవడానికి అర్హురాలు.** కావున ఎవరికైనా అభ్యంతరం ఉంటే గుండ్లపల్లి మండలం తహసీల్దార్ గారిని సంప్రదించగలరు. నా క్లయింట్ ఆదేశానుసారము ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడం జరుగుతుంది.

ఇట్లు

**వి. వి. రామారావు,**

**న్యాయవాది,**

ఇంటి నెం: 18-62/1, గాంధీనగర్,

దేవరకొండ, నల్గొండ.

సెల్ నెం: 9848830155.



## మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరిస్తాం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెలు చెల్లించని మొండి దుకాణాదారులపై కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్ అధికారులు అన్నారు. నోటీసులు ఇచ్చి అద్దె చెల్లించని మొండి బకాయిదారుల దుకాణాలను సోమవారం సీజ్ చేశారు. కాంప్లెక్స్‌లో 8 దుకాణాదారులు గత 10 నుంచి 20 నెలలుగా 1029170 రూపాయలు బకాయిలు ఉన్నారని, దీంతో దుకాణం నెం. 5, 6, 13, 15, 45, 59, 74, 75లకు మున్సిపల్ కమీషర్ యూసుఫ్ అధికారులు, సిబ్బందితో వెళ్లి తాళాలు వేసి సీజ్ చేశారు. అత్యధికంగా ఉన్న షాపు నెం45 ఉన్న అతను రూ.199395 బకాయి ఉన్నట్లు తెలిపారు. అద్దె బకాయిదారులు ఇంకా ఉన్నారని నోటీసులు ఇచ్చి చెల్లించని వారి షాపులు సీజ్ చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాజి, జూనియర్ అసిస్టెంట్ మాజీద్, బిల్ కలెక్టర్ శ్రీనులు ఉన్నారు.

## మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలుగా దేశగాని హేమలత



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో కామ్రేడ్ ధర్మబిక్షం భవనంలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) నియోజకవర్గ అధ్యక్షురాలుగా దేశగాని హేమలతను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను, చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచారాల మీద పోరాటాలు చేస్తామని, మహిళ సమైఖ్యను జిల్లా కేంద్రంలో బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, జిల్లా కార్యదర్శులు కోటమ్మ, మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, మహిళ నాయకురాళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

కోదాడ డిఎస్‌పి మామిళ్ల శ్రీధర్‌రెడ్డి




**ప్రజాపక్షం/కోదాడ :** విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోదాడ డిఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులకు ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఎటిఎం, పాన్ కార్డు, ఓటిపి నంబర్లు చెప్పవద్దని, వ్యక్తిగత ఫోటోలు డిపిలుగా పెట్టుకోవద్దని సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్‌ను ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు గురికావద్దని, మహిళలు షీటీం సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాబృందాలు ఆట పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, షీటీమ్ ఎఎస్ఐ కృష్ణమూర్తి, కానిస్టేబుల్ యాకుబ్, మహిళ పోలీసులు జ్యోతి, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎబిఎన్ ఇంప్లాయించి వ్యాధిపై చర్యలు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** కర్ణాటక, మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గుండా కోళ్లకు ఏబిఎన్ ఇంప్లాయించి వ్యాధి విస్తరిస్తున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోళ్లతో వెళుతున్న వ్యాన్లను జాతీయ రహదారి పైన చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఉండవెల్లి పశు వైద్యాధికారి డా.శిరీష తెలిపిరు. సోమవారం 44వ జాతీయ రహదారి మీద టోల్గేట్ దగ్గర చెక్‌పోస్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. కోళ్లకు కొత్తగా ఈ వ్యాధి రావడం వలన తెలంగాణ రాష్ట్రంలో కూడా వ్యాపించే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఇతర రాష్ట్రాలు తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవని ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పరిశీలన నిమిత్తం నిరంతరం కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పశువులు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థ జర చూడండి... మా మొర ఆలకించండి మహాప్రభో

**ప్రజాపక్షం/అనంతగిరి:** అనంతగిరి మండల పరిధిలోని బొజ్జగూడెం తండా గ్రామంలోని రెండవలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకుందామన్న పంచాయతీ కార్యదర్శి ఎప్పుడు వస్తున్నాడో, ఎప్పుడు వెళ్తున్నాడో మాకు తెలియకుండా ఉందని, ఒక వేళ సమస్య ఉందని కార్యదర్శి ఫోన్‌చేస్తే దానికి స్పందన లేక పోవడం గమనార్హం. చరవాణి ద్వారా ఒకటి, రెండు సార్లు స్పందించి ఆ పని పూర్తి చేస్తున్నామని చెప్పి పనిచేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలో మురుగునీరు ప్రవహిస్తుండటంతో వాసన వస్తుందని, దీంతో మాకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, అసలే వేసవికాలం దోమలు, ఈగలు ఎక్కువై విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో చక్కర్లు కొడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్

బరిలో 23 మంది అభ్యర్థులు .. చివరి రోజు 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్ల దాఖలు





**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. వివిధ రాజకీయ పార్టీల తోపాటు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉండేందుకు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ చివరి గడు వరకు 23 మంది అభ్యర్థులు 50 సెట్ల నామినేషన్ లు దాఖలు చేయగా చివరి రోజు 18 27 సెట్ల నామినేషన్లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కు దాఖలు చేశారు.సోమవారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో భారతీయ జనతా పార్టీ తరఫున పులి సరోత్తమ్ రెడ్డి 2 సెట్ల నామినేషన్ దాఖలు చేశారని, లింగిడి వెంకటేశ్వర్లు ప్రజావాణి పార్టీ తరఫున 2 సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా ఏక్తా పార్టీ తరఫున బండారు నాగరాజు 1 సెట్ నామినేషన్ దాఖలు చేశారని వెల్లడించారు. దామెర బాబురావు, ఏలే చంద్రమోహన్, పింగిలి శ్రీ పాల్, ఎస్. సుందర్రాజు, పూల రవీందర్, డాక్టర్ కొల్లిపాక వెంకటస్వామి, తలకోల పురుషోత్తం రెడ్డి లు స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కొక్కరు 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, తాటికొండ వెంకట రాజయ్య, పన్నాల గోపాల్ రెడ్డి, గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, జెట్టి శంకర్ ,బండారు నాగరాజు, గంగిరెడ్డి కోటిరెడ్డి, తండు ఉపేందర్లు స్వతంత్ర అభ్యర్థులుగా ఒక్కో నామినేషన్ దాఖలు చేసినట్లు ఆమె వెల్లడించారు.

# 'సైబర్ నేస్తం'తో బాధితులకు న్యాయం

సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోవద్దు

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ:** అధిక వడ్డీ ఆశ, సులువుగా లోన్లు ఇప్పిస్తామంటూ, చైన్ సిస్టం ద్వారా అధికంగా డబ్బు సంపాదించవచ్చు అంటూ సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోవద్దని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు, సైబర్ నేస్తం కార్యక్రమం ద్వారా మోసపోయిన బాధితుల సమస్యలను పరిశీలించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఈ రోజు ఎక్కువగా భూ సమస్యలు, ఫైనాన్స్ సమస్యలు, భార్యాభర్తల మధ్య సమస్యలు రాగ బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు. అలాగే డయల్ యువర్ సైబర్ నేస్తంకి సైబర్ నేరగాళ్లు చేతిలో మోసపోయిన 9 మంది బాధితులు ఫిర్యాదు చేయడం జరిగింది.వీరిలో ఒక బాధితుడు అధిక వడ్డీ ఆశకు ఇన్వెస్ట్మెంట్ ఆప్లో కొంత డబ్బు పెట్టుబడి పెట్టగా,ఇతనికి కొంత డబ్బు ఇచ్చి ఆశ చూపించారు. ఎవరైనా బాధితులు సైబర్ మోసాలకు గురి అయితే వెంటనే 1930కు సమాచారం అందించాలని కోరారు.ప్రతి సోమవారం 11గంటల నుండి 2 గంటల వరకు సైబర్ బాధితుల కొరకు డయల్ యువర్ సైబర్ నేస్తం అనే కార్యక్రమం ఉంటుందని మీ సమస్యలు తెలుసుకొనుటకు ఫోన్ నంబరు 8712658079 కాల్ చేయగలరని తెలిపారు.

# సాగునీరు అందించాలని రైతుల ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సాగునీరు అందించాలని కోరుతూ మోతె, చివ్వెంల, నడిగూడెం, మునగాల మండలాలకు చెందిన రైతులు సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా నీటిపారుదల శాఖ పర్యవేక్షణ అధికారి(ఎస్‌సి) కార్యాలయం ఎదుట గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, సంఘం నాయకుల ఉమాట్లాడుతూ పై మండలాలకు విడతల వారిగా సాగు నీరు అందిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారని కానీ నేటికి సాగునీరు అందడం లేదన్నారు. తమ బోరు, బావులతో వరి పంట సాగు చేసుకోగా నేడు భూగర్భజలాలు అడుగంటడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి కాలువల ద్వారా విడుదల చేస్తున్న నీరు ఈ ప్రాంతాల రైతులకు అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇలాండి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఎస్ఆర్ఎస్‌పి జలాలు చివరి రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నామవరం చెవురును రిజర్వాయర్ చేసి పాలేరు నుండి నీటిని లిఫ్టుచేసి ఈ ప్రాంత రైతాంగానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య, ఉపాధ్యక్షులు ముప్పాని లింగారెడ్డి, సహాయ కార్యదర్శి ఉప్పల మల్లయ్య, నల్లగొండ వెంకన్న, రమేష్ బాబు, తండు మల్సూర్, నారాయణ, సునీల్, శిగ రవి, నారాయణరెడ్డి, బాలు, బైర వెంకన్న, మండవ శ్రీను, వెంకన్న, తండా కృష్ణ పాల్గొన్నారు.



## బెల్లంపానకం ధ్వంసం

**ప్రజాపక్షం/పెన్‌పహడ్ (సూర్యాపేట):** అక్రమంగా నాటు సారా తయారు చేసిన సార అమ్మిన కఠిన చర్యలుంటాయని పెన్‌పహడ్ ఎస్ఐ కస్తాల గోపికృష్ణ అన్నారు. సోమవారం పెన్‌పహడ్ మండల పరిధిలోని న్యూబంజారా హిల్స్‌తండా, జల్మాల్ కుంట తండా, ఎల్లప్పకుంట తండాలో నాటుసారా తయారి కేంద్రాలపై దాడులు చేసి బెల్లం, పానకంను ధ్వంసం చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన తెల్లబెల్లాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తండాల్లో ఎటువంటి చెడు అలవాట్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహడ్ పోలీసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అధ్యాపకుల డైరీ ఆవిష్కరణ




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** తెలంగాణ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల డైరీని సోమవారం నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ళ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగి రమేష్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అధ్యాపకులంతా అంతర్గత కలహాలు మాని విద్యాభివృద్ధికి తోడ్పాడాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు ఎదురుకుంటున్న అనేక సమస్యలను సామరస్యంగా ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలకు విద్య కోసం వచ్చేది ఎక్కువగా బడుగు, బలహీన వర్గాల పిల్లలేనని అన్నారు. మొదటి తరం విద్యార్థులను విద్యావంతులను చేస్తేనే రాష్ట్రం, దేశం బాగుపడుతాయని అన్నారు. అధ్యాపకుల సంఘాలు రెండూ సామరస్యంతో అంశాలవారీగా కలిసి పని చేయాలని కోరారు. మనలో మనం తగవులాడితే విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు.కార్యక్రమంలో జిసి టి ఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శి డాక్టర్ బ్రిజేష్, టిజిసి జిటిఏ రాష్ట్ర అధ్యక్షులు డా. భాస్కర్, రాష్ట్ర నాయకులు డాక్టర్ శంకర్, డాక్టర్ వాసం శ్రీనివాస్, జిల్లా అధ్యాపక సంఘ నాయకులు డాక్టర్ ఎం. అనిల్ అబ్రహం,డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం /హాలియా:** రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హాలియా మార్కెట్లో కందుల కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ రిజిస్టర్ మురళీ చారి అన్నారు. సోమవారం హాలియా వ్యవసాయ మార్కెట్లో కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం గిట్టుబాటు ధర కల్పించే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు. సంఘం సెక్రటరీ రావుల సత్యం, ఏవో సరిత, మార్కెట్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, ఏఈఓ కళ్యాణ్, సిబ్బంది శంకర్, జానకి రాములు, అయుబ్ ఖాన్, సీనయ్య తదితరులు పాల్గొన్నారు.





# హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తన భూమిలోకి ఇతరులు ప్రవేశించకుండా చూడాలని, రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ అల్వాల్‌పాడు గ్రామానికి చెందిన గుడిపాటి నారాయణమ్మ సోమవారం సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌ను కలిసి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. త్రిపురారం మండలం బొర్రాయిపాలెం గ్రామ శివారులో సర్వే నెం.271లో రఘునాథ్‌బట్టాదార్ పట్టాభూమిలో కొంత భూమిని తన తండ్రి కొనుగోలు చేశారన్నారు. బొర్రాయిపాలెం పక్కనే ఉన్న అల్వాల్‌పాడులో తన భర్తతో కలిసి నివసిస్తున్నట్లు తెలిపారు. 2001లో పసుపు కుంకు కింద తన తండ్రి 1.30 ఎకరాల భూమిని నా పేరు రిజస్టర్ చేసి నాకు స్వాదీనం చేయగా అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకోని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నాపేరున పాస్‌బుక్ ఇచ్చి రైతుబంధు మంజూరు చేసిందన్నారు. కాగా గతేడాది అప్పటి సర్పంచ్ వరుసకు బందువైన చెవుల రాములు అందుకు ప్రతిగా ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు ఇప్పిస్తానని నీ భూమిలో 20గుంటలు క్రీడా ప్రాంగణం కోసం ఇవ్వమని చెప్పి డబ్బులు ఇవ్వకపోతే అల్వాలపాడు రాజేందర్‌నగర్ మధ్య బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన బట్టిని తెచ్చి భూమిలో పోశారని అన్నారు. డబ్బులు చెల్లించకముందే మట్టిని ఎలా పోస్తారని అధికారులకు ఫిర్యాదు చేయగా క్రీడా ప్రాంగణం బిల్లు నిలిపివేశారని అన్నారు. దీంతో కక్ష పెంచుకోని తహసీల్దార్‌కు ముడుపులు చెల్లించి ఆ భూమిలో క్రీడా ప్రాంగణం భూమిగా బోర్డు పాతించారన్నారు. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా గత నెల 24న నా హైకోర్టు నా భూమిని నాకు అప్పటించాలని ఆర్డీవోకు, తహసీల్దార్‌కు, మండల సర్వేయర్‌కు ఆదేశాలు జారీ చేసిందన్నారు. గత నెల 30న హైకోర్టు ఉత్తర్వును త్రిపురారం తహసీల్దార్‌కు అందించడం జరిగిందన్నారు. అయినప్పటికీ తహసీల్దార్ నా భూమిలో ఇటీవల మొక్కలు నాటించేందుకు ప్రయత్నించారని అన్నారు. ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందన్నారు. తక్షణమే సదరు అధికారిపై చర్యలు తీసుకోని నా భూమిని నాకు అప్పగించాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. లేనిపక్షంలో మానవ హక్కుల కమీషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు. ఆమె వెంట భర్త శ్రీనివాస్, కుటుంబసభ్యులు ఉన్నారు.



## పనితీరు మార్చుకోకపోతే చర్యలు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఉపాధ్యాయుల తీరు మార్చుకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. సోమవారం మండలంలోని జనంపల్లి గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి పరిశీలించి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. విద్యార్థినిలతో దురుసుగా ప్రవర్తించిన వారిప చర్యలు తీసుకుంటామని వారం రోజుల్లో పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. విద్యార్థినిలతో, తల్లిదండ్రులతో మాట్లాడి ఆందోళన పడవద్దని సూచించారు. బాత్‌రూమ్‌లో లైట్స్ లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినిలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కలెక్టర్ వెంటనే బాత్‌రూమ్‌లలో లైట్స్, టాప్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కోతుల బెడద ఉందని విద్యార్థులు చెప్పడంతో పాఠశాల చుట్టు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించగా అపరిశుభ్రంగా ఉండడంలో శానిటేషన్ చేయాలన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన సరుకులు అందించాలని సూచించారు. నాణ్యమైన సరుకులు ఉపయోగించకపోతే చర్యలు తప్పవన్నారు. ఆర్డీవో పర్యవేక్షణలో మెడికల్ క్యాంపును నిర్వహించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో యాకుబ్‌నాయక్ పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం సరఫరా చేసే వారికి మద్దతిస్తున్న సిఐపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** తమను ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న నకిరేకల్ సిఐ రాజశేఖర్ పై చర్యలు తీసుకోవాలని నకిరేకల్ మం లం తాటికల్ గ్రామానికి చెందిన మాచ్చపోతుల వెంకన్న అధికారులను కోరారు. సోమవారం పట్టణంలోని రామగిరిలోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాటికల్ గ్రామానికి చెందిన నోముల రామలింగయ్య,నోముల సైదులు పిడిఎస్ బియ్యం ను అక్రమంగా రవాణా చేస్తుంటే వారి మీద చర్యలు తీసుకోమని తాను తన భార్య సరిత కోరగా పట్టించుకోకుండా సిఐ రాజశేఖర్ వారి వద్ద నుండి లంచాలు తీసుకొని తమ మీదనే ఉల్టా కేసులు పెట్టి జైలుకు పంపాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు అనేక మార్లు జిల్లా స్థాయి, నుండి రాష్ట్ర స్థాయి వరకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు.హైదరాబాద్ మల్టీ జోన్ 2 పోలీస్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేసిన పట్టించుకోకుండా మీ జిల్లాకు చెందిన పోలీస్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేయాలని అన్నారని తెలిపారు.అక్రమాలకు పాల్పడుతున్న సిఐపై చర్యలు తీసుకోకపోతే ఈనెల 20వ తేదీన హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ముగిసిన సరస్ ఫెయిర్



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణంలో గత వారం రోజులుగా టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా గ్రామీభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు సరస్ ఫయిర్ 2025 సోమవారం ముగిసింది.ఈసందర్భంగా డిఆర్ డి ఓ వై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ సరస్ ఫెయిర్ లో గ్రామీణ స్వయం సహాయ మహిళా సంఘాలు తయారు చేసిన చేనేత హస్తకళ ఆహార ఉత్పత్తుల అమ్మకాలు ప్రదర్శనకు విశేష స్పందన రావడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా చేనేత, పచ్చడ్లు , వన్ గ్రామ అర్నమెంట్స్, మట్టి పాత్రలు లాంటి వి మంచి అమ్మకాలు జరిగావని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళలు చాలా అభివృద్ధి చెల్లి ఎందుకు దోహదపడుతుందని తెలిపారు అనంతరం స్టాల్స్ నిర్వహించిన వారికి, ఆఫీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్ర్యమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## చిత్తశుద్ధితో పనిచేస్తా: ఒయూ శంకర్

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** గతంలో గెలిచినటువంటి ఎమ్మెల్సీలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేశారు తప్ప ఉద్యోగంగా అభివృద్ధికి కృషి చేయలేదని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ ఓయూ శంకర్ ఆరోపించారు. నల్లగొండవరంగల్ ఖమ్మం ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ ఓయూ శంకర్ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ ఖమ్మం వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ అధ్యాపక ఓటర్లు మద్దతు ఇచ్చి గెలిపిస్తే దశాబ్దాలుగా అపరిృత సమస్యలని పరిష్కరించడం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు. గతంలో గెలిచినటువంటి సంఘాల నాయకులు ఎమ్మెల్సీలు రాజకీయ పార్టీల కోసం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేశారు తప్ప పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ఉపాధ్యాయులు ఆచార్యుల హక్కుల కోసం ఏమాత్రం ప్రయత్నం చేయలేదన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు సైదులు రెడ్డి , ఖలీల్, గౌతమ్, కోటేశ్వరరావు, రవిశంకర్, సంపత్, స్వామి, రాజశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, బొజ్జ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు శాఖలవారీగా స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యం లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి ఫిర్యా దులు, వినతులను అదనపు కలెక్టర్ బిఎస్‌లతతో కలిసి కలెక్టర్ స్వయంగా స్వీక రిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూధన్, జివాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్ష కులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసి నిబంధనలు తప్పకుండా పాటించాలి

* ఇందిరమ్మ ఇండ్లను వెంటనే ప్రారంభించాలి
* పిహెచ్‌సి,సబ్ సెంటర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వ హించేందుకు రాష్ట్ర ఎన్నికల ఆదేశాలు తూచ తప్పకుండ పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రిపరేషన్‌లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి గ్రామపంచాయతీ మొదటి విడు త, రెండో విడుత పోలింగ్ అధికారులకు మ ండలాల వారిగా ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పోలింగ్ అధికారులకు ర్యాండమైజేషన్ నిర్వహించారు. మొదటి విడుతలో 14 మండలాల కు 2750 మంది పోలింగ్ అధికారులకు, 3342 ఇతర పోలీంగ్ అధికారులకు, రెండవ విడుతలో 12 మండలాలకు 2659 పోలింగ్ అధికారులు, 3115 ఇతర పోలింగ్ అధికారులకు మొత్తం 11867 మంది అధి కారులను కేటాయించారు.జిల్లా కలెక్టర్ మనుచౌదరి మా ట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులపై పూర్తి స్థా యి లో అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమం లో గ్రామపంచాయతీ న్యూస్ పేపర్ మేనే జ్ మేంట్ అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు**

జిల్లాలో 26 మండలాల్లో ఎంపిక చేసిన గ్రామా ల్లో ఇందిరమ్మ ఇండ్ల సాంక్షన్ పత్రా లను అందచేసిన ఇండ్లను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదే శించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరే ట్‌లో ఎంపిడిఓ, పంచా యతీరాజ్ ,ఆర్ అండ్ బి



అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జనవరి 26వ తేదీన మండలాల వారిగా ఎంపిక చేసిన గ్రామల్లో ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ దాదాపు 2543 లబ్దిదారులకు అందచేసినట్లు తెలిపారు. గ్రామా ల్లో స్పెషల్ అ ధికారుల సమక్షంలో ఎం పిడిఓల నేతృత్వ ంలో పంచాయతీ సెక్రటరీలతో అసలైన లబ్దిదారు లకు అందించేందుకు, మరోసారి లబ్దిదారుల తో చర్చించి వారికి ఎంపిక చేసిన స్థలంలో ఇం జనీరింగ్ ఎఈ లతో ఇందిరమ్మ మోడల్ హౌజి ంగ్ మ్యాఫ్‌ను చూపించి పనులు ప్రారంభిం చే లా చర్యలు తీసుకోవాలన్నారు.మండ లానికి మోడల్ ఇందిరమ్మ ఇండ్లనిర్మాణం కొరకు స్థలాన్ని సేకరణ చేసి మోడల్ హౌజ్ త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌజింగ్ పిడి దామో దర్‌రావు, డిఎం అండ్‌హెచ్‌ఓ పల్వాన్ కుమార్, పంచా యతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డిఈ చిరంజీవులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం

రిజర్వేషన్‌లు కల్పించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ :** స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పి ంచాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజే శారు.ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిసిల జనాభాను తగ్గించి చూపుతూ కులగణన చేపట్టారని, గతంలో బిసిలు 56శాతం ఉంటే ప్రసుతం సర్వేలో 46 శాతం చూపించి బిసిల జనాభాను ఎందుకు తక్కువ చేసి చూపుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు తమ వినతులను తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి తిరుపురం రాంచందర్, బిసి మహిళ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచ కొండ రోజా(న్యాయవాది), బిసి సంక్షేమ సంఘం సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, యూత్ కో–ఆర్డినేటర్ హృషికేష్, బిసి నాయకులు పాల్గొన్నారు

# అర్జీల పరిష్కారానికి ఆదేశాలు



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి :** ప్రజావాణిలో పజల నుండి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పలు అర్జీలను స్వీకరించి, వాటిని ఆ యా శాఖల అధి కారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 121 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి శేషాద్రి, వేములవాడ ఆర్‌డిఒ రాజేశ్వర్ ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఎండిన పొలాలకు కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలి


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శ



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** బిసిల్లో కులాల వారీగా లెక్కలు ఎంత జనాభా ఉన్నదో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లెక్కలు ఎందుకు బయట పెట్టడంలేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. తప్పుడు లెక్కలు చెప్పడం, బిసి ఉద్యమ నాయకులు, కుల సంఘా లతో సిఎం మాట్లాడకపోవడం, 42 శాతం రిజర్వేషన్స్ ఇచ్చే వరకు బిసిలందరు తెలం గాణ తరహా మరో పోరాటానికి సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోనీ బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వెంటనే బిసి కుల సం ఘాలతో చర్చలు జరపాలని, 52 శాతం బిసిలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తే ల్చారని, కానీ లెక్కపెట్టడం కూడా రాని రేవంత్ రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబు తోందని, బిసిల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయమన్నారు. రాజకీయ కక్షను పక్కనపెట్టి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చి న హామీలు సరిగ్గా అమలు చేయలేకపోయారని రేవంత్ రెడ్డికి కాలం గుణపాఠం చెబు తుందని చెప్పుకొచ్చారు. అర్హులకు వెంటనే ఇళ్లు ఇవ్వాలని,రేషన్ కార్డులను ఎం దుకు జారీ చేయడం లేదని, రు ణ మాఫీ ఎక్కడా కూడా సంపూర్ణంగా కాలేదని ప్రభుత్వ తీరు పై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని కవిత ఆరోపించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని, మనోధైర్యంతో కార్యకర్తలు చెక్కుచెదర లేదని తెలిపారు. ఉప ఎన్నికవస్తే జగిత్యాలలో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని కవిత జోశ్యం చెప్పారు. సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ,మాజీ జెడ్పి ఛైర్పర్సన్ దావ వసంత సురేష్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు ఓరుగంటి రమణారావు, కోరుకంటి రాము, దేవందర్ నాయక్, దయాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌డేలో బాధితుల సమస్యలు పరిష్కారం

ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి:** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జగిత్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది అర్జీదారులతో ఎస్‌పి అశోక్ కుమార్ నేరుగా మా ట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని, పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీ లించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూ డాలన్నారు.ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# మనోవికాస పాఠశాలకు బస్సు అందజేత

ఆధునీకరించిన డివిజనల్ కార్యాలయం ప్రారంభించిన జోనల్ మేనేజర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జీవిత బీమా సంస్థ ఎల్ఐసి తన సామాజిక బాధ్యతలో భాగంగా గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ పథకం కింద మనోవైకల్యం కలిగిన వారి శ్రేయస్సు కోసం సంఘం పమెన్‌కాప్ ఆధ్వర్యంలో రూ.24 లక్షల విలువ చేసి 32 సీట్ల బస్సును దక్షిణ మధ్య జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ అందజేశారు. అనంతరం ఆధు నీకరించి డివిజనల్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 2006 సం వత్సరంలో ఏర్పాటు చేసిన గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ కార్యక్రమం కింద సామాజిక ప్రయోజనం చేకూరే అనేక కార్యక్రమాలను ఎల్ఐసి నిర్వహిస్తోందని, మానసిక వైక ల్యం ఉన్న పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న మనోవికాస పాఠశాలకు ఈ బస్సును అందజేయడం చాలా సంతోషకరమన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని వితరణ కార్య క్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కార్యాలయ ఆధునీకరణను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి ఉద్యోగులకు అందు బాటులోకి తెచ్చిన జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ స్వామి, కార్యాలయ ఇంజనీర్ శేషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కె టింగ్ మేనేజర్ ఎంఆర్‌కె శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేష్‌ఖన్నా, క్లాస్ వన్ అధికారుల సంఘం నాయకులు వాసుదేవరెడ్డి, కమలాకర్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామ్మోహన్‌రావు, వామన్ రావు, మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులున్నారు.

# నామినేషన్ కోసం వాహనాలతో వెళ్లిన మంత్రులు

అభ్యంతరం వ్యక్తం చేసిన సర్దార్ రవీందర్‌సింగ్

కలెక్టరేట్ వద్ద రెండు వర్గాల మధ్య బాహాబాహీ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఎమ్మెల్సీ ఎన్నికలకు చివరి రోజు అభ్యర్థులు నామి నేషన్లు వేసే క్రమంలో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తతకు దారి తీసింది. స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ నామినేషన్ దాఖలు చేసి బయటకి వస్తున్న క్రమంలో అధికార కాం గ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ సమర్పించడానికి పిసిసి ప్రెసిడెంట్, మంత్రు లతో కలిసి కలెక్టర్ కార్యాలయం లోపలికి వాహనాలతో వెళ్లారు. దీనిని గమనించిన సర్దార్ రవీందర్‌సింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలను, కోడ్‌ను ఉల్లంఘించి వాహనాలతో అంత మంది ఎలా వెళతారంటూ మండిపడ్డారు. ఈక్రమంలో రెండు వర్గాల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ బాహాబాహీకి దిగారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. నామినేషన్ల ప్రక్రియ యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.సామాన్యులకు ఒక న్యాయం..అధికార పార్టీ మంత్రులకు మరో న్యాయమా అంటూ రవీందర్‌సింగ్ విమర్శించారు.ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన మంత్రులపై కేసులు



నమోదు చేయాలని డిమాండ్ చే శారు. దీనిపైఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు.కాం గ్రెస్ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపొందాలని అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించి నివేదిక అం దించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో భూగర్భ జలాల సంచార నాణ్యత ప్రయోగశాల వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాల శాఖ పెద్ద పల్లి ఆధ్వర్యంలో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద భూగర్భ జలాల నాణ్యత విశ్లేషణ కోసం సంచార నాణ్యత ప్రయోగశాల (మొబైల్ క్వాలిటీ ల్యాబ్ ఆన్ వీల్స్) ను సమర్థ వంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. రామగుండం పరిసర ప్రాం తాలు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంలో భూగర్భ జలాల నాణ్యత పై అధ్యయనం చేసి నివేదికల సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ జలాల అధికారి జి. లావణ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత బహుజన గొంతుకను మండలిలో వినిపిస్తా..

స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రణధీర్ సింగ్ రాణా



**ప్రజాపక్షం/కరీంనగర్ :** దళిత బహుజన మైనార్టీ సమస్యల పట్ల ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో వాణిని వినిపించడం కోసమే పట్టభద్రుల ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసానని సర్దార్ రణధీర్ సింగ్ రాణా అన్నారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడుగా కొనసాగుతున్న ఆయన సోమవారం కలెక్టరేట్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ, బిసి, మైనార్టీ అగ్రకులాల్లో పేదలు వివక్షకు గురవుతున్నారని, ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా వారి స్థితిగతులు మారడం లేదన్నారు. పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవ గాహన ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకగా మారి బరిలో నిలిచిన తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పోరాటం చేస్తానన్నారు.

# నవోదయను తరలిస్తే ఉపేక్షించేది లేదు

* ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని నేరేళ్ల గ్రామ శివా రులో ఏర్పాటు చేయనున్న నవోదయ విద్యాలయాన్ని నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోకి తరలించే ప్రయత్నాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఒక వేళ తరలింపు ప్రక్రియ ప్రారంభమైతే ఉపేక్షించేది లేదని, నేరేళ్ల శివారులో ఏర్పాటు జరిగేంత వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమ వారం పాత్రికేయుల సమావేశంలో అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం నూతనంగా 18నవోదయ పాఠశాలలను మంజూరు చేసింది. దీనిలో సిఎం రేవంత్ రెడ్డి చొరవతో జగిత్యాల జిల్లాకు ఒకటి మంజూరు కాగా దానిని ధర్మపురి మండలంలోని నేరేళ్ల శివారు సర్వే నెంబర్ 252లో 30 ఎకరాల్లో ఏర్పాటు చే యాల్సిందిగా కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి తాను లేఖ రాయగా, నవోదయ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారని అడ్లూరి గుర్తు చేశారు. అయితే గత పది రోజుల క్రితం ఇక్కడికి మంజూరైన నవోదయ విద్యాలయాన్ని నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెం ట్‌లోకి తరలించాలని ఎంపి అరవింద్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసారని, కేంద్ర ప్రభు త్వం మంజూరు ఇచ్చిన దాన్ని తరలించాలని ఎంపి అరవింద్ చేస్తున్న ప్రయత్నాలు ఆక్షేపనీయమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మపురి మండలంలోనే ఏర్పాటు చేసేలా ఢిల్లీకి వెళ్లి సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రం అందజేస్తానన్నారు. వీలైతే ప్రధాన మంత్రిని కలుస్తామని వారు సానుకూల స్పందన ఉంటుందని భావిస్తున్నామనిఅలా జరగకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని, నవోదయ ఏర్పాటుపై వెనక్కి తగ్గేది లేదని విప్ లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. దినేష్, వేముల రాజేష్, చీపిరిశెట్టి రాజేష్, జక్కు రవీందర్, చిలుముల లక్ష్మ ణ్, ఎస్. ప్రసాద్, కే. సుధాకర్, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ మేళా

మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్




**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** ఎల్ఆర్ఎస్ మేళాను పెద్దపల్లి పట్టణ ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. సోమవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెవిన్యూ,ట్రేడ్ లైసెన్స్ ఎల్ఆర్ఎస్ మేళాలను మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ 10నుండి 25 వరకు 15 రోజుల పాటు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మేళాలను సద్వినియోగం తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శ్రీకర్, సంధ్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

**టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి**

**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి :** గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ దే విజయమని టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా పొన్నాల వద్ద కరీంనగర్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి నరేందర్ నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంఎల్‌ఎలు కొద్ది సేపు ఆగారు. సిద్దిపేట పట్ట ణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమాన్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిజిఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు, ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీ ఆశీర్వదించాలన్నారు.

# సమన్వయంతో మహా శివరాత్రి వేడుకలు

* ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలి
* ఈ నెల 25 నుండి 27 వరకు జాతర నిర్వహణ
* కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

ఏర్పాట్లపై ఎస్‌పితో కలెక్టర్ సమీక్షా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహాశివరాత్రి జాతర వేడుకలు విజయవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ అఖిల్ మహజన్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈవో, ఆయాశాఖల ఉన్నతాధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుధ్యం, పార్కింగ్,రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్‌క్యాంప్‌ల ఏర్పాటు, ఫైర్‌ఇంజన్ సౌకర్యం, కళ్యాణ కట్ట, ధర్మగుండం, బద్ది పో మ్మ ఆలయం, హెల్ప్ సెంటర్, సిసిటివిల ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝూ మాట్లాడారు.25 నుండి 27 వరకు మహాశివరాత్రి జాతర వేడుకలను వైభవోపేతంగా నిర్వహి ంచాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వ హిం చాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పా టు చేయాలని, ప్రతి పందిరి దగ్గర అవసరమైన భద్రత కల్పిం చాలన్నారు. ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ గతం కంటే అధికంగా పా ర్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, అక్కడ పోలీసుల కోసం టెంట్, త్రాగునీటి సరఫరా ఉండాలన్నారు. తిప్పాపూర్ చౌరస్తా దగ్గర సాయంత్రం ఉండే మార్కెట్ జాతర సమయంలో ఉండకుండా ముందస్తు సమాచారం సంబంధిత వ్యాపారులను అందజేయాలని ఎస్పీ మున్సిపల్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఈవో వినోద్ రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు : రూ.25వేలు జరిమానా

**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పాత గూడూరు కు చెందిన బోయిన రమేష్ అనే వ్యక్తి మహిళాను హత్య చేసిన కేసులో ముద్దయికి జీవిత ఖైదీ విధి స్తూ జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ సంచలన తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ధర్మారం మండలం పత్తిపాకకు చెందిన కనుక మనవ్వకు ఇద్దరు కుమార్తెలున్నారు. చిన్న కుమార్తె లతను వెల్గటూర్ మండలం పాతగూడూరుకు చెం దిన దేవయ్యకు ఇచ్చి వివాహం చేశారు.లత భర్త ఉపాధి నిమిత్తం బయట దేశానికి వెళ్లేవాడు. పాత గూడూరు గ్రామానికి చెందిన బోయిని రమేష్ అను వ్యక్తి లత ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. జనవరి 7, 2021 రాత్రి సమయంలో లత ఇంటికి వచ్చిన రమేష్‌ల మధ్య గొడవ జరుగగా, దానితో రమేష్ ఆమెని గొంతు నులిమ డంతో ముక్కులో నుండి రక్తం వచ్చి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు బోయిని రమేష్‌ను కోర్టులో హాజరుపర్చారు. కేసును విచారిం చిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితునికి జీవిత ఖైదుతో పాటు 25 వేల జరి మానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు.

# కాంగ్రెస్ బలోపేతమే ముఖ్యం

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట నియోజకవర్గంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ముఖ్యమని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త తన వంతుగా కృషి చేయాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ముఖ్యమంత్రిచేస్తున్న అభివృద్ధిని గ్రామాలలో ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామాలలో పార్టీ



అభివద్ధికి కృషి చేయాలని,రానున్న ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురేలా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు భిక్షపతి, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, సత్యనారాయణ, రాజ్ బహదూర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 75 వినతులు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ప్రజల వినతులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు 75 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌ఛార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే అద్భుతమైన కళ



ప్రజాపక్షం/ నర్సంపేట: మార్షల్ ఆర్ట్స్ మనిషికి ఆత్మవిశ్వాసాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తుందని, అంతేకాకుండా ఈ కరాటే ఆత్మరక్షణ కోసం ఉపయోగించుకునే అద్భుతమైన కళ అని బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ పేరు రాజేంద్రప్రసాద్ రెడ్డి గారు అన్నారు. లక్నేపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూలు విద్యార్థులు షోటోకాన్ జపాన్ కరాటే ఇండియాహాంబు సంస్థ ఆదివారము నర్సంపేటలో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని 54 పతకాలు సాధించారు. అభినందన కార్యక్రమంలోఆయన మాట్లాడారు. వెయ్యి మందికి పైగా పాల్గొన్న ఈ పోటీల్లో పాఠశాల నుండి కటా, కుమ్తే విభాగాల్లో పాల్గొన్న విద్యార్థుల్లో 20 గోల్డ్ మెడల్స్, 34 సిల్వర్ మెడల్స్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీం ఛాంపియన్‌షిప్ ఒకటి గెలుచుకుని సంచలనం సృష్టించారు. కరాటే మాస్టరు రచ్చ భవానీచంద్‌ను ఛైర్మన్ అభినందించారు. బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఎండి రియాజుద్దీన్, క్రాంతికుమార్, రామ్మూర్తి, యాకూబ్ రెడ్డి లతోపాటు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి : రంగరాజన్‌పై దాడిచేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు సంఘీ ఎలేందర్ అన్నారు. సోమవారం దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం శివనగర్ తమ్మెర భవన్‌లో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో దళితులను గుడిలోకి రానీయకుండా ఎంతో మంది మనువాద బ్రాహ్మణులు అడ్డుకుంటూ ఉంటే చిలుకూరి ఆలయ పూజారి రంగరాజన్ పూజారి దళితున్ని తన భుజాలపై మోస్తూ గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి దేవుని వద్ద అందరూ సమానులే అంటూ చాటుకున్న పూజారి రంగరాజన్ సేవలను కొనియాడారు.

## 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో వెంటనే బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధం చేయాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. లోకల్ బాడీ ఎన్నికలలో ప్రజా ప్రతినిధులుగా బిసిలు అధిక శాతం మంది ఎన్నికయ్యే అవకాశాలున్నాయని, గండికొట్టేందుకు ఎవరైన యత్నిస్తే బిసిలు సంఘటితంగా సమరం సాగించడంతో పాటు యుద్దమే అని హెచ్చరించారు. బిసిల రాజకీయ ప్రయోజనాల కోసం అసెంబ్లీని సమావేశ పరిచి బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి యుద్ధ ప్రాతిపదికన అమలు చేసేందుకు ప్రభుత్వపరంగా చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఎన్నికలలో 42 శాతం టికెట్లు ఇస్తామని చెబుతున్నారు. ఇది బిసిలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు, అసెంబ్లీలో బిల్లు ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కుల సర్వే గణాంకాలను తక్షణమే సమీక్షించి గణాంకాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ప్రజాపక్షం/పాలకుర్తి: అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని సీఐ జి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముత్తారం గ్రామ శివారులోని వాగులో నుండి అక్రమంగా ఇసుక తరలించకుండా వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు జేసీబీ సహాయంతో ఇసుక ట్రాక్టర్లు వాగులోకి వెళ్లకుండా గుంతను తవ్వించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి గుంతను పూడ్చి అక్రమంగా ఇసుకను తరలించినచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐలు డి పవన్‌కుమార్, యాకూబ్, హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టొద్దు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నా రు. సోమవారం ప్రజాదివాస్‌లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లా డారు.

## ఎఎస్ఐ సువర్ణకు కాంస్య పతకం



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : జాతీయ షూటింగ్ క్రీడల్లో ఛాంపియన్ షిప్ పోటీల్లో మహిళా ఎఎస్ఐ సువర్ణ కాంస్య పతకాన్ని సాధించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ ఏ.ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న సువర్ణ గత డిసెంబర్15నుండి31వరకుమధ్యప్రదేశ్ భోపాల్‌లో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జరిగిన 67 జాతీయ షూటింగ్ క్రీడల ఛాంపియన్‌షిప్‌లో సువర్ణ 50 మీటర్ల ప్రోన్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కారించారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సుబేదారి ఇన్స్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ఆదర్శంగా ఇందిరమ్మ మోడల్ హౌస్

### నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
### హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య





ప్రజాపక్షం/హనుమకొండ : ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిబంధనల మేరకు నాణ్యతతో నిర్మాణం పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు, సెట్ బ్యాక్ ఎంత పెట్టారు, మెటీరియల్ ఏమి వాడుతున్నారు, క్యూరింగ్ ఏవిధంగా చేస్తున్నారు, ఏ బ్రిక్స్ వాడుతున్నారు, తదితర వివరాలను హౌసింగ్ అధికారి రాజేందర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఉపయోగపడే సిమెంట్ ఇటుకల తయారీని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని సూచించారు. ప్రభుత్వం అందించే నిధులతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో మోడల్ హౌస్ ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. తహసిల్దార్ సదానందం, ఎంపిడిఒ అనిల్ కుమార్, ఎంఇఒ రాంధన్, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని బిసి సంక్షేమ హాస్టల్, సాంఘిక సంక్షేమ హాస్టల్, దేవాదుల క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండడంతో వాటిని కలెక్టర్ పరిశీలించా రు. నిరుపయోగంగా ఉండడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి నుంచి హనుమకొండకు హాస్టల్స్‌ను మార్చిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వీటి విషయమై కలెక్టర్ స్పం దిస్తూ సంబంధిత శాఖల అధికారులు అందించే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్స్‌ను తిరిగి తీసుకువచ్చే విషయమై పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్ రెడ్డి, ఎస్సీ సంక్షేమశాఖ ఈడీ బాలరాజు, అధికారులున్నారు.

### కెజిబివిలో మౌలిక వసతులు కల్పిస్తాం

ధర్మసాగర్ : కెజిబివిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రావిణ్య అన్నారు. ధర్మసాగర్ మండలం ముప్పారం పరిధిలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్నికలెక్టర్ సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, పాఠశాల మైదానం, వంటగది, స్టోర్ రూమ్, మెడికల్ రూమ్‌ను పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ప్రావిణ్య మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఫలితాల్లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో రూ. 7.50 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, తుది దశకు చేరుకున్న పనులను పరిశీలించినట్లు చెప్పారు. ఎంపీ ల్యాడ్స్ నుండి మంజూరైన నిధులతో విద్యుత్తు, హైమాస్ట్ లైట్లు, తదితర వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ నుండి రూ. 25 లక్షలతో అప్రోచ్ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. కేజీబీవీ లోని ల్యాబ్స్, లైబ్రరీ, స్పోర్ట్స్, ఇతర మౌలిక వసతులను పరిశీలించినట్లు చెప్పారు. అదనంగా కావలసిన అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం బాగుందని పేర్కొన్నారు. పాఠశాలలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లయితే నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులను చేయించనున్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ గా మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వచ్చిన హెల్త్ కార్డులను పరిశీలించి వైద్య పరీక్షలను నిర్వహించడం తోపాటు మందులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్పర్సన్ పవిత్ర, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ రాందన్, కెజిబివి ప్రత్యేక అధికారి మాధవి, కోఆర్డినేటర్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : విద్యార్థులు సైన్స్‌లో ప్రావీణ్యం పొంది దేశానికి ఉపయోగపడేలా శాస్త్రవేత్తలుగా ఎదగాలని మహబూబాబాద జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎ.రవీందర్‌రెడ్డి సూచించారు. ఎఫ్‌పిఎస్‌టి ఆధ్వర్యంలో ఆదివారం మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయిలో ఫిజికల్ సైన్స్ సబ్జెక్ట్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు ఆయన ముఖ్య అతిథిగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌సి విద్యార్థులు ఆన్‌లైన్ మోడల్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనడం మంచి అవకాశంగా తీసుకోవాలని ఇది తర్వాత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్ఎస్‌సి తర్వాత ప్రతి అవకాశం టాలెంట్ టెస్ట్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. అన్ని రకాల పోటీ పరీక్షలు ఇదే తరహాలో జరుగుతాయని ,ప్రతి విద్యార్థి 10/10జిపిఏ సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఓ సూచించారు. 10/10 సాధించిన జిల్లాలోని ప్రతి ప్రభుత్వపాఠశాల విద్యార్థికీ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు తమ వంతు వితరణను ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ఎఫ్‌పిఎస్‌టి మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి విద్యార్థులకు జిల్లా అధ్యక్షులు డి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, కోశాధికారి విజయరాజ్ ఇతర జిల్లా కమిటి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని 18 మండలలాల నుంచి ముగ్గురు టాపర్స్ చొప్పున ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ నిర్వహణకు అవకాశం కల్పించిన టిజిఎంఎస్ ప్రిన్సిపాల్ దేవేందర్‌ను ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ అప్పారావు, సిఎంఓ ఆజాద్, ఎఫ్‌పిఎస్‌టి ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు యద్దనపూడి గాయత్రి, ఝాన్స్, బిక్షపతి, ఓంప్రకాష్, గంగాధర్, రవీందర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ‘మా భూములు కాపాడండి’

### సిపికి బిసి కాలనీ పద్మశాలీ కులస్థులు ఫిర్యాదు



ప్రజాపక్షం/కమలాపూర్: ప్రభు త్వం తమకు ఇచ్చిన భూములను కొంత మంది కబ్జా చేసి మమ్మల్నీ అరిగోస పెడుతున్నారు..తాము బతకడం కష్టంగా ఉంది.. మీరే న్యాయ ం చేసి తమ భూములను కాపాడాలని సిపి అంబర్ కిషోర్ కు విన్నవించుకున్నారు కమలాపూర్ బిసి కాలనీ పద్మశాలి కులస్థులు. సోమవారం సిపి కార్యాలయంలో ప్రత్యేకంగా ఆయనను కలుసుకున్న బిసి కాలనీ పద్మశాలి కులస్థులు బిసి కాలనీ పద్మశాలి కులానికి చెందిన కొన్ని ఫ్లాట్లను ఎస్‌సి కులానికి చెందిన కొందరు కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇండ్ల నిర్మాణం చేపడుతుంటే అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కబ్జా చేసి లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సిపి ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వాడ్నాల నరేందర్ మాట్లాడుతూ... ఇదే విషయమై గత వారం రోజుల క్రితం కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, ఇవాళ సిపి అంబర్ కిషోర్ ను కలిసి ఫిర్యాదు చేశామని, కాలనీ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని ఆయన కోరారు. సమస్యకు ఆఫీసర్ల నుండి పరిష్కారం దొరకని యెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని, కబ్జాదారులు ఇకనైనా ఆ కబ్జాలు మానుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పోరండ్ల కృష్ణ ప్రసాద్, పద్మశాలి కులస్థులు వావిలాల మురళి, వెంగళ బాలకృష్ణ, బిసి కాలనీవాసులు పాల్గొన్నారు.

# మహిళలకు అధిక ప్రాధాన్యత



ప్రజాపక్షం/జనగామప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని మహిళా కాంగ్రెస్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుకన్య, జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర అన్నారు. సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ సమావేశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన వాగ్దానం మేరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉచిత బస్సు, విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అందజేస్తున్నారు. త్వరలోనే మహిళలకు 2500 రూపాయలు ఇవ్వనున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా మహిళల పేరుతోనే నిర్మాణం జరగనున్నాయని అందుకే మహిళలు రావోవు ఎన్నికల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నా పథకాలకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మహిళా సభత్వాలు చేయడంలో జిల్లాలోని పలువురు మహిళలకు పదవులు వచ్చాయన్నారు. రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి కావ్య శ్రీరెడ్డి, బుట్రెడ్డి శ్రీలతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు మున్నీ బేగం, కార్యదర్శి సక్కుబాయి, పట్టణ అధ్యక్షురాలు శ్రీలత, జక్కుల రేణుక, వడ్లకొండ తార, భాగ్యలక్ష్మి , ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం

మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు చేసిన పదవులు పొందిన మహిళ నాయకురాలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ శాలువాలతో సత్కరించారు. పార్టీని ముందుకు తీసుకోవడంతో మహిళా కాంగ్రెస్ నాయకులు కష్టపడుతున్నారని కొనియాడారు. డైరెక్టర్ నామాల శ్రీను, భన్సీనాయక్ పాల్గొన్నారు.

# ‘ఎంఎల్‌సి’ నామినేషన్ల ప్రక్రియ పూర్తి




### జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి : ఈ నెల 27న జరుగనున్న ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశమందిరంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల నిర్వహణకు విధులు కేటాయించిన పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు, రూటు, సెక్టార్, నోడల్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడారు.ఈ నెల 27న నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై సమగ్రమైనఅవగాహనకలిగి ఉండాలని తెలిపారు. నేటితో నామినేషన్లు ప్రక్రియ పూర్తి అవుతుందని, 11న నమినేషన్లు పరిశీలన, 13న నామినేషన్లు ఉపసంహరణ ఉంటుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాభితా 13వ తేది సాయంత్రం ఫైనల్ అవుతుందని తెలిపారు. భూపాలపల్లి నియోజక వర్గ వ్యాప్తంగా 329 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నట్లు తెలిపారు.నియోజక వర్గ వ్యాప్తంగా 7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ సక్రమంగా నిర్వహించుటలో పిఓలు, ఏపిఓలు, ఓపిఓల విధులు చాలా కీలకమని తెలిపారు. ఎన్నికలకు 13 మంది పీఓలు, 12మంది ఏపిఓలు, 24 మంది ఒపిఓ లను నియమించామని తెలిపారు. విధులపై పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు ఎన్నికల సంఘం విడుదల చేసిన హ్యాండ్ బుక్ ప్రకారం సమగ్రమైన అవగహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియ బ్యాలెట్ పేపరు ద్వారా జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ పేపరును ఓటరుకు ఇచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి ఇవ్వాలని, ఓటర్లు ఓటు హక్కులో పిఓ ఇచ్చిన వాయిలెట్ కలర్ స్కెచ్ పెన్ ద్వారా ఓటు వేసే వ్యక్తి పేరు పక్కన క్రమ సంఖ్య లో మాత్రమే నంబర్లు వ్రాయాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ జాగ్రత్తగా మడిచి డబ్బాలో వేయించాలని, ప్రతి బ్యాలెట్ పేపర్ పై పోలింగ్ ఆఫీసర్ సంతకం చేయాలని స్పష్టం చేశారు. ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సాధారణ ఎన్నికల మాదిరి మాక్ పోలింగ్ ఉండదని, కాబట్టి పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్ ఓపెన్ చేసి చూపించాలని, దాన్ని విడియో చిత్రీకరణ చేయాలని తర్వాత ఆ బాక్సును సీల్ వేసి క్లోజ్ చేసిన తర్వాత పోలింగ్ ప్రారంభించాలని తెలిపారు. ఈ నెల 23 వరకు కలెక్టర్ కార్యాలయంలోని జి5 రూమ్ లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, శిక్షణా నోడల్ అధికారి సీపీఓ బాబు రావు, ఆర్డీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతి, ఆచారాలు ఆదర్శప్రాయం


### ఆకట్టుకున్న ఎస్‌పిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వార్షికోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/హసన్‌పర్తి: మండలంలోని ఎల్లాపూర్ శివారులోని ఎస్‌పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు సగూటిన్ 2025 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడులకు ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీగేయ రచయిత, పేరటి పాటల పెన్నిధి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, వందేమాతం ఫౌండర్ అధ్యక్షుడు రవీందర్‌రావు హాజరయ్యారు. ముందుగా రమేశ్ గురూజీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలకు పూజచేసి ప్రేమానురాగాలు చాటుకున్నారు. ఈ సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావు, రమేశ్ గురూజీ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో భారతీయ సంస్కృతి, ఆచారాలను అలవర్చుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. శంకర్ కళా బృందం తల్లిదండ్రుల గొప్పతనాన్ని పాటల్లో వారి మధుర స్వరంతో అలరించారు. పముఖ సినీగేయ రచయిత, పేరటి పాటల పెన్నిది జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. పూర్వం రాజులు గురువులను నమ్మి గురుకులాల్లో వారి పిల్లలకు విద్యను నేర్పించే వారని, అలాగే తల్లిదండ్రులు ఈ పాఠశాలను నమ్మి వారి పిల్లలను ఇక్కడ విద్యా బద్ధులు నేర్పించడం నాకు నచ్చిందన్నారు. ఇక్కడ మానవీయ విలువలను, నైతిక విలువలను పెంపొందించే విధంగా పాఠశాల కార్యక్రమాలు ఉన్నాయని, విద్యార్థులకు పరోపకార గుణాన్ని నేర్పించడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. పాఠశాల ఛైర్మన్ శ్రీపతిరెడ్డి, డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోమన్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, పిల్లల మార్కులను చూడకుండా భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఎదిగేలా ప్రోత్సహించాలని, ప్రతీ విద్యార్థిలో ఉన్న నిగూడమైన నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులు ఇష్టపడి చదవాలని, దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే శక్తి యువకులైన విద్యార్థులకు సాధ్యమన్నారు. విలువలతో కూడిన సంస్కారాన్ని నేర్పడమే తమ ఎస్‌పీఆర్ పాఠశాల నిలువెత్తు నిదర్శనమన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, ఆహ్వానితులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమ్మక్క - సారలమ్మ మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తి

### సిఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ గిరిధర్‌రెడ్డి



ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మచ్చర్ల దామరవంచ వట్టివాగు శ్రీశ్రీశ్రీ సమ్మక్క సారలమ్మ మినీ జాతరకు ఏర్పాట్లు సోమవారం గూడూరు సిఐ సూర్యప్రకాశ్ ఎస్సై గిరిధర్ రెడ్డి జాతర ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.పార్కింగ్ స్థలాలు ఒక వైపు భక్తులు ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటి సూచించారు. 365 జాతీయ రహదారికి వాహనాలకు ఎ లాంటి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడుపోలీస్ పర్యవేక్షణ ఉంటుందని సిఐ సూర్మప్రకాశ్ తెలిపారు.జాతరలో కోంత మంది వ్యక్తులు అపరిచితుడు వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆలయ కమిటి వారు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నుండి కాకుండా ఇతర జీల్లా నుండి మండలాల చెందిన భక్తులుమీనీ జాతరకు హాజరుకానున్నారు. మీని జాతరలో భాగంగా ఈ 12 న గ్రామ దేవతలకు పోలి నిర్వహించనున్నారు. ఈ నేల 13 న మండ మెలిగే పండుగా,14 న మొక్కులు చెల్లించుట,15న జాతర ముగింపు జాతర ఆలయ కమిటి అధ్యక్షుడు పెనుక నాగయ్య పూజారి దారం సిద్దు తదితరులు పాల్గోన్నారు.

# యువతరంగం

## ఫోకస్

## ప్రీతి బెనివాల్

ప్రమాదంలో తన రెండు కాళ్లు కోల్పోయినా... అదే కారణంగా భర్త వదిలేసినా... ఆమె తన దృఢ సంకల్పాన్ని వదిలిపెట్టలేదు. పట్టుదలతో ప్రయత్నించింది. సివిల్స్‌కు ఎంపికైంది. ఆ అసాధారణ సాహసిపేరే ప్రీతి బెనివాల్. ఆమె సక్సెస్ స్టోరీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమే. హర్యానాలోని కర్నాల్ జిల్లా దూపేడి గ్రామానికి చెందిన సురేష్ కుమార్ , బబిత దంపతుల కుమార్తె ప్రీతి. సురేష్ ప్రభుత్వ ఉద్యోగి.. తల్లి అంగన్ వాడీ టీచరు. ప్రీతి 2013లో ఎంటెక్ పూర్తి చేసి.. స్థానిక గ్రామీణ బ్యాంక్‌లో క్లరికల్ ఉద్యోగంలో చేరింది. మూడేళ్లపాటు బహాదూర్‌గఢ్‌లో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించింది. 2016లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ)లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉద్యోగం సాధించింది. దీంతో అదే ఏడాది ఫిబ్రవరిలో తల్లిదండ్రులు ప్రీతికి మట్లౌడా బ్లాక్‌లోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి చేశారు. అదే ఏడాది డిసెంబర్‌లో ఎఫ్‌సిఐ డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కోసం నిర్వహిస్తున్న ఎగ్జామ్స్ కోసం గజియాబాద్‌కు వెళ్తూ రైలు ఎక్కే సమయంలో ప్రీతి కాలు జారీ కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రీతి బతుకుతుందని ఎవరూ అనుకోలేదు. ఆమెను బతికించడానికి వైద్యులు బైపాస్ సర్జరీ సహా మొత్తం 14 ఆపరేషన్లు చేశారు. కాళ్లు చచ్చుబడిపోవడంతో ప్రీతి మంచానికే పరిమితమైంది. దీంతో నడవలేని భార్య అనవసరమని భర్త భావించాడు. కోడలు తమకు భామరని అత్తమామలు వదిలేశారు. ప్రీతి సుమారు ఏడాది పాటు మంచం పైనే ఉంది. నడవలేని తనపై అందరూ జాలి చూపిస్తుంటే తట్టుకోలేకపోయేది. భర్త వదిలేయడం ఆమెను మరింత బాధపెట్టింది. అయితే, తల్లిదండ్రులు అక్కున చేర్చుకోవడంతో ప్రీతికి కొంత ఊరట లభించింది. జీవితం ఇంతటితో ఆగిపోలేదని.. చదువుపై దృష్టిసారిస్తే బాధలన్నీ మర్చిపోవొచ్చని వారు ధైర్యం చెప్పడంతో, ఆమె సివిల్స్‌ను లక్ష్యంగా చేసుకుంది. మొదటిసారి యుపిఎస్‌సి రాసినప్పుడు ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేకపోయింది. కానీ, ఎక్కడా కుంగిపోకుండా మళ్లీ రెండో సారి ప్రయత్నించింది. ఈ సారి మెయిన్స్‌లో ఫెయిలైంది. వరుస వైఫల్యాలు ఎదురైనప్పటికీ, రెట్టించిన పట్టుదలతో చదివిన ప్రీతి మూడో ప్రయత్నంలో సివిల్స్ క్లియర్ చేసింది. 2020 సివిల్స్ పరీక్షల్లో 737 మార్కులు సాధించడంతో 754 ర్యాంకు వచ్చింది. సమస్యలకు వెరవకుండా లక్ష్యాన్ని సాధించిన ప్రీతి ఎంతో మందికి స్ఫూర్తిప్రదాత.




### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..




# నేల విడిచి సాము

ప్రగతి, సామాన్యుల సంక్షేమం, రైతుల అభ్యున్నతి వంటి అంశాల్లో ఊకదంపుడు మాటలు... కోటలుదాటే నినాదాలే తప్ప కేంద్రంలోని మోదీ సర్కారు వాస్తవంగా చేస్తున్నది ఏమీ లేదన్న ప్రతిపక్ష పార్టీల వాదనకు తాజా బడ్జెట్ ఓ ఉదాహరణ. ప్రత్యేకించి, దేశానికి వెన్నెముకగా నిలిచి, భవిష్యత్ తరాలకు పునాదులు వేసే విద్యా వ్యవస్థపై కేంద్రం చిన్న చూపు కొనసాగుతునే ఉంది. దేశ వ్యాప్తంగా వచ్చే ఐదేళ్ల కాలంలో 75,000 మెడికల్ సీట్లను జోడించనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం నేల విడిచి సాము చేస్తున్న వైనంగానే భావించాలి. నిజానికి ఇలాంటి ప్రకటనను ఆహ్వానించాలి. కానీ, వాస్తవ పరిస్థితులను గమనించకుండా, పట్టించుకోకుండా, విశ్లేషించకుండా ప్రకటన చేయడం అనుమానాలకు తావిస్తున్నది. చాలా వర్సిటీల్లో ఫాకల్టీ సరిగ్గా లేదు. వైద్య విద్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి. గత పదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం దాదాపు 1.1 లక్షల అండర్ గ్రాడ్యుయేట్ (యుజి), పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పిజి) సీట్లు పెంచిందని నిర్మల ఘనంగా ప్రకటించారు. సీట్ల పెరుగుదలను 130 శాతంగా పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల్లో 10,000 అదనపు సీట్లు జోడిస్తున్నట్టు తెలిపారు. దేశం నుంచి ఏటా సుమారు 25,000 మంది వైద్య విద్య కోసం విదేశాలకు వెళుతున్నారని, అందుకే, దేశంలోనే మెడికల్ సీట్లను పెంచుతున్నామని అన్నారు. ఇంత వరకూ బాగానే ఉంది. కానీ, ఇందుకు అనుగుణంగా పెరగాల్సిన మౌలిక సదుపాయాల గురించి ఆమె ప్రస్తావించనే లేదు. ఉపాధ్యాయుల కొరతపై దృష్టి అసలే లేదు. జాతీ య వైద్య కమిషన్ (ఎన్‌ఎంసి) ఇటీవల విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ఫ్యాకల్టీ నియామకాల నిబంధనలను సడలించినట్టు ప్రకటించినప్పటికీ, నాన్ టీచింగ్ కన్సల్టెంట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం నాలుగేళ్లు పని చేసిన అనుభవం ఉన్నవారు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆరేళ్లుగా మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డిప్లమా హోల్డర్లు అసిస్టెంట ప్రొఫెసర్లుగా ఉండడానికి అర్హులు. టీచర్స్ ఎలిజబిలిటి కొత్త మార్గదర్శకాలు చెప్తున్నాయి. అంటే, ఎంత మంది అర్హత పొందుతారనే విషయంపై స్పష్టత లేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే మెడికల్ సీట్లను పెంచితే, బోధనా సిబ్బంది కొరతను ఎలా అధిగమిస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. విద్యార్థులు విదేశాలకు వెళ్లకుండా నిలువరించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నప్పుడు, అదే స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఎన్‌ఎంసి గుర్తించిన ఎండి, ఎంఎస్ అర్హతలు ఉంటేనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించుకోవచ్చు. పదివేల సీట్లను పెంచినప్పుడు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఎంత మంది అవసరమవుతారు? అనే ఆలోచన తప్పక చేయాలి. కానీ, అది జరగలేదు. టీచింగ్ స్టాఫ్ అర్హత సడలింపు వల్ల విద్యా ప్రమాణాలు తగ్గుతాయన్నది నిజం. అంతేగాక, వైద్యులకు థీసిస్‌ను రూపొందించడానికి సమర్థమైన మార్గనిర్దేశనం ఉండ దు. నియామకాల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే, వైద్య విద్య పరిస్థితి ఎంతగా దిగజారుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మెడికల్ సీట్లు పెంచడం హర్షణీయమే... అదే సమయంలో మౌలిక వసతుల నుంచి టీచింగ్ స్టాఫ్ వరకు అన్ని అంశాల్లోనూ నిశిత దృష్టి సారించి, లోపాలు లేని విధానాన్ని అమలు చేయాలి. అప్పుడే పెంచి న సీట్లకు సార్థకత. నాణ్యతా ప్రమాణాలు లేని విద్యను ఎవరూ ఇష్టపడరు. అసమర్థులైన వైద్యులను తయారు చేయ డం ద్వారా దేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూరుస్తుందో మోదీ ప్రభుత్వమే చెప్పాలి.

# ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సీనియర్ సిటిజన్స్‌గా మారక ముందు ఎలా వున్నా, కనీసం ఆ పరిధిలోకి అడుగుపెట్టిన తర్వాతైనా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం అత్యవసరం. 2050 నాటికి ప్రపంచంలోని వృద్ధుల్లో 80 శాతం మంది పేద, తక్కువ ఆదాయ దేశాల్లోనే ఉంటారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) అంచనా వేసింది. జనాభాలో వృద్ధుల సంఖ్య గతంతో పోలిస్తే వేగంగా పెరుగుతున్నది. 2020 గణాంకాలను పరిశీలిస్తే, 5 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న పిల్లల కంటే 60 ఏళ్లు పైబడిన వారే అధికం. డబ్ల్యుహెచ్‌ఒ నివేదికను అనుసరించి, ఆధునిక వైద్య సదుపాయాలు పెరుగుతున్న కారణంగా, సగటు ఆయుర్దాయం పెరిగింది. ఫలితంగా, 2015తో పోలిస్తే, 2050 నాటికి 60 ఏళ్లలోపు ప్రపంచ జనాభా నిష్పత్తి దాదాపు 12 శాతం నుండి 22 శాతానికి, అంటే దాదాపు రెట్టింపు అవుతుంది. 2030 ప్రపంచంలోని ప్రతి 6 మందిలో ఒకరు 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఉంటారు. ఈ సమయంలో 60 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల జనాభా వాటా 1 బిలియన్ నుండి 1.4 బిలియన్లకు పెరుగుతుంది. 2050 నాటికి, 2.1 బిలియన్లకు చేరుతుంది. 2020 మరియు 2050 మధ్య 80 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల వ్యక్తుల సంఖ్య మూడు రెట్లు పెరిగి 426 మిలియన్లకు చేరుతుంది. అధికఆదాయ దేశాలలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. ఉదాహరణకు, జపాన్‌లోని జనాభాలో 30 శాతం మంది వయసు ఇప్పటికే 60 ఏళ్లు దాటాయి. ఈ పరిస్థితుల్లో వృద్ధులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని, ప్రత్యేకించి మెరుగైన వైద్యం అందించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. 'జనాభా వృద్ధాప్యం'గా పేర్కొనే ఎక్కువ మంది సీనియర్ సిటిజెన్స్ ఉన్న దేశంగా భారత్ కూడా పరివర్తనం చెందుతున్నది. వృద్ధాప్యం కేవలం శారీరకంగానేగాక, మానసికంగానూ మనిషిని కుంగదీస్తుంది. ఈ మార్పులు సరళంగా లేదా స్థిరంగా ఉండవు. వృద్ధాప్యంలో కనిపించే వైవిధ్యం యాదృచ్ఛికమైనది కాదు. జీవసంబంధమైన మార్పులకు అతీతంగా, వృద్ధాప్యం తరచుగా పదవీ విరమణ, మరింత సముచితమైన గృహాలకు మార్చడం, స్నేహితులు, భాగస్వాముల మరణం వంటి ఇతర జీవిత పరివర్తనలతో ముడిపడి ఉంటుంది. ఆరోగ్యం విషయానికి వస్తే, వృద్ధాప్యంలో సాధారణ పరిస్థితులలో వినికిడి లోపం, కంటిశుక్లం, వక్రీభవన లోపాలు, వెన్నునొప్పి, మెడనొప్పి, ఆస్టియో ఆర్థరైటిస్, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, డయాబెటిస్, డిప్రెషన్, డిమెన్షియా వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే, ఒకే సమయంలో అనేక పరిస్థితులను అనుభవించే అవకాశం ఉంది. తరచుగా బహుళ అంతర్లీన కారకాల పర్యవసానంగా ఈ సమస్యలు ఉంటాయి. ఫలితంగాబలహీనత, మూత్ర ఆపుకొనలేకపోవడం, మతిమరుపు, చర్మ సంబంధమైన వ్యాధులు వేధిస్తాయి. విద్య, వృత్తి లేదా ఇతరత్రా కారణాలతో దీర్ఘకాలం ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసినందుకు వృద్ధాప్యంలో ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది. కనీసం ఇప్పటికైనా స్పందించి, మేలుకోకపోతే, వివిధ రకాల వ్యాధులు సీనియర్ సిటిజన్లను ప్రత్యక్షంగా, వారి కుటుంబ సభ్యులను పరోక్షంగా వేధించడం ఖాయం.





తమకు లభించిన ఈ అదనపు సంవత్సరాల జీవితాన్ని మంచి ఆరోగ్యంతో అనుభవించగలిగితే, వారిని మించిన అదృష్టవంతులు ఉండరు. వృద్ధుల ఆరోగ్యంలో కొన్ని వైవిధ్యాలు జన్యుపరమైనవి అయినప్పటికీ, చాలా వరకు వ్యక్తుల భౌతిక, సామాజిక వాతావరణాల వల్ల ఏర్పడినవే. వారివారి గృహాలు, పరిసరాలు, సంఘాలతో పాటు వారి వ్యక్తిగత లక్షణాలు కూడా ప్రభావితం చేస్తాయి. లింగం, జాతి లేదా సామాజిక ఆర్థిక స్థితి వంటివి. ప్రజలు పిల్లలుగా జీవించే వాతావరణాలు తదితరాలు కూడా వృద్ధాప్యంలో ప్రభావం చూపుతాయి. వృద్ధాప్య సమస్యలను పూర్తిగా అధిగమించలేకపోయినప్పటికీ, జీవితాంతం ఆరోగ్యకరమైన ప్రవర్తనలను నిర్వహించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, సాధారణ శారీరక శ్రమలో పాల్గొనడం, పొగాకు వాడకానికి దూరంగా ఉండటం వంటి చర్యలు కొంత ఊరట నిస్తాయి. అదే విధంగా, అన్నీ అంటువ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి, శారీరక, మానసిక సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, సంరక్షణ ఆధారపడటాన్ని ఆలస్యం చేయడానికిఇ ఇలాంటి మార్పులు దోహదం చేస్తాయి. మెడికల్ షాపులు, ఆసుపత్రులు అందుబాటులో ఉండే ప్రాంతాలను నివాసానికి ఎంచుకోవడం మంచిది. నడక, స్వల్ప వ్యాయామం చేయడానికి అనువైన ప్రాంతాలను సృష్టించుకోవాలి. వృద్ధాప్యానికి సంబంధించిన నష్టాలను తగ్గించే వ్యక్తిగత, పర్యావరణ విధానాలను పరిగణనలోకి తీసుకోవడం మాత్రమే కాకుండా, పునరుద్ధరణ, అనుసరణ, మానసిక సామాజిక వృద్ధిని బలోపేతం చేసే వాటిని పరిగణనలోకి తీసుకోవడం కూడా చాలా ముఖ్యం.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలి

పార్టీ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా పిలుపు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయడానికి సిద్ధంగా ఉండాలని సిపిఐ రాష్ట్రం కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలం ఎంవిపాలెం గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు మాధవ రావు నివాసం లో మండల సమితి సమావేశాన్ని ఏదులాపురం సొసైటీ డైరెక్టర్ పాసంగుల చంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మౌలానా మాట్లాడారు. మండల పరిషత్ ఏర్పడిన నాటి నుంచి అధ్యక్ష పదవిని సిపిఐ ఎక్కువ సార్లు కైవసం చేసుకుందని తెలిపారు. ఈసారి కూడా మిత్రపక్షాల సహకారంతో ఎర్రజెండా ఎగురవేసేందుకు శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు అన్ని గ్రామాల్లో శాఖ సమావేశాలు నిర్వహించుకొని, పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఖమ్మంలో జరుగనున్నాయని, వీటికి 46దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీర రామ్మూర్తి నాయక్, సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, యడ్లపల్లి శంకరయ్య, ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏలూరి భాస్కర్, బానోత్ రామ్మూర్తి, మామిడి శంకరయ్య, వెంపటి సురేందర్, దండి రంగారావు, వెన్నం భాస్కర్, రామిడి రమేష్, కలింగ మోహన్ రావు, వెంకటేశ్వర్లు, వెంపటి రాము, బండి ఉపేందర్, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఉసికల రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పోరాటాలు



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** నిరంతరం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసే పార్టీ సిపిఐ మాత్రమేనని పార్టీరాష్ట్ర నాయకులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. అబ్దులాపూర్‌మెట్ మండల పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం కూంట్లూర్ రావినారాయణరెడ్డి నగర్ ఆర్కే నగర్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షనా నిలబడి పోరాటం చేస్తున్నా పార్టీని బలోపేతం చేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు. ప్రజలను చెతన్యం చేస్తూ ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఆర్కే నగర్‌లో ఉన్నా స్థానిక సమస్యలపై పోరాటంతోపాటు రానున్నా పురపాలక సంఘం ఎన్నికలలో సిపిఐ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్కే నగర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు కార్యదర్శిగా బైరగోని రాజుగౌడ్, కార్యవర్గ సభ్యులుగా నరసింహ్మా, ఉప్పలయ్య, గోపి, మల్లేష్, కనకయ్య, శ్రీలత, గంగా, రామచంద్ర చారి ఎన్నికయ్యారు.

# కార్మిక వ్యతిరేక బడ్జెట్

కార్పొరేట్‌కు కేంద్రం పెద్దపీట

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు




**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని రైతులు, కార్మికులు పేద, మధ్యతరగతి ప్రజలను పూర్తిగా విస్మరించారని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ఆరోపించారు. గతంతో పోలిస్తే కార్మిక వర్గానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిందని సంక్షేమానికి కేటాయింపులు ఉన్న ఖర్చు చేసే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఎఐటియుసి ఖమ్మం జిల్లా సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై నర్సింహారావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా రూ.56వేల కోట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.20,436 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గతంతో పోలిస్తే కేటాయింపుల్లో ఏడువేల కోట్ల రూపాయలు తగ్గాయన్నారు. బడ్జెట్‌కు ముందు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు బడ్జెట్‌లో ప్రతిఫలించలేదన్నారు. వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిలుపుదల చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఎఐటియుసి డిమాండ్ చేస్తుందన్నారు. సంక్షేమానికి నిధులు తగ్గించి సంపన్న వర్గాలకు, పెట్టుబడిదారులకు రాయితీలు ప్రకటించి సంపన్న వర్గాల పక్షపాతిగా మోదీ సర్కార్ మరోసారి నిరూపించుకుందన్నారు. మారిన పరిస్థితుల్లో ధరల పెరుగుదల, పెరిగిన జీవన వ్యయం నేపథ్యంలో ధరల నియంత్రణపై ప్రభుత్వం పట్టుకోల్పోయిందని, ప్రైవేటు సంస్థలు కొనుగోళ్లు, అమ్మకాలను శాసిస్తున్నాయన్నారు. పోరాటాలతోనే హక్కులు, సంక్షేమం అమలవుతుందని ఆయన తెలిపారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు జాకీరుద్దీన్, రాంబాబు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తునికాకు టెండర్ల జాప్యంపై ప్రభుత్వం స్పందించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు, గిరిజనేతరులకు రెండో పంటైన తునికాకు సేకరణపై జరుగుతున్న జాప్యంపై ప్రభుత్వం స్పందించి తక్షణమే టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో అయన మాట్లాడుతూ తునికాకు సేకరణ ద్వారా ప్రభుత్వానికి ఆదాయానిస్తున్న తునికాకు సేకరణకు టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. మోడెం పనులు జాప్యం జరిగితే ఆకు నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. అష్టకష్టాలు పడి ఆకు సేకరిస్తున్న కార్మికులకు గిట్టుబాటు ధర చెల్లించాల్సిన అవసరం ప్రభుత్వం ఉందని, యాభై ఆకుల కట్టకు రూ.మూడు రూపాయలు చెల్లించాలని, బకాయి బోనస్ తక్షణమే పూర్తి స్థాయిలో విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తునికాకు సేకరణ జాప్యంపై సంబంధిత శాఖ మంత్రికి లేఖ పంపినట్లు అయన తెలిపారు. జిల్లాలో తునికాకు సేకరణకు తక్షణమే టెండర్లు ఆహ్వానించి మోడెమ్ పనులు చేపట్టాలని తద్వారా ఏజెన్సీ గిరిజనులకు, గిరిజనేతర పేదలకు వేసవి పంట ద్వారా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సిపిఐ, ఎఐకెఎస్, బికెఎంయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/డిండి :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. డిండి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 28న ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికసంఘాలు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని రాష్ట్రాల భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులు విధిగా కార్పస్ ఫండ్ వసూలు చేసేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులను బలోపేతం చేయాలని, సంక్షేమ బోర్డుల ద్వారా నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ చర్యలు చేపట్టాలని, సంక్షేమ బోర్డుల్లో ఎఐటియుసితో పాటు, కేంద్ర కార్మికుల సంఘ ప్రతినిధులను నియమించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రతి నెల పెన్షన్, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, పండుగ అలవెన్సులు చెల్లించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 10లక్షలు, అంగవైకల్యం చెందిన కార్మికులకు రూ. 5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎలిమినేటి దేవయ్య, లింగమయ్య, సత్తయ్య, ఆంజనేయులు, మల్లేష్, వెంకటయ్య, శ్రీను, కుర్మయ్య, బలరాం, వెంకటయ్య, ఇద్దాస్ తదితరులు పాల్గొన్నారు.




# టివివిపి కార్మికులకు వేతనాలు చెల్లించండి



ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధి(టివివిపి)లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ మధుకర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భోగె ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని కాగజ్‌నగర్, సిర్పూర్(టి), బెజ్జూర్, తిర్యాణి, వాంకిడి జిల్లా ఆసుపత్రి ఆసిఫాబాద్‌లో పని చేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి కార్మికుల జీతాలపై ప్రభుత్వం సంవత్సరానికి ఒకసారి మాదిరిగా జీతాలు చెల్లిస్తోందని, గత 7 నెలల క్రిత ఒకసారి సమ్మె నోటీసు ఇస్తే కొన్ని జీతాలు ఇచ్చిన ప్రభుత్వం మళ్లీ గత ఏడునెలలుగా కార్మికుల బిల్లులు చెల్లింకుండా జీతాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టివివిపి కార్మికులకు ప్రభుత్వమే నేరుగా జీతాలు అందే విధంగా ఏర్పాట్లు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమం లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, కార్మికులు రజిత, పుష్ప, పద్మ,సాయి, నరేష్, తిరుమల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.




**నేలకొండపల్లి :** తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ, స్వీపర్, సూపర్వైజర్ల మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతినెల 1వ తేదీ నాడు ఉద్యోగుల జీతాలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి మొదలు మంత్రులందరూ అనునిత్యం చెబుతున్నారని కానీ కింది స్థాయిలో పనిచేస్తున్న టివివిపి కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం వేతనాలు నెలలు తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారన్నారు. వాస్తవానికి వీరి జీతం చాలా తక్కువ, అయినప్పటికిని ప్రభుత్వం వీరిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ఉద్యోగులు మాదిరిగానే రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా గ్రీన్ ఛానల్ ను ఏర్పాటు చేసి ఒకటవ తేదీనే జీతాలు ఇచ్చేలా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. టివివిపి ఉద్యోగులకు సంబంధించి గత ఏడు నెలలుగా బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్లు అంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎఐటియుసి అధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు మాధవి, వెంకన్న, కాంట్రాక్ట్ ఉద్యోగులు సైదా, కమలమ్మ, సుజాత, అనిత, వీరకూమరి పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ఉమ్మడి లక్ష్మీ దేవిపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచాలని, జీవో నెంబర్ 51 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం నాయకులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి లక్ష్మీ దేవిపల్లి గ్రామపంచాయతీ నుండి విడిపోయిన శ్రీనగర్ కాలనీ, సంజయ్‌నగర్, ప్రశాంత్‌నగర్, లోతువాగు, లక్ష్మీ దేవిపల్లి, అశోక్‌నగర్ కాలనీ గ్రామపంచాయతీ వర్కర్స్ సిబ్బంది గత 20 సంవత్సరాల నుండి గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి గత పాలకవర్గం తీర్మానాల మేరకు కేటగిరీల వారీగా రూ.12వేలు నుండి రూ.17వేలు వరకు ప్రతినెలావేతనంగా పొందుతున్నారని పాలకవర్గం ముగిసిన తర్వాత కొన్ని చిన్న పంచాయతీలు ఆర్థికంగా వెనుకబాటు వలన కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఒక్కొక్కరికి సుమారు 10 నెలలు, 5 నెలలుగా వేతన బకాయిలు ఉన్నందున ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నేరుగా కనీస వేతనంగాజిఒ నెంబర్51 ప్రకారం ఒక్కొక్క కార్మికుడికి రూ.9500లు చొప్పున వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. 51 జిఒ ని రద్దు చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలు పెంచాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లగడపాటి రమేష్, ధనుంజయ్, జర్పుల మురళి, బిఆర్ఎస్ ఆయకులు , సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## శుభకార్యాలలోఎంఎల్ఎ ఆదినారాయణ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో ఎంఎల్ఏ జారే ఆదినారాయణ పర్యటించారు. సోమవారం మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామం రామాలయంలో శంకుచక్రాల పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టగూడెం గ్రామంలో సున్నం రాజు కృష్ణవేణి దంపతుల కుమార్తె ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ములకలపల్లి మండల కేంద్రంలో బిక్షపతి మనవడి బారసాల వేడుకలో పాల్గొన్నారు. మూక మామిడి గ్రామంలో తమ్మిశెట్టి జానీబాబు మనవడి బారసాల వేడుకలో పాల్గొని చిన్నారులను దీవించారు. అనంతరం జగన్నాధపురం గ్రామంలో కొబ్బరిపాడు గ్రామానికి చెందిన కొండు అశోక్‌చే నూతనంగా నిర్వహించబోయే ఆర్యన్ హెయిర్ స్టైల్ షాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈకార్యక్రమంలో ములకలపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, మాజీ జెడ్‌పిటిసి, మండల నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 19వ డివిజన్ సిపిఐ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ 19వ డివిజన్ నతూన కమిటీని ఎన్నుకున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లోని 19వ డివిజన్ సిపిఐ శాఖ మహాసభ సోమవారం సిద్ధి శ్రీనివాసరావు, వల్లబోయిన రమణ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు సిపిఐ నగర సహాయ కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా కంపసాటి వెంకన్న, సహాయ కార్యదర్శిగా కాట్ల నర్సింహారావు, బెల్లంకొండ ప్రసాద్, 21 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అదేవిధంగా మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నారపోగు నాగమణి, అధ్యక్షులుగా గుండాల పద్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన కమిటీ కృషి చేయాలన్నారు. నిరంతరం డివిజన్లలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వన్ టౌన్ ఏరియా నాయకులు మాడుగుల నాగేశ్వరరావు,మాలకొండయ్య, మెంటెం రవి, శీలం నాగేశ్వరరావు, చీకటి బ్రహ్మం, ఉదయ్, కారం సామెలు, గాజుల గోపి, కృష్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## వినతులు త్వరగా పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్, ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ ఇంచార్జి కమిషనర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జి కమిషనర్ శ్రీజ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కార్పోరేషన్ కార్యాలయంలో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంగళవారం సాయంత్రం నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## సేవాలాల్ జయంతి పోస్టర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీ దేవిపల్లి మండలం ఎదురుగడ్డ నందు బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి పోస్టర్‌ను వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సోమవారం విడుదల చేశారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల17వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లా బంజారా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎదురుగడ్డ నందు జరగబోయే బోగ్ బండారో కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఈ కాఆర్యక్రమంలో బంజారా సంఘం నాయకులు దేవిలాల్, బానోతు రమేష్, బాలు, ఉపేందర్, బట్టు అరుణ్, నాగరాజు పాల్గొన్నారు.

## కేశవ్ మృతదేహానికి రీ పోస్టుమార్టం జరిపించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేశవ్ మృతదేహానికి రి పోస్ట్‌మార్టం జరిపి సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరుతూ ముదిగొండ మండలం ముత్తారం గ్రామానికి చెందిన బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 25న గొల్లముడి కేశవ్ ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడని ఈ మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన ఓ యువతితో కేశవ్‌కు పరిచ యం ఏర్పడి ఆ పరిచయం కాస్త ప్రేమగా మారిందని వారిద్దరు పెళ్లి చేసుకు ందామనుకున్నారని వారు తెలిపారు. క్రిస్మస్ పండుగ రోజున పెళ్లి చేసుకుంటున్నారని అమ్మాయి తల్లిదండ్రులకు తెలిసి పథకం ప్రకారం కేశవ్‌ను హ త్య చేయించి ఉంటారని వారు ఆరోపించారు. కేశవ్ మృతదేహానికి రి పో స్ట్‌మార్టం జరిపించి సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వా రు కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలోకేశవ్ సోదరి స్వప్న, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతంగా 'వెలుగుమట్ల'

* సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలి
* మార్చి 15 నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి
* కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కును ప్రజలకు ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి వెలుగు మట్ల అర్బన్ పార్కును సందర్శించారు. వెలుగు మట్ల అర్బన్ పార్కు దగ్గర మెయిన్ రోడ్డు నుంచి పార్కు వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు వద్ద వెలుగుమట్ల అర్బన్ పార్కు గురించి తెలిసేవిధంగా ఆర్చిని ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనులు రెండు వైపుల నుంచి జరగాలని మార్చి 15 నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పార్కు గురించి తెలిసేలా సమాచార బోర్డులను సమీకృత కలెక్టరేట్ బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేయాలని, అక్కడి నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వచ్చేందుకు వీలుగా వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. అర్బన్ పార్కుకు ప్రత్యేకంగా బస్ సర్వీస్‌ను నడిపేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి రిసార్ట్‌ను ట్రెడిషనల్ ప్లాంట్స్‌తో ఆకర్షణీయంగా తయారు చేశారని అదే రీతిలో వెలుగుమట్ల అర్బన్ పార్కును ఆకర్షణీయంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని, ఒకసారి ప్రగతి రిసార్ట్‌కు వెళ్లి పరిశీలించి రావాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్కులో వీలైనంత అధికంగా బెస్ట్ వ్యూస్ కనిపించేలా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు ఇక్కడ ఫోటోలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం వల్ల మన పార్కుకు మంచి గుర్తింపు రావాలన్నారు. పార్కులో సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని అవసరమైన సైకిల్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పార్కుకు ప్రజలు వచ్చి వన భోజనాలు చేసేవిధంగా ఏర్పాటు ఉండాలన్నారు. పార్కు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యూ పాయింట్ వద్ద చేపడుతున్న నిర్మాణాలు పరిశీలించి సూచనలు చేశారు. క్యాంటీన్ పూర్తి ప్లాస్టిక్ రహితంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దశల వారీగా అర్బన్ పార్కు పూర్తి స్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అటవీ బీట్ అధికారులకు యూనిఫాం, షూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఫారెస్ట్ రేంజ్ అధికారి జి. నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎఇ అనిత, అటవీ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దివ్యాంగుల అభ్యున్నతికి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు తమ సమస్యలు తెలుపుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మంజిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు ఆటో స్టాండ్ ఒకే సంఘానికి కాకుండా వివిధ సంఘాలకు లేదా టెండర్ రూపంలో ఇచ్చేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో బిజీ సెంటర్లలో స్త్రీ టీ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేద, దివ్యాంగ మహిళలకు కూడా టీ స్టాల్స్‌ను కేటాయిస్తామని వివరాలు అందించాలని సూచించారు. దివ్యాంగుల కుటుంబ పరిస్థితులను, స్థితి గతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే ఇందిరమ్మ ఇండ్లలో కూడా దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా విడతల వారీగా ప్రతి అర్హునికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. స్వయం ఉపాధి క్రింద యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి గల దివ్యాంగుల పేర్లు, దరఖాస్తులు అందించాలని మహిళలు ఎవరైనా ఉంటే మహిళా శక్తి క్రింద అందిస్తామని పురుషులకు ఇతర పథకాల క్రింద బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్ కంటే ముందు దివ్యాంగులు ఏర్పాటు చేసే వ్యాపారం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో మహిళా శక్తి క్రింద మహిళలకు వ్యాపారాలు చేయడం పట్ల శిక్షణ అందిస్తున్నామని ఆసక్తి గల దివ్యాంగులు ఉంటే వారికి కూడా లాభసాటిగా వ్యాపారం చేయడం, అవసరమైన అనుమతులు, పెట్టుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల కోసం ర్యాంపు ఏర్పాటు చేశామని వారి సహాయార్థం ప్రత్యేకంగా సిబ్బందిని సైతం నియమించడం జరిగిందన్నారు. నగరంలో వచ్చే మాల్స్, ఇతర నిర్మాణాలకు కూడా ర్యాంపులు ఉంటేనే అనుమతులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలు హరిస్తున్న మైనర్ల డ్రైవింగ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** వరుస ప్రమాదాలు ఖ మ్మంజిల్లాలో ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఒకదాని వెనక మరో ఘటన జరుగుతు ండటం అసలు ట్రాక్టర్లపై ప్రయాణించాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. బోనకల్‌లో ట్రాక్టర్ ప్ర మాదంలో ఒక మహిళ మరణించి 11 మంది గాయపడిన ఘటన మరువక ముందే కొణిజర్ల మండలంలో సాగర్ కాలువలో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి. దీనిపై చర్చ సాగుతుండగానే ఎర్రుపాలెం మండలంలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో సోమవారం డ్రైవర్ మృతిచెందాడు. వీటన్నింటి వెనక ఒక కారణం సరైన శిక్షణ లేకుండా వాహనాలను నడపడం ఇందుకు కారణమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో దుక్కులు దున్నేందుకు ఇతర వ్యవసాయ పనులు చేయడంతో పాటు కూలీల రవాణాకు ఎక్కువగా ట్రాక్టర్‌ను ఉపయోగిస్తారు. ముఖ్యంగా వరి నాట్లు, మిర్చి కోతల సమయాల్లో కూలీల తరలింపు ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్న వేళ ఈ ట్రాక్టర్ ప్రమాదాలు కూలీలను భయపెడుతున్నాయి. వేగంగా ట్రాక్టర్ నడపటం, వేగాన్ని అదుపు చేయలేక ఏదో ఒక ప్రమాదానికి గురికావడం తరచూ జరుగుతుంది. అన్నింటికి మించి గ్రామీణ ప్రా ంతాల్లో మైనర్ల డ్రైవింగ్ కూడా ఇబ్బందికరంగానే మారింది. బోనకల్ ఘటన లోనూ ఈ కోణం వెలుగు చూసింది. శి క్షణ పొంది లైసెన్స్‌లు లేని డ్రైవర్లు వాహనాలను నడుపుతుండటం వల్ల ఈ ప్ర మాదాలు జరుగుతు న్న నేపథ్యంలో వాహన తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రతి గ్రామంలోనూ ఆ ట్రాక్టర్‌కు సం బంధించిన వివరాలను సేకరించి తగు చ ర్యలు తీసుకోవాల్సి ఉం ది. ఇటువంటిదే ఆటో డ్రైవర్ల విషయంలోనూ పోలీసులు, అధికార య ంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. పట్టణ ప్రా ం తాల్లో కొంత మేరకు తనిఖీలు జరుగుతున్న గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలు లేకపోవడంతో ఈ ప్రమాదాలకు కారణమవుతుంది. ఆ వైపు దృష్టిసారించిప్రమాదాలనునివారించాలనికోరుతున్నా రు.

## ఉపాధ్యాయ ఎంఎల్‌సికి 23 నామినేషన్లు



**ప్రజాపక్షం/ఖమ్మం :** నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి నియోజక వర్గానికి సంబంధించి మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం చివరి రోజు కావడంతో నామినేషన్లు భారీగానే దాఖలు చేశారు. 23 మంది 50 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. 12 జిల్లాల పరిధిలోని 191 మండలాల్లో 25,797 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అత్యధికంగా హన్మకొండ జిల్లాలో 5215 మంది ఓటర్లు ఉండగా నల్లగొండ జిల్లాలో 4683 మంది, ఖమ్మంజిల్లాలో 4089 మంది ఓటర్లు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో నాలుగు మండలాలకు సంబంధించి 166 మంది, జనగాం జిల్లాలో 12 మండలాలకు సంబంధించి 1002 మంది, వరంగల్ జిల్లాలో 2352 మంది, మహబూబాబాద్ జిల్లాలో 1663 మంది ఓటర్లు ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏడు మండలాల పరిధిలో 329 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండ లాల పరిధిలో 2022 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలకు సంబంధించి 984 మంది, సూర్యాపేట జిల్లాలో 23 మండలాలకు సంబంధించి 2664 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 27న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరగనున్నాయి. పిఆర్‌టియు అభ్యర్థిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి పోటీ చేస్తుండగా ఆయనకు పలు సంఘాలు మద్దతునిచ్చాయి. టిఎస్ యుటిఎఫ్ అభ్యర్థి గా, ప్రస్తుత శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి పోటీ చేస్తుండగా మాజీ ఎంఎల్‌సి పూల రవీందర్‌ను ఎస్టియు బలపరుస్తుంది.

## ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డిఆర్‌వో ఎ. పద్మజ, డిఆర్‌డివో సన్యాసయ్య లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అనుమతులు లేకుండా గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లకు సమాచారం అందించి వారి అనుమతి లేకుండా జిల్లా అధికారులు హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులకు శాఖపరమైన సమావేశాలు హైదరాబాద్‌లో ఏమైనా ఉంటే ముందుగా జిల్లా యంత్రాంగం అనుమతి తీసుకోవాలని, ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఉదయం సమయానికి వచ్చి అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేని సమయంలో సీనియర్ అధికారి ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని ప్రజలతో మర్యాదగా, జవాబుదారితనంతో ప్రవర్తించాలన్నారు. ఖమ్మం నగరంలోని పాకబండ బజార్‌కు చెందిన జి. ఝాన్సీ తన కుమార్తె భవానికి శాశ్వత దృష్టిలోపం ఉందని 100 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ జారీ చేయాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరానికి చెందిన బి. వినయ్‌కుమార్ తనకు వికలాంగుల కోటాలో డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన డి. నర్సమ్మ తాను గత 50 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్నానని తనకు పట్టా పుస్తకం ఇప్పించాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

# పైన 'పటారం'..లోన 'లొటారం' మణుగూరు మున్సి(ర్కి)పాలిటీ!

* చెత్తా చెదారంతో దర్శనమిస్తున్న వీధులు..
* శ్రీ శ్రీ నగర్, సుందరయ్య నగర్‌లో అస్తవ్యస్తంగా డ్రైనేజీలు...
* మణుగూరు అభివృద్ధి, అపరిశుభ్రతపై ''ప్రజాపక్షం'' అందిస్తున్న ప్రత్యేక కథనం...





**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ కంపు కొడుతుంది. మున్సిపాలిటీ పరిధిలోని పలువు వీధులు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. శ్రీ శ్రీ నగర్, సుందరయ్య నగర్ లో డ్రైనేజీలో అస్తవ్యస్తంగా పట్టించుకునే నాధుడే కరువయ్యారు... పేరుకే మున్సిపాలిటీ కానీ కనీసం పంచాయితీ సేవలు కూడా ఇక్కడ ఇక్కడ కరువయ్యాయి.. మణుగూరు మున్సిపాలిటిగా ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా... అభివృద్ధి మాత్రం ఎక్కడ జరిగినట్లు మచ్చుకైన కనపడడం లేదు. పైన పటారం.. లోన లొటారం అనే సామేతలాగా మున్సిపాలిటి అభివృద్ధి కనబడుతుంది. పట్టణ ప్రధాన రహదారి మాత్రమే పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయి.. కానీ పలు కాలనీలు మాత్రం చెత్తకుప్పలతో, మురుగుడ్రైనేజీలతో దర్శనమిస్తున్నాయి. మణుగూరును మున్సిపాలిటిగా చేస్తే ఎంతగానో అభివృద్ధి చెందుతుందని అనుకుంటే.. అభివృద్ధి ఏమో కానీ చెత్తకుప్పలు, పందులు.. ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఎక్కడ చూసిన సమస్యల వలయాలు దర్శనమిస్తుండగా మున్సిపాలిటి అధికారులు సమస్యలను పరిష్కరించినట్లు దాఖలాలు లేవు. పట్టణ ప్రధాన రహదారి నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తారే కానీ... కాలనీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిద్దామని అధికారులు ఆలోచన లేకుండా పోయింది. ఇంటి పన్నులు సమయం వస్తే కట్టాల్సిందేనని ముక్కు పిండి వసూలు చేస్తారు... పన్నులు కట్టకుండా వస్తుసామాగ్రిని జప్తు చేస్తామని హెచ్చరికలు జారీ చేసే అధికారులు... సమస్యలను మాత్రం ఎందుకు పరిష్కరించడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కొన్ని కాలనీల్లో అయితే ఎక్కడ పడితే చెత్త కుప్పలు కుప్పలు తెప్పలుగా పేరుకు పోయి పందులు, దోమలు, ఈగలు వ్యాప్తి చెంది దుర్గంధం వెదజల్లుతున్నాయి. మున్సిపాలిటి అధికారులు, సిబ్బంది వీధులను ఎప్పుడూ వస్తారో అని ఆశగా ఎదురుచూడడమే తప్ప... మున్సిపాలిటి సిబ్బంది వచ్చి వీధులను శుభ్రం చేసిన పాపాన పోలేదు. చెత్తకుప్పలు.. రోజుల తరబడి నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతూ ప్రజల ఆరోగ్యాలను పాడుచేస్తున్నాయి. మరోపక్క డ్రైనేజీలలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పడడంతో మురుగునీరు పోయే అవకాశం లేక నిల్వ ఉండడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతున్న కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లిన పాపాన పోలేదు. ఈ డ్రైనేజీలో మురుగునీరు నిల్వ ఉండడంతో పందులు కూడా స్వైర విహారం చేస్తున్నాయి. ఈ కాలనీలలో నడవాలంటే ముక్కు మూసుకుని నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. మంచినీరు రాక కాలనీ వాసులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా.. అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో నీరు పైప్ లైన్లు పగిలిపోయి నీరు వృధాగా పోతున్నా.. అధికారులు స్పందించడం లేదని, నీళ్ళు ఎప్పుడు వస్తాయోనని ఆశగా ఎదురుచూస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే కాలనీలలో రహదారి వెంబడి ముళ్ళ పొదలు పెరిగి ప్రయాణానికి అసౌకర్యంగా ఉన్నాయని, కనీసం ముళ్ళ పొదలనైనా తొలగిస్తారని చూస్తే అవి కూడా తొలగించడం లేదు. ఈ ముళ్ళ పొదలు రోడ్లపైకి చొచ్చుకుని రావడం వల్ల ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలకు కారణమవుతున్నాయని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఎన్నో సమస్యలు అన్నీ కాలనీల్లో కొట్టుమిట్టాడుతున్నా.. సమస్యలపై ఫిర్యాదులు చేసిన మున్సిపల్ అధికారులు స్పందించడం లేదన్నారు. మణుగూరు మున్సిపాలిటికి ఏ కమీషనర్ వచ్చిన కొత్తలో మాత్రం పట్టణ ప్రధాన రహదారిపైనే పనులు నిర్వహిస్తారు.. కానీ కాలనీల్లో ఎందుకు పనులు నిర్వహించడం లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నా.. మున్సిపాలిటి అధికారులు నోరుమెదపకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వీధుల్లో లైట్లు ఉండవు.. మంచినీరు రావు.. డ్రైనేజీల్లో పారిశుద్ధ్యం ఉండదు.. ఇదేనా మణుగూరు మున్సిపాలిటి అభివృద్ధి అంటూ కాలనీవాసులు ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. మున్సిపాలిటి పరిధుల్లో జిల్లా పరిపాలన అధికారి, మంత్రి, ఎమ్మెల్యే పర్యటనలు ఉన్నాయంటే మాత్రం అప్పటికప్పుడు మున్సిపాలిటి అధికారులు ఆ కాలనీలను బొమ్మలాగా తయారు చేస్తారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా వచ్చినప్పుడే అభివృద్ధా... ? ఎవరు రానప్పుడు.. మా కాలనీలు కనబడవా.. అంటూ కాలనీ వాసులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించినా.. మాకేమి పట్టదంటూ అధికారులు నిశ్శబ్దంగా వ్యవహరిస్తారు. ఏది ఏమైనప్పటికీ... మణుగూరు మున్సిపాలిటి పరిధిలోని పలు కాలనీలను పారిశుద్ధ్య పనులు ఎప్పుడు నిర్వహిస్తారో... ప్రజలకు దుర్గంధం వాసనల నుండి ఎప్పుడు విముక్తి కలిగిస్తారో వేచి చూడాలి.

## పకడ్బందీగా ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శాసన మండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27వ తేదీన పోలింగ్ జరగనున్నందున జిల్లాలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులను ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన తీరును ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ మండలంలోని రాజ్ పల్లి, హవేలీ ఘన్ పూర్ మండలంలో మద్దుల వాయి గ్రామాల పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పై అభ్యంతరాలు తెలపాలని వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. సోమవారం మెదక్ మండలం రాజ్ పల్లి, హవేలీ ఘన్ పూర్ మండలం మద్దుల వాయి గ్రామాల పోలింగ్ స్టేషన్ల ఏర్పాటులో భాగంగా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల అభ్యంతరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మద్దుల వాయి రాజ్ పల్లి పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసుకోవడం జరిగిందని మద్దుల వాయి (08) పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, 8 వార్డులు ఉన్నాయని 189 పురుష ఓటర్లు ఉండగా, 231 మహిళా ఓటర్లు ఉన్నాయని వివరించారు. రాజ్ పల్లి లో (10) వార్డులకు గాను (10) పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయగా 959 పురుష ఓటర్లు, 1097 మహిళా ఓటర్లు ఉన్నాయని వివరించారు పొలిటికల్ పార్టీలు పోలింగ్ స్టేషన్ కు సంబంధించిన అభ్యంతరాలు తెలపాలని ఈ సమావేశం ద్వారా అడిషనల్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ యాదయ్య, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, మెదక్ ఆర్డీఓ రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువపత్రాలు లేని వాహనాలు స్వాధీనం



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్:** ధ్రువ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆసిఫాబాద్ సిఐ రవీందర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఎస్పి డివి శ్రీనివాసరావు, ఎఎస్పి చిత్త రంజన్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ రవీందర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ చేపడుతున్నామని, దీనిలో భాగంగానే ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీలోని ఇంటింటికి తనిఖీలు చేపట్టగా, సరైన ధ్రువ పత్రాలు లేని 82 ద్విచక్ర వాహనాలు,4 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో ఎస్‌ఐలు రాజేశ్వర్, ప్రశాంత్‌తో పాటు 60 మంది పోలీస్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

## డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టనివ్వం



**ప్రజాపక్షం/నర్సాపూర్:** ప్రాణాలు పోయినా సరే నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్ ను ఎట్టి పరిస్థితిలో నిర్మించనివ్వమని అఖిలపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. సోమవారం డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని అటవీ ప్రాంతంతో పాటు అనేక గ్రామాలు ఈ డంపింగ్ యార్డ్ వల్ల కలుషితమయ్యే అవకాశముందని అన్నారు. ఎట్టి పరిస్థితిలో డంపింగ్ యార్డ్ ను నిర్మించ నివ్వమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, మాజీ కౌన్సిలర్లు బుచ్చేష్ యాదవ్, గోద రాజేందర్, రమణ రావు, పంబల భిక్షపతి, సూరారం నర్సింలు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం...



**ప్రజాపక్షం/సారంగాపూర్:** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం అయినట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు.పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని గాయత్రి ఆదివారం ఉదయం 11 గంటలకు పాఠశాల నుంచి బయటకు వెళ్ళింది.ప్రిన్సిపల్ సంగీత రాణి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** విద్యుత్ షాక్ తో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ధాక్యాతండా గ్రామ పంచాయతీ పరిధి ధనూజ తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ పెద్ద కొడుకు అనిరుధ్ (5) ఆదివారం లక్ష్మణ్ బావమరిది నిశ్చితార్థం నిమిత్తం ఇదే మండలం ధనుజాతండాకు వెళ్లారు. అనిరుధ్ స్పీకర్ బాక్సుల ఆటో వద్ద ఉన్న ఓ వైర్ ను చూడకుండా దానిపై కాలు పెట్టడంతో విద్యుత్ షాక్ కు గురై కిందపడ్డాడు. వెంటనే అక్కడే ఉన్న కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ప్రతి రైతుకు బోనస్ వచ్చేలా చూస్తా

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రతి రైతుకు వరి ధాన్యం బోనస్ అందేలా చూస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో బిర్యానీ సెంటర్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు పలు సమస్యలను దృష్టికి తీసుకువెళ్లారు. పాపన్నపేట రైతులకు రెండు లారీల వరి ధాన్యాలకు సంబంధించిన బోనస్ రాలేదని వారి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన జాయింట్ కలెక్టర్ నగేష్ తో చరవాణిలో మాట్లాడి వెంటనే బోనస్ వచ్చేలా చూడాలని వారిని ఆదేశించారు. అరికెల గ్రామానికి చెందిన బాలమణికి 50,000 సీఎంఆర్ ఎఫ్ చెక్కును అందజేశారు. పాపన్నపేటలో హనుమాన్ ఆలయ పున ప్రతిష్ట ఈనెల 14, 15, 16వ తేదీలలో జరిగే కార్యక్రమానికి విచ్చేయాలని స్థానిక పాపన్నపేట నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు గోవింద్, మాజీ ఎంపిటిసి అకుల శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ గౌస్, నాయకులు సతీష్, శ్రీకాంత్ రెడ్డి, నాని, గణేష్, రమేష్ గౌడ్, భరత్ గౌడ్, కుమ్మరి విట్టల్, ముశెట్టి కిష్టయ్య, సత్య గౌడ్, ప్రవీణ్ గౌడ్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

**ప్రజాపక్షం/పటాన్ చెరు:** మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం ఐచ్చగూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లి ఖార్జున స్వామి కళ్యాణ మహోత్సవం జాతర ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రముఖులు ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం , కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ ఎంపీపీ శ్రీశైలం , యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి , వెంకటరెడ్డి, అంతిరెడ్డి, బిక్షపతి, రామదాదర్ ,అంగారెడ్డి, గ్రామ ప్రముఖులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఆలయ వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బోథ్:** బోథ్ మండలం కుచులాపూర్ గ్రామంలో గల శబరి మాత ఆలయ మొదటి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి వల్ల ఆధ్యాత్మిక వల్ల మనస్సు ఎంతో సంతోషాన్ని కలిగి ఉంటుందని అన్నారు. అనంతరం గ్రామస్థులు నిర్వహించిన శబరి మాత పల్లకి ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి భజన కీర్తనలు గావించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ ఎంపిపి తుల శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్:** పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కలెక్టర్ పర్యటించి, నిర్వహిస్తున్న పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 10 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డుల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేసిన తర్వాత ఆయా వార్డులోని ప్రజలతో సంబంధిత రిజిస్టర్ లో సంతకాన్ని తీసుకోవాలన్నారు. వార్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల సహకారం అవసరమన్నారు. తడి, పోడి చెత్తను వేరుగా సేకరించి చెత్త బండ్లలో వేయాలని, పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చునన్నారు. ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, పొదలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 9వ వార్డు సమీపంలో గల కుంటను కలెక్టర్ పరిశీలించి మురికి నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో కుంట చుట్టూ మొక్కలు నాటి, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కుంటలో మురికి నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందడం ద్వారా అనేక రకాల రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం మస్కాపూర్ కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. వన మహోత్సవంలో మొక్కలు నాటెందుకు సిద్ధంగా ఉంచాలన్నారు.నర్సరీ నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాలలో డీఈఓ పి.రామారావు,డిపిఓ శ్రీనివాస్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసిల్దార్ సుజాత, సిపిఓ జీవరత్నం, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు సునీత, విద్యార్థులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో, బోధన్ డివిజన్ ఆర్‌ఓలు, సహాయ ఆర్‌ఓలకు బోధన్ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం వేర్వేరుగా మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు తప్పిదాలకు తావు లేకుండా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమీషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్‌ఓలు నోటిఫికేషన్ జారీ చేసి ఆ రోజు నుండే సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేసన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నోటిఫికేషన్‌లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియను మార్గదర్శకాలకనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహాతో, ఆర్డీఓ రాజేంద్రకుమార్, పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి అశోక్, డీఎల్‌పీఓలు ఆర్‌ఓలు సహాయ ఆర్‌ఓలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలను జిల్లా అధికారుల పరిశీలన

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం ప్రభుత్వ కళాశాల నందు డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ డిఈసి సభ్యులు జాదవ్ పరశురాం సునీల్ కుమార్ జాదవ్ రవి కిరణ్ తనిఖీ నిర్వహించారు.కళాశాల యందు ఇంటర్ ఎంపీసీ,బైపిసి విద్యార్థులకు గత రెండు రోజుల నుండి 8 తేదీ నుండి 11 తేదీ వరకు ప్రాక్టికల్స్ జరుగుతున్నవి పరీక్షల తీరును పరిశీలించడం ప్రతి విద్యార్థి ప్రాక్టికల్ చేసి న తీరును కెమెరాలో నిక్షిప్తం అవుతున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అంతేకాకుండా ఇలాంటి మాస్ కాపీ తావివ్వకుండా కళాశాల సీఎస్,ప్రిన్సిపాల్ గౌతమ్ సుధాకర్‌రెడ్డి,నరసయ్యకు విద్యార్థులకు గాను సూచించారు.ఈ తనిఖీలో డి.ఈ.సి సభ్యులు పాల్గొన్నారు.



## క్రీడలతో ఆరోగ్యం... మానసిక ఉల్లాసం





ఎసిపి రవికుమార్

**ప్రజాపక్షం/కాసిపేట:** క్రీడలతో మానసిక ఉల్లాంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ అన్నారు. ఆదివారం ముత్యంపల్లి అంబేద్కర్ మైదానంలో జరిగిన కెఎంపిఎల్ సీజన్ 3 ఫైనల్స్‌లో గెలుపొందిన రాయల్ చాలెంజర్స్,సోల్జర్ బ్రేవ్ హటెడ్ జట్లు ఫైనల్లో తలపడ్డాయి. సోల్జర్ బ్రేవ్ హటెడ్ క్రీడాకారులు నిర్ణీత 12 ఓవర్లకు 84 పరుగులు చేసింది. లక్ష్య చేదనలో రాయల్ చాలెంజర్ క్రీడాకారులు వెనుకబడి 12 ఓవర్లకు 72 పరుగులు చేసి ఓటమి పాలయింది. విజేత జట్టుకు 50 వేల మని ప్రైజ్ ట్రోఫి, రన్నర్ జట్టుకు 30 వేలు ట్రోఫిని ఎసిపి రవికుమార్, అప్పుల శేఖర్లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎసిపి రవికుమార్ మాట్లాడుతూ క్రీడల వల్ల మంచి ఉత్సాహంతో మానసికంగా ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతల సాగర్, కెఎంపిఎల్ నిర్వాహకులు కంటం తిరుపతి, మెరుగు శ్రీనివాస్, నస్పూరి నర్సింగ్, పుస్కురి విక్రం రావు, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై తక్షణ స్పందన



### రోడ్ల మరమ్మతులకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం

**ప్రజాపక్షం/ సిర్పూర్ (టి):** దినపత్రికలో ప్రచురితమైన రోడ్డు సౌకర్యం లేని కథనంపై జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి వెంటనే స్పందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సిర్పూర్ (టి) మండలంలోని మేషన్ కాలనీలో త్వరలో సిసి రోడ్డు ప్రదిపాదనలు మరమ్మతులు అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతులుక సంబంధించిన పనులు త్వరలో దీనికి సబంధించిన ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారని ఎంపిడిఒ సత్యనారాయణ తెలిపారు. సోమవారం రోజు మేషన్ కాలనీలోని రోడ్డు పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించిన గ్రామ పంచాయతీ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి రోడ్డు మరమ్మతులు త్వరలో జరగనున్నాయని తెలియడంతో కాలనీలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పోలీసు కార్యాలయంలో కెఫిటేరియా/క్యాంటిన్ ప్రారంభం






ఎస్‌పి చెన్నూరి రూపేష్

**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా పోలీసుల సంక్షేమమే ధ్యేయంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కెఫిటేరియా/క్యాంటిన్ జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది పని ఒత్తిడి నుండి సేదతీరడానికి కార్యాలయ ఆవరణలో కెఫిటేరియా/ క్యాంటీన్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల నుండి కార్యాలయానికి వచ్చిన సిబ్బంది సేద తీరడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ క్యాంటిన్ నందు నాణ్యతతో కూడిన చాయ్, స్నాక్స్ అందుబాటులో ఉంటాయని జిల్లా పోలీసు అదికారులు, సిబ్బంది, కార్యాలయాన్ని సందర్శించిన విజిటర్స్ కూడా ఈ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, ఏ సంజీవరావు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారి ఇ కళ్యాణి, సంగారెడ్డి, డిఎస్పీ సత్యయ్య, గౌడ్ సైబర్ సెల్ డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, డిటీసీ డిఎస్పీ సురేందర్ రెడ్డి ఏ ఆర్.డిఎస్పీ నరేందర్ డిసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ కిరణ్ ఆర్‌ఐలు రామరావు, (క్యాంటీన్ ఇంచార్జీ) రాజశేఖర్, కాంటీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిరాగ్ పల్లిలో పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పోరేషన్ చైర్మన్ యన్ గిరదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని సొంత డబ్బులతో నిర్మిస్తున్నారు. పాఠశాల నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ మండలం మాజీ ఎంపిపి నారాయణ రెడ్డి హాజరై పూజలు చేసారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు సిద్దం ఉజ్వల్ రెడ్డి ప్రత్యేక పూజలతో పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహరెడ్డి, సీడీసీ చైర్మన్ , ముబీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాస్, చిరాగ్‌పల్లి, గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో పర్యటించిన త్రిపుర రాష్ట్ర గవర్నర్




**ప్రజాపక్షం/ఆర్మూర్:** త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సోమవారం ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటించారు. అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమాన్ని సందర్శించి సీనియర్ సిటిజన్స్‌తో కాసేపు ముచ్చటించారు. అనంతరం మునిసిపల్ కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్దులగుట్టను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు ఆలూరు మండలం గుత్ప గ్రామంలోని అపురూప వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోని టెంపుల్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్, మాజీ అధ్యక్షుడు పెద్దోల్ల గంగారెడ్డి, సీనియర్ నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, తదితరులున్నారు.

# క్రీడ

# శతక్కొట్టిన కేన్ మామ..




## ఆ జట్టుతో దబిడి దిబిడే: రవిశాస్త్రి



ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆతిథ్య పాకిస్థాన్ సెమీస్ చేరితే మరింత ప్రమాదకరంగా మారుతుందని టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ప్రత్యర్థి జట్లను హెచ్చరించాడు. పాకిస్థాన్‌ను ఏ మాత్రం తేలికగా తీసుకోవద్దని సూచించాడు. ఫిబ్రవరి 19 నుంచి ఈ మినీ వన్డే ప్రపంచకప్‌కు తెరలేవనున్న విషయం తెలిసిందే. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో పాకిస్థాన్ హైబ్రిడ్ మోడల్‌లో ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తోంది. భారత్ మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. యావత్ క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారత్‌పాక్ దాయాదుల పోరు ఫిబ్రవరి 23న జరగనుంది. తాజాగా ఈ టోర్నీ గురించి ఐసీసీ రివ్యూలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌తో కలిసి మాట్లాడిన రవి శాస్త్రి.. పాకిస్థాన్ జట్టు పటిష్టంగా ఉందని అభిప్రాయపడ్డాడు. 'యువ ఓపెనర్ సయీమ్ ఆయుబ్ పాకిస్థాన్ జట్టుకు దూరమయ్యాడు. అతను క్వాలిటీ ప్లేయర్. అయినప్పటికీ.. పాకిస్థాన్ ఏ మాత్రం తక్కువ అంచనా వేయవద్దు. పాకిస్థాన్ జట్టుకు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉంది. అంతేకాకుండా గత కొద్ది నెలలుగా పాకిస్థాన్ అద్భుత ప్రదర్శన చేస్తోంది. సౌతాఫ్రికా గడ్డపై మెరుగైన ప్రదర్శన చేసింది. సొంతగడ్డపై ఆ జట్టును ఓడించడం చాలా కష్టం. ఏ జట్టు అయినా సరే తమ దేశంలో ప్రమాదకరంగానే ఉంటాయి. ఒకవేళ పాకిస్థాన్ సెమీస్ చేరితే మాత్రం ఆ జట్టు మరింత ప్రమాదకరంగా మారుతుంది.'అని రవి శాస్త్రి హెచ్చరించాడు.

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆ జట్టు విజయం సాధించింది. సౌతాఫ్రికాతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేన్ విలియమ్సన్, డెవాన్ కాన్వే అసాధారణ బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 304 పరుగులు చేసింది. అరంగేట్ర ప్లేయర్ మాథ్యూ బ్రీట్జ్‌కే(148 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 150) విధ్వంసకర శతకంతో చెలరేగగా.. వియాన్ మల్డర్(60 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 64) హాఫ్ సెంచరీతో రాణించారు. అరంగేట్ర వన్డేలోనే 150 పరుగులు చేసిన తొలి బ్యాటర్ మాథ్యూ బ్రీట్జ్‌కే చరిత్రకెక్కాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ, విల్ ఓ రూర్కీ రెండేసి వికెట్లు తీయగా.. మైఖేల్ బ్రేస్‌వెల్ తలో వికెట్ పడగొట్టారు.

### కేన్ మామ, కాన్వే విధ్వంసం..

అనంతరం న్యూజిలాండ్ 48.4 ఓవర్లలో 4 వికెట్లకు 308 పరుగులు చేసి గెలుపొందింది. కేన్ విలియమ్సన్(113 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. డెవాన్ కాన్వే(107 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 97) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ముతుసామి రెండు వికెట్లు తీయగా.. జూనియర్ డాలా, ఎథన్ బోస్చ్ తలో వికెట్ పడగొట్టారు.


బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న ఈ వికెట్‌పై ఇరు జట్ల బ్యాటర్లు చెలరేగారు. కానీ సౌతాఫ్రికా భారీ స్కోర్ చేయకుండా న్యూజిలాండ్ బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో పరుగులు ఇవ్వలేదు. అనంతరం లక్ష్యఛేధనకు దిగిన న్యూజిలాండ్‌కు డెవాన్ కాన్వేకేన్ మామ రెండో వికెట్‌కు 187 పరుగులు జోడించారు. డారిల్ మిచెల్(10), టామ్ లాథమ్(0) విఫలమైనా.. గ్లేన్ ఫిలిప్స్(28 నాటౌట్) సాయంతో కేన్ మామ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

### ఫైనల్‌కు కివీస్..

ఈ ముక్కోణపు సిరీస్‌లో వరుసగా రెండో విజయం సాధించిన న్యూజిలాండ్ పాయింట్స్ అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్థాన్‌ను న్యూజిలాండ్ ఓడించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో గ్లేన్ ఫిలిప్స్ విధ్వంసకర శతకంతో తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బుధవారం సౌతాఫ్రికాతో పాకిస్థాన్ తలపడనుండగా.. ఈ మ్యాచ్‌లో గెలిచే జట్టుతో ఫిబ్రవరి 14న కివీస్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

## ఫ్లడ్‌లైట్ల వైఫల్యానికి కారణమెవరు?

### ఒడిశా ప్రభుత్వం సీరియస్



**కటక్:** భారత్–ఇంగ్లండ్ మధ్య కటక్ వేదికగా జరిగిన రెండో వన్డే సందర్భంగా ఆటకు ఫ్లడ్ లైట్లు అంతరాయం కలిగించిన విషయం తెలిసిందే. ఫ్లడ్‌లైట్లు వెలుగని కారణంగా బారాబతి స్టేడియంలో 35 నిమిషాల పాటు ఆట నిలిచిపోయింది. దీంతో ఆటగాళ్లు కాసేపు మైదానాన్ని వీడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులూ ఇబ్బంది పడ్డారు. దీంతో ఈ ఘటనను ఒడిశా ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా ఒడిశా క్రికెట్ సంఘానికి షోకాజు నోటీసులు జారీ చేసింది. ''30 నిమిషాలకుపైగా ఆట నిలిచిపోయింది. ఆటగాళ్లు, ప్రేక్షకులూ ఇబ్బంది పడ్డారు. ఈ వైఫల్యానికి కారణమెంటి..? బాధ్యులైన వ్యక్తులు, ఏజెన్సీలు ఎవరో గుర్తించండి. భవిష్యత్‌లో ఇలాంటివి చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో వెల్లడిస్తూ ఒడిశా క్రికెట్ అసోసియేషన్ వివరణ ఇవ్వాలి'' అని ప్రభుత్వం తన నోటీసులో పేర్కొంది. పది రోజుల్లోగా ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఛేదనలో భారత్ 6.1 ఓవర్లలో 48/0తో ఉన్నప్పుడు ఫ్లడ్‌లైట్లు వెలగకపోవడంతో ఆటకు బ్రేక్ పడింది. అయిదు నిమిషాలు వేచి చూసినా వెలగకపోవడంతో ఆటగాళ్లు మైదానాన్ని వీడారు. ''జనరేటర్‌లో సమస్యతో ఫ్లడ్ లైట్ పోయింది. మరో జనరేటర్‌ను తెచ్చి కనెక్షన్‌ను ఇచ్చే సరికి ఆలస్యమైంది'' అని ఓ అధికారి చెప్పాడు. ఈ మ్యాచ్‌కు వచ్చిన 45 వేల మంది ప్రేక్షకులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. స్టేడియంలో ఆరేళ్ల తర్వాత నిర్వహించిన తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఇదే. తాజా వైఫల్యం కారణంగా భవిష్యత్‌లో ఇక్కడ అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణపై ఒడిశా క్రికెట్ అసోసియేషన్ సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## రామ్ చరణ్ నా కొడుకు లాంటి వాడు

**– అల్లు అరవింద్**



మెగా ప్రొడ్యూస్ అల్లు అరవింద్, ఇటీవల తండేల్ చిత్ర ఈవెంట్‌లో స్టార్ ప్రొడ్యూస్ దిల్ రాజుని వేదికపైకి పిలుస్తూ చేసిన కామెంట్స్ మెగా ఫ్యాన్స్‌లో ఆగ్రహాన్ని రేకెత్తించాయి. దీంతో అల్లు అరవింద్‌ను సోషల్ మీడియాలో మెగా ఫ్యాన్స్ తెగ ట్రోలింగ్ చేశారు. అయితే, తాజాగా 'తండేల్' చిత్ర పైరసీపై నిర్మాతలు బన్నీ వాస్, అల్లు అరవింద్ ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ ఇష్యూపై అల్లు అరవింద్ క్లారిటీ ఇచ్చారు. ఆ రోజు వేదికపైకి దిల్ రాజుని పిలిచిన అల్లు అరవింద్, ఒక వారంలో దిల్ రాజు జీవితం ఎలాంటి ఒడిదుడుకులకు గురయ్యిందనే విషయాన్ని వ్యక్తం చేయాలని చూసినట్లుగా తెలిపారు. ఈ క్రమంలోనే తాను దిల్ రాజు సినిమాల గురించి మాట్లాడానని.. అంతేగాని, చరణ్ సినిమాను తక్కువ చేయాలని కాదని అల్లు అరవింద్ అన్నారు. చరణ్ అంటే తనకు కొడుకు లాంటోడు.. తనకు ఉన్న ఏకైక మేనల్లుడు చరణ్ అని.. చరణ్‌కి తాను ఏకైక మేనమామ అని.. తమ ఇద్దరి మధ్య మంచి బాండింగ్ ఉందని.. దయచేసి ఇలాంటి అంశాలతో తమ బాండింగ్‌పై వివాదాలు క్రియేట్ చేయవద్దని ఆయన అభిమానులను కోరారు. దీంతో రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' సినిమాపై అల్లు అరవింద్ కామెంట్స్ చేశారనే అంశానికి ఆయన ఫుల్ స్టాప్ పెట్టినట్లు అయ్యింది. ఇక తండేల్ చిత్రాన్ని పైరసీ చేసి సోషల్ మీడియాలో స్ప్రెడ్ చేస్తున్నవారు.. డౌన్‌లోడ్ చేసుకుని చూస్తున్నవారిపై కూడా త్వరలో చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు అల్లు అరవింద్ తెలిపారు.

# రీల్

## ముగింపు దశలో 'కూలీ' చిత్రీకరణ




సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్టైనర్ 'జైలర్' అద్భుత విజయాన్ని సాధించింది. ఇదిలా ఉంటే ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు కొనసాగింపుగా కూలీ (జైలర్ 2) రాబోతున్న సంగతి తెలిసిందే. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం చెన్నైలో చిత్రీకరణ చేసుకుంటోంది. తాజాగా చెన్నై విమానాశ్రయంలో రజనీపై కీలక సన్నివేశాలను తీశారు. అన్నట్టు త్వరలోనే వైజాగ్, హైదరాబాద్‌లలో ఆఖరి షెడ్యూల్ జరగబోతుంది. ఇక మార్చి నాటికి చిత్రీకరణ పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే ఈ చిత్ర తొలి గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఇది ముస్తాబవుతోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ ఈ జైలర్ 2ను కూడా గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు.

## జీవితం మెడలు వంచి పాఠాలు నేర్పుతుంది




బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్‌పై దాడి అనంతరం ఆయన సతీమణి కరీనా కపూర్‌ను తప్పుపడుతూ అనేక వార్తలు వైరల్ అయ్యాయి. ఈ వార్తల పై బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సతీమణి ట్వింకిల్ ఖన్నా కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. కానీ, కరీనా మాత్రం రియాక్ట్ కాలేదు. కానీ, తాజాగా కరీనా కపూర్ తన ఇన్‌స్టాగ్రాం స్టోరీలో హార్ట్ ఈమోజీతో ఓ పోస్టు పెట్టింది. 'జీవితంలో మనం అనుకునే సిద్ధాంతాలు, ఊహలు ఏవీ వాస్తవాలు కావు. ఇతరుల కంటే మనమే గొప్ప తెలివైనవాళ్లం అనుకుంటాం. సందర్భం వచ్చినపుడు జీవితం మన మెడలు వంచి పాఠాలు నేర్పుతుంది'' అని కరీనా కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది. తన భర్త సైఫ్ అలీఖాన్‌పై ఇటీవల ఓ ఆగంతుకుడు కత్తితో జరిపిన ప్రాణాంతక దాడి తర్వాత, కరీనా పెట్టిన ఈ పోస్టు మొత్తానికి వైరల్‌గా మారింది. పైగా ఈ పోస్ట్‌లో ఆమె ఇంకా రాసుకొస్తూ.. 'ఈ పెళ్లిళ్లు, విడాకులు, ఆందోళనలు, పిల్లలు పుట్టడం, ఆత్మీయుల మరణాలు, పిల్లల పెంపకం.. ఇవన్నీ మనదాకా వస్తేనే పూర్తిగా అర్థమవుతాయి' అని కరీనా రాయడం విశేషం. 'ఏమి జరిగిందో మాకే ఇప్పటికీ పూర్తిగా అర్థం కావడం లేదు. ఈ కష్ట సమయంలో కనికరం లేని ఊహాగానాలు, కథనాలకు దూరంగా ఉండాలని కరీనా రాసుకొచ్చింది.

## మరో ఎంటర్‌టైనర్‌తో శ్రీ విష్ణు




టాలీవుడ్‌లో కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనే బిరుదు తెచ్చుకున్న యంగ్ హీరో శ్రీ విష్ణు వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకెళ్తున్నాడు. ఆయన నటించే సినిమాలు పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలుగా ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. ఇక ఈ హీరో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సింగిల్'. కార్తిక్ రాజు డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. లవ్ అంటే ఏమాత్రం ఇష్టం లేని పాత్రలో శ్రీవిష్ణు మరోసారి సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రాబోతున్నాడు. ఈ సినిమాలో శ్రీ విష్ణు సింగిల్‌గా ఉన్నాడంటూ అతని పాత్రను ఇంట్రడ్యూస్ చేశాడు కమెడియన్ వెన్నెల కిషోర్. అయితే, అతడిని ఇద్దరు అమ్మాయిలు ప్రేమిస్తున్నారని ఈ సినిమా కథలోని నేపథ్యాన్ని తెలియజేశాడు. ఇక మిగతా విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందేనని ఆయన తెలిపినట్లు ఈ వీడియో గ్లింప్స్ ముగించారు. మొత్తానికి శ్రీవిష్ణు ఈ సారి ట్రై యాంగిల్ లవ్ స్టోరీతో పాటు బోలెడంత ఎంటర్‌టైన్‌మెంట్‌ను కూడా పట్టుకొస్తున్నాడు. ఇక ఈ సినిమాలో అందాల భామ కేతిక శర్మ, ఇవానా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.



గుండె సంబంధిత వ్యాధితో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఎల్.చెన్నయ్యను సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పరామర్శించారు.

## పన్ను మినహాయింపు కంటితుడుపు

### లోక్‌సభ చర్చలో ప్రతిపక్షాల ధ్వజం

**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్‌పై సోమవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా పన్ను మినహాయింపు కంటి తుడుపువంటిదని, విడతల వారీగా వచ్చే 'షుగర్ రష్'లాంటిదని, దీర్ఘకాలిక ప్రయోజనాలు కొరవడ్డాయని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. కాగా దీనిని అధికారవర్గాలు 'బూస్టర్'గా వర్ణించాయి. రూపాయి పతనం, ప్రభుత్వ రుణం పెరుగుదల, రైతుల దుస్థితి అంశాలపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తంచేశాయి. బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినదిగా ఉందని, భిన్న వర్గాల ప్రయోజనాలను విస్మరించినట్టు పేర్కొన్నాయి. డిఎంకెకు చెందిన దయానిధి మారన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఉపయోగం లేని విధంగా కార్పొరేట్లను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపొందించారన్నారు. నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయని, ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారిందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధి పొందేందుకు మోడి ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లకు రూపకల్పన చేశారని ఆరోపించారు. రూపాయి క్షీణతపై ప్రతిపక్షాలు నిరసన తెలిపినపుడల్లా ఆర్థిక మంత్రి సీతారామన్ రూపాయి బలహీనపడలేదని, డాలర్ బలపడినట్టు సభను నమ్మించే ప్రయత్నం చేశారన్నారు. పన్ను మినహాయింపు ప్రకటనలతోనే బిజెపి ఢిల్లీ అసెంబ్లీలో అధికారం కైవసం చేసుకుందని, కానీ బడ్జెట్ వల్ల దేశవ్యాప్తంగా కేవలం మూడు కోట్లమంది మాత్రమే లబ్ధి పొందారన్నారు. పన్ను మినహాయింపు మధ్య తరగతి వర్గాలపై 'ఎకనామిక్ షుగర్ రష్'లా పనిచేసిందన్నారు. కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ రుణం బాగా పెరిగిందని, ఇది భావి తరాలపై భారం కానున్నదన్నారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలతో సామాన్య ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. బిజెపి సభ్యుడు అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ బలాన్ని రెట్టింపు చేసేదిగా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 'బ్యాండ్ ఎయిడ్ బడ్జెట్'గా పేర్కొన్న బడ్జెట్ బూస్టర్ షాట్‌వంటిదని ప్రతిపక్షాల ఆరోపణలను తోసిపుచ్చారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు దేశంలో స్టార్టప్ కంపెనీలకు ఊతమిచ్చేదిగా ఉన్నాయని హమీర్‌పూర్ ఎంపి అన్నారు. ఎన్‌సిపి సభ్యురాలు సుప్రియ సూలె బడ్జెట్‌ను స్వాగతిస్తూనే దేశంలో ఆర్థిక వృద్ధి మందగమనంగో సాగుతోందన్నారు. ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్ అని, దేశ ఆర్థిక స్థితికి వ్యతిరేకమని టిఎంసి నేత కళ్యాన్ బెనర్జీ అన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బడ్జెట్ అనుకూలంగా లేదన్నారు. దేశంలో కొద్ది మంది ఆదాయం మాత్రమే మెరుగుపడిందని, అత్యధికుల ఆదాయంలో పెరుగుదల అంతంత మాత్రమే అన్నారు. బడ్జెట్‌పై అధికార సభ్యులు మాట్లాడుతూ పదేళ్ల క్రితం రూపాయి ఐసియులో ఉండగా, ప్రస్తుతం అది బలహీనంగా మాత్రమే ఉందని ప్రభుత్వానికి మద్దతు పలికారు. సమాజ్ వాది పార్టీకి చెందిన ఇఖ్రా చౌదరి, కాంగ్రెస్‌కు చెందిన అమరిందర్ సింగ్ రాజా ఇది ప్రజా వ్యతిరే క బడ్జెట్‌గా పేర్కొన్నారు.

## కంట మంట

(మొదటి పేజీ తరువాయి)

త్వరలోనే రైతు సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నప్పటికీ అది జరగక పోగా వ్యాపారుల వైఖరిలో కూడా ఎటువంటి మార్పు లేదు. గత రెండేళ్లు మిర్చి ధర క్వింటా ఒక్కింటి రూ.20వేలు పైబడి పలకడంతో ఈ ఏడాది మిర్చి సాగుపై రైతులు దృష్టిసారించారు. సాగు పెరగడంతో పాటు ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. తెగుళ్లు, అననుకూల వాతావరణం పెట్టుబడులు పెరిగేందుకు కారణం కాగా మిర్చి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గడిచిన రెండేళ్లు మిర్చికి ధర ఉండడంతో కౌలును అమాంతం పెంచేశారు. పూర్తి నీటి వసతి కలిగిన ఎకరం కౌలు రూ. 25వేల నుంచి రూ. 35 వేల వరకు వెళ్లింది. ముందస్తు కౌలు చెల్లింపులతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనక తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మిర్చి రైతులను దగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## పరీక్షలే జీవితం కాదు

(మొదటి పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమయాన్ని నియంత్రించుకోవడం, జీవితంపై అదుపు తెచ్చుకోవడం, ప్రస్తుతంలో జీవించడం, ఆశావహ దృక్పథం, ఎదిగేందుకు కష్టపడడం నేర్చుకోవాలన్నారు. పిల్లలను ఇతరులకు ఆదర్శంగా చూపించేందుకు వారిపై ఒత్తిడి తేవడం, ఇతరులతో పోల్చడం మానుకోవాలని, వారికి మద్దుతగా నిలవాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. 10, 12 తరగుతులలో మంచి మార్కులు సాధించకపోతే వారి జీవితం ముగిసినట్టేనన్న భావన సమాజంలో పాతుకుపోయిందని, తక్కువ శ్రేణి విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే వాతావరణం ఇళ్లలో నెలకొనడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులు వాటిపట్ల ఆందోళన చెందకుండా సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మంచి మార్కులు రానంతమాత్రాన జీవితం ముగిసిపోయిందని భావించవద్దన్నారు. ఒత్తిడి జయించేందుకు సుఖ నిద్ర ప్రాముఖ్యాన్ని కూడా ప్రధాని వివరించారు. స్టేడియంలో ప్రేక్షకుల హోరు మధ్య ఏకాగ్రత చెదరకుండా బ్యాటింగ్ చేసే బ్యాటర్‌లా విద్యార్థులు ఒత్తిడిని జయించాలన్నారు. గత ఫలితాలను మెరుగుపరచుకునే దిశగా విద్యార్థులు నిరంతరం కృషి చేయాలన్నారు. ధ్యానం, పోషకాహారం ఆవశ్యకతనుకూడా మోడి ప్రస్తావించారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలంటే జట్టుగా పనిచేయడం, ఓర్పు, విశ్వాసం చూరగొనడం వంటి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. నాయకుడి లక్షణాలను వివరిస్తూ ఆకట్టుకునే వస్త్రధారణతో ఉపన్యాసాలు ఇవ్వడం కాదని, ఇతరుల తప్పులను సరిదిద్దడంకంటె మిమ్మల్ని మీరు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవడమన్నారు. ఇందుకు ఒక ఉదాహరణ పేర్కొంటూ ఉపాధ్యాయుడు హోంవర్క్ ఇచ్చినపుడు లీడర్ అనేవాడు దానిని ముందుగా పూర్తి చేయడమే కాకుండా, ఇతరులు కూడా పూర్తి చేయడంలో సహాయపడినపుడే లీడర్‌గా ఎదుగుతాడు అని వివరించారు. ఈ యేడాది జరిగిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాలలో నటి దీపిక పదుకునె, బాక్సర్ మేరీ కోమ్, ఆధ్యాత్మిక గురువు సద్గురు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ప్రతి యేటా జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోడి బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులతో పరస్పర చర్చలతో వారి సందేహాలను తీర్చుతుంటారు. 2018 ఫిబ్రవరిలో తల్కతోరా స్టేడియంలో తొలి విడత 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంజరిగింది. అప్పటినుంచి ప్రతి యేటా ప్రధాని మోడి విద్యార్థులతో ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు.

## లోపాయికారి ఒప్పందం








(మొదటి పేజీ తరువాయి)

పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహాతో పాటు, శాసనమండలి సభ్యుడు జీవన్ రెడ్డి, ఆయా జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపితో కెసిఆర్ లోపాయికార ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అన్ని కోణాల్లో నుంచి పరిశీలించి సత్తా ఉన్న నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశామని తెలిపారు. నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అండగా నిలుస్తోందని తెలిపారు. కాంగ్రెస్ అంటే కమిట్‌మెంట్ పార్టీ అని కొనియాడారు. కెసిఆర్ ఏడాదికి 5 వేల ఉద్యోగాలిస్తే సిఎం రేవంత్ రెడ్డి నెలకు 5 వేల ఉద్యోగాలు ఇస్తున్నారని చెప్పారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ రూపాయి సైతం తీసుకురాలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై నలుగురు ఎంపిలు సమాధానం చెప్పాలన్నారు. భారతదేశ చరిత్రలో కులగణన చేసిన పార్టీ కాంగ్రెస్ అని, మాట ఇస్తే తప్పకుండా నిలబడే పార్టీ అని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంవత్సరం వ్యవధిలోనే 55వేల ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. పదివేల ఉపాధ్యాయ ఉద్యోగాలను నియమించామని తెలిపారు. గడిచిన పదేళ్లలో ఉపాధ్యాయ నిమాకాల భర్తీని నాటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కో రారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ పట్టభద్రుల విద్యావ్యవస్థను మార్పు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అర్బన్ నక్సలైట్లను ప్రోత్సహిస్తుందంటూ బిజెపి చేసిన ఆరోపణలను తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక పార్టీ అని గుర్తుచేశారు. మతతత్వం బిజెపిని ఓడించాలని కోరారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, మండలిలో ప్రశ్నించే బలమైన అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ కరీంనగర అంటే కదనరంగం గల చారిత్రక గడ్డ అని, కాంగ్రెస్ జెండా కరీంనగర్‌లో ఎగరాలని పిలుపునిచ్చారు. ఏడాదిలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఐక్యతను విడగొట్టడం తప్ప బిజెపికి మానవత్వం, మంచితనం లేదన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, పట్టభద్రులందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తన విజయాన్ని కాంగ్రెస్ పార్టీ గిఫ్టగా అందిస్తానన్నారు. జీవన్ రెడ్డి తనకు రోల్ మోడల్ అని, ఆయన స్ఫూర్తితో పని చేస్తానని తెలిపారు. సింగరేణిలో మైనింగ్, ఆదిలాబాద్‌లో గిరిజన యూనివర్సిటీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు రావాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇప్పిస్తానని చెప్పారు. బిజెపి మతతత్వ పార్టీ అని, బిజెపి అభ్యర్థజ అజ్ఞాని అని ఆరోపించారు. ఈ ఎన్నికలు జ్ఞానికి అజ్ఞానికి జరుగుతున్న పోటీయేనని చెప్పారు.

### ఫాంహౌస్ నేతకు ప్రతిపక్ష హోదా ఎందుకు...?

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ఫాం హౌజ్‌కే పరిమితమైన కెసిఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం సిద్ధిపేట జిల్లా కొడకండ్ల శివారులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికిన సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డితో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గత ఎంపీ ఎన్నికల మాదిరిగానే బిజెపితో బిఆర్ఎస్ పార్టీ చీకటి ఒప్పందం చేసుకొని మద్దతు ఇస్తోందని ఎద్దేవా చేశారు. కెసిఆర్ కు ఆరోగ్యం సహకరించకపోతుండడతో బిఆర్ఎస్ పార్టీలో మూడుముక్కలాట జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంక్షారెడ్డి, నేతలు శ్రీనివాస్ రెడ్డి, మోహన్, సమీర్, గంగిశెట్టి రాజు, షరీఫ్, రాములు గౌడ్, రమేష్ గౌడ్, జహీర్, గాడిపల్లి శ్రీనివాస్, కన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com